
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల నొప్పులకు పసమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :25 | సంచిక :07 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శుక్రవారం 15 మె 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


## ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు పరిష్కరిస్తాం

**: మంత్రి ఉత్తమ్**



**ఖమ్మం జిల్లా, మే 14 :** రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. ఈరోజు(గురువారం) కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు.ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీచేశారు.

## బెంగాల్ సీన్ రిపీట్ అవుతుందా

**హైదరాబాద్, మే 14:**తెలంగాణా రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకుని రావాలని ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. తమ పార్టీకి ఒక్క చాన్స్ ఇవ్వాలని ఆయన తెలంగాణా ప్రజలకు వినతి చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ కి అధికారం ఇస్తే తెలంగాణా ప్రగతిపథంలో దూసుకుని పోతుందని మోడీ చెప్పుకొచ్చారు. తెలంగాణా రాష్ట్రాన్ని పాలకులు అవినీతి మయం చేశారు అని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ ఏలుబడిలో ఎక్కువ అవినీతి జరిగిందని అన్నారు. అందుకే ఆ పార్టీ ప్రభుత్వాన్ని గద్దె దించారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ళు పై దాటిందని కానీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అభివృద్ధి చేయకుండా నమ్మించి మోసం చేస్తోంది అని నరేంద్ర మోడీ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను ప్రజలు తరిమికొట్టి కాషాయానికి పట్టం కట్టాలని ఆయన కోరారు.పశ్చిమ బెంగాల్ ప్రజలు అక్కడ



అవినీతి ప్రభుత్వాన్ని ఓడించి బీజేపీ పాలనకు పట్టం కట్టారు అని మోడీ చెప్పుకొచ్చారు. దేశమంతటా బీజేపీ ప్రభంజనం వీస్తోందని ఆయన చెప్పారు. ఇక బీఆర్ఎస్ కాంగ్రెస్ లను ఓడించి ఈసారి చాన్ బీజేపీకి ఇవ్వమని ఆయన కోరారు. ఒక్క చాన్స్ ఇస్తే

- మిగతా3లో



## దేశ సమగ్ర ప్రగతికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకం

**హైదరాబాద్:**ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు చేసిన '7 విజ్ఞప్తుల'పై రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత తరుణంలో 'జన్ భాగీదారీ' (ప్రజా భాగస్వామ్యం) అనేది అత్యంత ఆవశ్యకమని నేను స్పష్టం చేశాను. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఈ జాతీయ యజ్ఞంలో తమ వంతు కృషి చేయాలని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ సూచనలకు ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవు. అవి దేశ ఆర్థిక భద్రత, సామాజిక బాధ్యత మరియు దీర్ఘకాలిక జాతీయ ప్రయోజనాలకు ముడిపడి ఉన్న అంశాలు. 'వోకల్ ఫర్ లోకల్' అనే స్ఫూర్తితో.. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, మన దేశీయ ఆర్థిక వ్యవస్థను రక్షించుకోవడంతో పాటు దాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, ప్రజలు అనవసర ఖర్చుల విషయంలో సంయమనం పాటించాలి. తన కాన్వాయ్లోని వాహనాల సంఖ్యను తగ్గించుకోవడం ద్వారా స్వయంగా ప్రధానమంత్రే మనందరికీ గొప్ప ఆదర్శంగా నిలిచారు. గౌరవ ప్రధాని ఇచ్చిన ఈ పిలుపును స్ఫూర్తిగా తీసుకుని, జాతి నిర్మాణంలో చురుకుగా పాల్గొనాలని తెలంగాణ ప్రజలందరికీ నేను మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను. దేశ సమగ్ర ప్రగతికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. .

## తెలంగాణ అభివృద్ధికి మెగా గ్రోత్ కారిడార్లు కీలకం

**సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్:**వరంగల్, కరీంనగర్, ఖమ్మంకు ఔటర్ రింగ్ రోడ్లు 25 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, ప్రధాన పట్టణాలు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల కోసం మెగా గ్రోత్ కారిడార్లను ఏర్పాటు చేసి ఏకరీతి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాల గ్రోత్ కారిడార్లు అత్యంత కీలకమని పేర్కొంటూ, ఆయా నగరాలకు ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదిత గ్రోత్ కారిడార్ల అభివృద్ధి ప్రణాళికలపై సమగ్ర చర్చ జరిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కనీసం వచ్చే 25 ఏళ్లకు సరిపోయేలా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్ల ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక గ్రోత్ కారిడార్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. అలాగే కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసే కారిడార్ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.నల్గొండ నుంచి యాదగిరిగుట్ట వరకు టెంపుల్ కారిడార్ అభివృద్ధి చేయాలని, ఆదిలాబాద్,నాగోబా,బాసర, కడెం ప్రాజెక్టులను అనుసంధానిస్తూ ప్రత్యేక టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలని సూచించారు. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని అలంపూర్ జోగులాంబ ఆలయ పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు.సింగరేణి పరిధిలోని అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులను స్థానిక ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని సూచించారు.గ్రోత్ కారిడార్లలో ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు,

- మిగతా3లో

## కేటీఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ బృందం భేటీ



**హైదరాబాద్** : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో భారత్‌లోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ , కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ భేటీ అయ్యారు. నందినగర్‌లో జరిగిన ఈ భేటీలో పరస్పర ప్రయోజనాలు , వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ఈ సమావేశంలో ప్రస్తావించారు. గతంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవమున్న కేటీఆర్ ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. తెలంగాణ ,ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని ఇరువురు ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ , ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఈ చర్చలు కొనసాగాయి. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీ పట్ల కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ భాగస్వామ్యం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని ఆయన అన్నారు.

## బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరైన ప్రధాని మోదీ..



**న్యూఢిల్లీ:** దేశ రాజధానిలో జరుగుతున్న బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. బిక్స్ సభ్య దేశాల విదేశాంగ మంత్రులు, పరిశీలక దేశాల ప్రతినిధులను ప్రధాని మోదీ కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఉన్నత స్థాయి దౌత్య సమావేశంలో పాల్గొంటున్న సభ్య, భాగస్వామ్య దేశాల మంత్రులు, ప్రతినిధులతో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోలు దిగారు. ఈరోజు (గురువారం) నుంచి మే 15 వరకు బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశాలకు న్యూఢిల్లీ ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రధాని మోదీ రావడానికి ముందు ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన వివిధ దేశాల విదేశాంగ మంత్రులు, ప్రతినిధులు, అలాగే పరిశీలక దేశాల విదేశాంగ మంత్రులు, ప్రతినిధులకు కేంద్ర మంత్రి జైశంకర్ స్వాగతం పలికారు. ఈ సదస్సుకు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి, దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి రోనాల్డ్ లామోలా, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వీరాతో ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనో, ఇథియోపియా మంత్రి గెడియన్ తిమోతేవోస్ హెస్సెబోన్, యూఏఈ విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఖలీఫా షహీన్ అల్ మరార్ హాజరయ్యారు.ఈ సమావేశాల్లో ఆర్థిక సహకారం, సంస్కరణలు, వాణిజ్యం, అభివృద్ధి, ప్రపంచ, ప్రాంతీయ ప్రాముఖ్యత కలిగిన కీలక అంశాలపై చర్చించనున్నారు. కాగా, ఈ ఏడాది జనవరి 1 నుంచి బ్రిక్స్ కూటమికి భారతదేశం అధ్యక్షత వహిస్తోంది. ఈ కూటమికి భారత్ అధ్యక్షత వహించడం ఇది నాలుగోసారి. అలాగే 2012, 2016, 2021 సంవత్సరాల్లో కూడా బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు భారత్ ఆతిథ్యమిచ్చింది.

## నీట్ పరీక్ష రద్దుపై పారదర్శక విచారణ జరగాల్సిందే

**సీఎం రేవంత్ రెడ్డి..**



**హైదరాబాద్:** నీట్ యూజీ 2026 పరీక్ష రద్దుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష రద్దుతో లక్షలాది మంది విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది విద్యార్థులు షాక్‌కు గురయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున కేంద్రానికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తును పేపర్ లీక్ ఘటనలు దెబ్బతీస్తున్న నేపథ్యంలో పరీక్షల విశ్వసనీయతను కేంద్రం కాపాడాలని రేవంత్ రెడ్డి కోరారు. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు మళ్లీ ఇబ్బందులు పడకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే, నీట్ అక్రమాలపై పారదర్శకంగా దర్యాప్తు జరపాలని కోరారు. పోటీ పరీక్షలు అవకాశాల వేదికగా ఉండాలే తప్ప విద్యార్థుల జీవితాలను నాశనం చేసేలా మారకూడదని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ వంటి వాటిల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య పోలిక ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.

## ఆగని మిల్లర్ల మాయజాలం



**నిజామాబాద్, మే 14:**మిల్లర్ల మాయజాలానికి రైతన్నలు బలవుతున్నారు. ప్రభుత్వం ఒక వైపు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని అమ్ముకొని మద్దతు ధర పొందాలని చెప్తున్నా ఆచరణలో మాత్రం రైతన్న లు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ప్రతి సీజన్లో లక్షల క్వింటాళ్ల ధాన్యం తరుగు పేరిట కొనుగోలు కేంద్రాల్లో నొక్కేయడమే కాకుండా మిల్లర్లు సైతం తరుగు తీసి కాంటా పెట్టుకుంటున్నారు. దీంతో రెండు చోట్ల రైతన్నలు నిలువు దోపిడీకి గురవుతున్నారు. కామారెడ్డి జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు అసలే ఆలస్యంగా ఏర్పాటు చేసిన అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తెచ్చిన ధాన్యాన్ని తరువు పేరుట నిలువు దోపిడికి గురిచేస్తున్నారు. క్వింటాలకు నాలుగు కిలోల నుంచి 10 కిలోల వరకు తరుగు తీస్తు తూకం వేస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రం క్వింటాలకు నాలుగు కిలోలు మాత్రమే తరుగు తీస్తున్నట్లు నటిస్తున్నారు. నిత్యము మాత్రం రైతులను తరుగు పేరిట నిలువు దోపిడికి గురిచేస్తున్నారు.రైస్ మిల్లర్లు, అధికారులు, కొనుగోలు కేంద్రాల

- మిగతా3లో

# సంపాదకీయం

## దక్షిణాపథంలో బీజేపీ జైత్రయాత్ర ఎప్పుడు?

కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో కొన్ని దశాబ్దాల పాటు ఎర్ర కెరటాలు ప్రతి ఏటా ఉప్పొంగేవి. కానీ ఈ మే 9న కాషాయ అలలు పరవళ్లు తొక్కాయి. ప్రధానమంత్రి మోదీ, వేలాది ప్రజల సమక్షంలో సువేందు అధికారి బీజేపీ తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సరిగ్గా ఒక రోజు తర్వాత ఆదివారంనాడు దక్షిణాదిన చెన్నైలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సినీనటుడు చంద్రశేఖరన్ జోసెఫ్ విజయ్ జాతీయ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సమక్షంలో తమిళనాడు 9వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ పట్టాభిషేకానికీ అంతే భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో బలంగా వేళ్లూనుకుని, పశ్చిమాన గుజరాత్, మహారాష్ట్రల్లో, ఈశాన్య రాష్ట్రాలైన అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపురలో, తూర్పు, కోస్తా ప్రాంతంలో తొలుత ఒడిషా, ఇప్పుడు బెంగాల్‌లో విస్తరించిన భారతీయ జనతా పార్టీ దక్షిణాదిలో అడుగుపెట్టడం అంత సులభం కాదని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. అటు సువేందు అధికారి, ఇటు జోసెఫ్ విజయ్ ఈ పరిణామాలకు ప్రతిఫలనాల్లా కనిపిస్తున్నారు. ఈ రెండు ఘట్టాలు భారత దేశ ప్రజల ఆలోచనా దృక్పథంలో రెండు భిన్న కోణాలను ప్రతిబింబిస్తున్నాయా? బెంగాల్‌లో సువేందు అధికారి పక్కన నిలబడిన నరేంద్రమోదీ ఇప్పుడు దక్షిణాదిలో విస్తరించేందుకు ఉవ్విళ్లూరుతుంటే, కేరళలో విజయం సాధించి, జోసెఫ్ విజయ్ పక్కన నిలబడ్డ రాహుల్‌గాంధీ ఉత్తరాదిలో పూర్వవైభవాన్ని సంతరించుకునేందుకు ఎన్ని యత్నాలు చేసినా ఫలితాలు సాధించలేకపోతున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్‌ను ప్రతిఘటించిన దక్షిణాది రాష్ట్రాలు బీజేపీని ఏమంత ఆహ్వానించలేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో బీజేపీ ప్రవేశించేందుకు చేయని ప్రయత్నం లేదు. అమలు చేయని ప్రయోగం అంటూ లేదు. ఏపీలో తెలుగుదేశం ఆధిపత్యాన్ని అంగీకరించిన బీజేపీ కర్ణాటకలో ఉన్న అధికారాన్ని కోల్పోయి, మళ్లీ పట్టుకోసం నానా యత్నాలు చేస్తోంది. తమిళనాడులో స్వంతంగా బలపడడం కష్టమని గ్రహించిన తర్వాత మళ్లీ అన్నాడీఎంకేతో చేతులు కలపక తప్పలేదు. కేరళలో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి 3 సీట్లు సాధించిన బీజేపీ ఓట్ల శాతం మాత్రం గతంతో పోలిస్తే ఏమంత పెరగలేదు. కేరళ, తమిళనాడులో బీజేపీ ప్రవేశించడం సుదూర స్వప్నమైతే అవకాశం ఉన్న రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ మాత్రమే. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఈ రెండు రాష్ట్రాల్లో పర్యటించారు. అయితే కర్ణాటక, తెలంగాణల్లో మోదీ పర్యటన భిన్న రీతుల్లో సాగింది. కర్ణాటకలో జాతీయవాద రాజకీయాలవైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారని, త్వరలో కాషాయ ప్రభంజనం ఆ రాష్ట్రంలో వీస్తుందని చెప్పిన మోదీ తెలంగాణలో మాత్రం ఆ విశ్వాసాన్ని ప్రకటించలేదు. 1984లో దేశ వ్యాప్తంగా కేవలం బీజేపీ గెలుచుకున్న రెండు స్థానాల్లో ఒకటి గుజరాత్‌లోని మెహసానా కాగా, రెండవది తెలంగాణలో హన్మకొండ. ఇప్పుడు గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రాగా, తెలంగాణలో మాత్రం అనుకున్నంతమేరకు విస్తరించలేక పోతోంది. ఈ విషయాన్ని స్వయంగా మోదీయే రాష్ట్ర నేతల దగ్గర ప్రస్తావించి వారిని విమర్శించారు. బండి సంజయ్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు బీజేపీ కేడర్‌లో కొంత ఊపు వచ్చింది కాని ఆ తర్వాత ఆ ఉత్సాహం క్రమంగా నీరుకారిపోయింది. సంఘ్ పరివార్ సంస్థలైతే హిందుత్వ దిశగా ప్రజల్ని మళ్లించగలవు కాని రాజకీయంగా ప్రజల్లో కదలిక తేవాల్సింది బీజేపీ నేతలే. మోదీ తాజా పర్యటనలో బీజేపీ నేతలకు బహిరంగంగా ఎలాంటి దిశానిర్దేశం చేయలేదు. ఉత్తరాది, బెంగాల్‌లో అవలంబించిన పద్ధతులు దక్షిణాదిన పనిచేయవని ఆయనకు తెలుసు. అయితే తెలంగాణకు సంబంధించి మోదీ వద్ద ఏదో వ్యూహమే ఉన్నట్లు ఆయన మాటలు, సమావేశాలు అనుమానాలు కలిగిస్తున్నాయి. అదేమిటో కాలమే చెబుతుంది. బెంగాల్‌లో బీజేపీ విజయంతో మమతా బెనర్జీ తర్వాత కమలనాథులను ఢీకొనగల శక్తులంతా ఒక్కొక్కరూ మాయవుతున్నట్లు కనిపిస్తోంది. అదే సమయంలో జాతీయ పార్టీ కాంగ్రెస్ అయినా కనీసం బీజేపీని ఢీకొనగలదా అన్న ప్రశ్న తలెత్తుతోంది. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఐక్యం చేసేందుకు ప్రయత్నించిన నాయకులు అందరూ ఒక్కొక్కరూ కుప్పకూలిపోయారు. నితీశ్‌కుమార్, మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, కేసీఆర్, శరద్‌పవార్, కేజ్రీవాల్, ఉద్ధవ్ ఠాక్రే అందరూ మోదీని వ్యతిరేకించి ప్రతిపక్షాలను ఏకం చేయాలనుకున్నవారే. 2023లో ప్రతిపక్షాలను ఏకం చేసేందుకు తీవ్ర యత్నాలు చేసిన నితీశ్ తర్వాత అధికారం కోసం బీజేపీ వైపు మళ్లి, ఇప్పుడు బీజేపీకే అధికారాన్ని వదులుకున్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాలు చేయగలిగిన నేతల నందరినీ మోదీ చతుర్విధోపాయాలు ఉపయోగించి పక్కకు తప్పించారు. వీరెవరూ జాతీయ స్థాయిలో ఇప్పుడు మోదీని ఎదుర్కోగలిగేందుకు చేయగలిగింది ఏమీ లేకపోగా, రాష్ట్ర స్థాయిలో మనుగడకు పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సీపీని చీల్చి ప్రాబల్యం సంపాదించిన బీజేపీ ఆమ్ ఆద్మీ పార్టీలో కూడా తిరుగుబాటును ప్రేరేపించింది. తమిళనాడులో కొత్త శక్తి ఆవిర్భవించినప్పటికీ లోక్‌సభ ఎన్నికలు జరిగే వరకు ఈ శక్తి తన బలం ఎంతమేరకు పుంజుకుంటుందో ఇప్పుడే చెప్పలేం. వామపక్షాలకు ఉన్న ఏకైక ప్రభుత్వం ఇప్పుడు కాంగ్రెస్ వశమైంది. పార్లమెంటులో వామపక్షాల ఉనికి క్రమంగా క్షీణించిపోతోంది. ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలు బలహీనపడంతో బీజేపీని కాంగ్రెస్ మాత్రమే ఒంటరిగా ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బహుశా బీజేపీ కూడా అదే కోరుకుంటుందేమో. బీజేపీ వ్యతిరేక రాజకీయాలు బలహీనపడడమో, ఆవశ్యకత కోల్పోవడమో స్పష్టంగా కనపడుతోంది. అది నాయకత్వస్థాయిలోనూ, సైద్ధాంతిక స్థాయిలోనూ ప్రస్ఫుటిస్తోంది. దానివల్ల దక్షిణాదిలో కూడా బీజేపీతో చేతులు కలిపేందుకు, దాని రాజకీయ సిద్ధాంతాన్ని ఆమోదించేందుకు పార్టీలు ఏ మాత్రం వెనుకాడడం లేదు. బీజేపీ వ్యతిరేకత సోషల్ మీడియా కాగితపు పులులకు మించి జనంలోకి వ్యాపించేందుకు ఎంత సమయం పడుతుందో చెప్పలేము. స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాలపాటు రాజ్యమేలిన కాంగ్రెస్ ఆ తర్వాత క్రమంగా బలహీనపడింది. అప్పుడు జనసంఘ్, బీజేపీ పరిస్థితి ఏ విధంగా ఉన్నదో ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి కూడా అదే విధంగా మారింది. కేవలం రెండేళ్లలో బీజేపీ తూర్పున ఒడిషా, బిహార్, పశ్చిమబెంగాల్‌లో అధికారంలోకి రాగలిగింది. అసోంలో మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. పశ్చిమాన రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలో బీజేపీకి స్వంత ముఖ్యమంత్రులున్నారు. గుజరాత్‌లో 30 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్నది. ఒక్క జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ తప్ప హిందీ బెల్ట్ అంతటా బీజేపీ ముఖ్యమంత్రులున్నారు. పంజాబ్‌లో కూడా ఇప్పటికే బీజేపీ చాపక్రింద నీరులాగా ప్రవేశించేందుకు పథకాలు మొదలుపెట్టింది. ఉత్తర, తూర్పు, పశ్చిమాన ఆధిపత్యం నిరూపించుకోగలిగిన బీజేపీకి దక్షిణాదిలో ప్రవేశించడం అసాధ్యమా? అయితే ఎన్నికల రాజకీయాల్లో బీజేపీ ఎంత తలపండిపోయిందంటే ఆ పార్టీని ఓడించడం అసాధ్యమనే స్థితి ఏర్పడింది. ఎన్నికల్లో బీజేపీ విజయ సూత్రాన్ని ఎవరూ ఛేదించలేకపోతున్నారు. గెలిచేందుకు ఏ సాధనాన్ని బీజేపీ వదిలిపెట్టదు, అది నైతికమా, అనైతికమా అన్న చర్చతో ఆ పార్టీకి నిమిత్తం లేదు. 'సర్' వల్ల 31 స్థానాల్లో బీజేపీ తమపై గెలిచిందని తృణమూల్ కాంగ్రెస్ నేతలే అంగీకరించినందువల్ల మిగతా స్థానాల్లో గెలిచేందుకు బీజేపీ ఇతర వ్యూహాలు ప్రయోగించి ఉండాలి. ఏ పార్టీకైనా ఎల్లకాలమూ శిఖర స్థాయిలో ఉండడం సాధ్యం కాదు. బీజేపీ ఆ స్థాయి కోల్పోవాలంటే తన పతనానికి తానే కారణం కావాలి. ఆ పార్టీని గద్దెదించగల ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఆవిర్భవించాలి. ప్రజలు అడుగడుగునా వ్యతిరేకించగల పరిస్థితులు రావాలి. ఈ మూడూ సమీప భవిష్యత్తులో జరిగే అవకాశాలు కనపడడం లేదు. సాధారణంగా ప్రభుత్వ పాలన పట్ల కనపడే వ్యతిరేకతను కూడా బీజేపీ అధిగమించింది. ప్రభుత్వ వ్యతిరేకతను తటస్థం చేయడంలో బీజేపీ నేతలు దిట్టలు. అసోంలో రెండుసార్లు అధికారంలో ఉన్న తర్వాత కూడా కాంగ్రెస్ బీజేపీని ఓడించకపోగా ముఖ్యమంత్రి పదవికి అభ్యర్థి, మూడుసార్లు ఎంపీ అయిన గౌరవ్ గొగోయ్ కూడా 23వేల ఓట్ల తేడాతో ఓడిపోయారంటే ఏమనాలి? 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగే లోపు బీజేపీని ఓడించగల సత్తాను ప్రతిపక్షాలు ఎంత మేరకు సాధించగలుగుతాయో చెప్పలేం. కేరళలో వామపక్షాలను ఓడించి, బెంగాల్‌లో వామపక్షాలతో తృణమూల్‌ను దెబ్బతీసేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్‌తో జాతీయ స్థాయిలో ఎన్ని పార్టీలు కలిసి వస్తాయో చెప్పలేం.

# నీట్ గా లీక్ చేసేశారు...

**జైపూర్, మే 14:**ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్ష నీట్ 2026ను రద్దుచేశారు. పరీక్షకు రెండు రోజుల ముందే ప్రశ్నాపత్నం లీక్ కావడంతో కేంద్ర ప్రభుత్వం సూచనలతో ఎన్టీఏ రద్దుచేసిన సంగతి తెలిసిందే. అయితే, తొలుత ఈ పరీక్షా పత్రాన్ని పుణేకు చెందిన అనుమానితుడు నుంచి ఓ విద్యార్థి కొనుగోలు చేశాడు. అతడు రూ.10 లక్షలకు కొని, దానిని రూ.15 లక్షలు తిరిగి అమ్మినట్టు సీబీఐ దర్యాప్తులో వెల్లడయ్యింది.ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలతో యూజీ నీట్ 2026ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం రద్దుచేసింది. ఈ ప్రభావం 22 లక్షల మంది విద్యార్థులపై పడింది. ఈ కుంభకోణం మహారాష్ట్రలోని నాసిక్‌లో ప్రారంభమైంది. అక్కడ పేపర్ మొదటి డిజిటల్ కాపీ బయటపడింది. నివేదికల ప్రకారం.. పుణేకు చెందిన అనుమానితుడి నుంచి లీక్ అయిన పేపర్‌ను కొనుగోలు చేసి, ఆపై దానిని రూ. 5 లక్షల లాభంతో విక్రయించాడనే ఆరోపణలపై నాసిక్‌కు చెందిన శుభమ్ ఖైర్నార్‌ను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అదుపులోకి తీసుకుంది.మహారాష్ట్ర తర్వాత హర్యానాలోని గురుగ్రామ్, రాజస్థాన్‌లోని ప్రధాన కోచింగ్ సెంటర్ జైపూర్, సికార్ అలాగే జమ్మూ కశ్మీర్, బీహార్, కేరళతో సహా అనేక రాష్ట్రాలకు వ్యాపించింది. నాసిక్‌లోని ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల శుభమ్ ఖైర్నార్ బీఏఎంఎస్ విద్యార్థి. లీకైన నీట్ పర్‌ను పుణేకు చెందిన అనుమానితుడి నుంచి రూ.10 లక్షలకు కొనుగోలు చేసి హర్యానాలోని ఓ వ్యక్తికి రూ.15




లక్షలకు విక్రయించి రూ.5 లక్షల లాభం పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ అప్లికేషన్ ద్వారా పేపర్ సర్క్యులేట్ అయిందని నివేదికలు చెబుతున్నాయి.మంగళవారం మధ్యాహ్నం శుభమ్‌ను సీబీఐ అదుపులోకి తీసుకుంది. తనను గుర్తించకుండా జుత్తు కత్తిరించి తన రూపురేఖలను మార్చుకున్నాడని దర్యాప్తు అధికారులు తెలిపారు. అయితే, అధికారుల ముందు అతడి ప్రయత్నాలు ఫలించలేదు. సాంకేతికత సాయంతో అతడిని గుర్తించారు. అతడ్ని అదుపులోకి తీసుకున్న తరువాత... తండ్రి మధుకర్ ఖైర్నార్ తన కొడుకుపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్నారు. పేపర్ లీక్ రాకెట్‌తో శుభమ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. కానీ, నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు నిష్పక్షపాతంగా, సమగ్రంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.పేపర్ లీక్‌లో పోర్టబుల్ స్కానర్‌లు, క్లిష్టమైన టెలిగ్రామ్ నెట్‌వర్క్, షాడో సర్వర్‌లతో సహా అధునాతన సాంకేతికతలను ఉపయోగించినట్టు నివేదికలు పేర్కొన్నాయి. నివేదికల ప్రకారం, పరీక్షకు దాదాపు 45 గంటల ముందు పేపర్ సర్క్యులేట్ అయ్యింది. కేరళలో చదువుతున్న సికార్ విద్యార్థి హాస్టల్ నడుపుతున్న తన తండ్రికి "గెస్ పేపర్" పీడీఎఫ్ పంపినట్లు ఆరోపణలు రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.పరీక్ష రోజు ఉదయం హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు పేపర్ ఇచ్చేందుకు ప్రయత్నించగా.. వారు అప్పటికే సెంటర్లకు వెళ్లిపోయారని సమాచారం. పరీక్ష ముగిసిన తర్వాత, పేపర్‌ను కెమిస్ట్రీ, బయాలజీ లెక్చర్లకు చూపించడంతో 108 కెమిస్ట్రీ ప్రశ్నలకు 45, 204 బయాలజీ ప్రశ్నలకు 90 అసలు పరీక్ష పేపర్‌తో సరిపోలింది. సికార్‌లోని కొన్ని కోచింగ్ కేంద్రాలు గెస్ పేపర్స్ ఉపయోగించి నీట్‌కు సిద్ధం కావాలని కోరినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. కొందరికి పీడీఎఫ్ కాపీలు అందగా, మరికొందరికి లీకైన పేపర్‌కి సంబంధించిన అసలు కాపీలు ఇచ్చినట్లు సమాచారం.ఫిర్యాదు చేయడానికి ఉపాధ్యాయులు ప్రయత్నించినా.. సికర్ పోలీసులు కేసు నమోదు చేయడానికి నిరాకరించారు. దీంతో వారు నేరుగా చీూకి మెయిల్ పంపడంతో ఇంటెలిజెన్స్ బ్యూరో (×దీ)కి సమాచారం అందించింది. చివరకు రాజస్థాన్ పోలీసులు రంగంలోకి దిగి, దర్యాప్తు చేపట్టడంతో గుట్టు బయటపడింది.

# దేశంలో వేల కోట్ల లీటర్ల పెట్రోల్-డీజిల్ వాడకం

**న్యూఢిల్లీ మే 14:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ టీవీలో హైదరాబాద్ పర్యటన సందర్భంగా దేశ ప్రజలకు కొన్ని కీలక సూచనలు చేశారు. అందులో ఇంధన పొదుపు ఒకటి. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన వినియోగం తగ్గించాలని సూచించారు. వర్క్ ఫ్రం హోం చేయాలన్నారు. ప్రధానమంత్రి పిలుపునిచ్చిన నేపథ్యంలో, తన కాన్వాయ్‌లో ఉపయోగించే వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని ఆదేశించారు. ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లుగా, ఇది సాధారణ పెట్రోల్-డీజిల్ వాహనాలను తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వాడకాన్ని పెంచడానికి దిశానిర్దేశం. భారతదేశంలో వార్షికంగా 2 వేల కోట్ల లీటర్ల పెట్రోల్-డీజిల్ వాడకం జరుగుతున్న నేపథ్యంలో, ఇటువంటి చర్యలు లక్షలాది కోట్ల రూపాయల ఆదాను తీసుకొస్తాయని నిపుణులు అంచనా. పొదుపు తన నుంచే మొదలు పెట్టాలని మోదీ కీలక ఆదేశాలు ఇచ్చారు.స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్ పీ జీ) ఈ ఆదేశాన్ని అమలు చేస్తూ, ప్రధాని భద్రతా ప్రోటోకాల్‌కు ఎటువంటి భంగం రాకుండా చూస్తోంది. అధునాతన ఈవీలు గట్టి బాడీలు, రాడార్ సెన్సార్లు, డ్రోన్ డిటెక్షన్ వంటి ఫీచర్లతో సిద్ధమవుతాయి. ఇది మాత్రమే కాకుండా, కాన్వాయ్‌లో 30-40 వాహనాలను 15-20కి తగ్గించడం ద్వారా రోడ్డు ట్రాఫిక్‌ను సులభతరం చేస్తుంది.ఈ చర్య ఇంధన ఆదాతో పాటు పర్యావరణానికి లాభదాయకం. ఒక ఈవీ వాహనం సంవత్సరానికి 5-7 టన్నుల జూ2 ఉద్గారాలను తగ్గిస్తుంది. భారతదేశం 2030 నాటికి 30 శాతం ఈవీలకు మారాలనే లక్ష్యంలో కేంద్రం చర్యలు చేపట్టింది. ఆర్థికంగా, పెట్రోల్ ధరలు రూ.100కి పైబడిన ఈ సమయంలో, కాన్వాయ్ ఖర్చు 40 తగ్గుతుంది.ఈ నిర్ణయం దేశవ్యాప్త ఈవీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను వేగవంతం చేస్తుంది, ముఖ్యంగా ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ టెక్నాలజీలో పెట్టుబడులు పెరుగుతాయి. సవాళ్లుగా




రహస్యత, ఛార్జింగ్ సమయాలు, సైబర్ సెక్యూరిటీ మిగిలాయి. అయినప్పటికీ, ఇది ప్రభుత్వ వాహనాలు, పౌరుల వాహనాలకు ఆదర్శంగా మారి, 'గ్రీన్ మొబిలిటీ'కి ఊతమిస్తుంది.

# బెంగాల్ రాజకీయాల్లో నందిగ్రామ్ రెండో అంకం

**కోల్ కత్తా,మే 14:**పశ్చిమ బెంగాల్ రాజకీయం ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో సువేందు అధికారి అటు మమతా బెనర్జీ సొంత గడ్డ భవానీపూర్‌లోనూ, ఇటు తన కంచుకోట నందిగ్రామ్‌లోనూ ఘనవిజయం సాధించి జెయింట్ కిల్లర్ గా నిలిచారు. అయితే, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు.. ఏదో ఒక సీటుకు రాజీనామా చేయాల్సి ఉండటంతో, ఆయన భవానీపూర్‌ను అట్టి పెట్టుకుని నందిగ్రామ్ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో ఇప్పుడు నందిగ్రామ్‌కు ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ స్థానం ఇప్పుడు మమతా బెనర్జీకి రాజకీయ పునర్వైభవం కోసం, మరో అగ్నిపరీక్ష కోసం వేచి చూస్తోంది.ఎమ్మెల్యేగా ఓడిపోయిన మమతా బెనర్జీకి, పార్టీని తిరిగి గాడిలో పెట్టాలంటే అసెంబ్లీలో అడుగుపెట్టడం అనివార్యం. ప్రస్తుతం ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఎంపీగా ఉన్నారు. అసెంబ్లీకి వెళ్లలేరు. దీదీ స్వయంగా సభలో ఉంటేనే టీఎంసీ శ్రేణుల్లో ఉత్సాహం పెరుగుతుంది. అయితే, నందిగ్రామ్ నుంచి పోటీ చేయడం ఆమెకు ఒక పెను సవాల్. 2021లో ముఖ్యమంత్రిగా ఉండి కూడా అక్కడ సువేందు చేతిలో ఓటమి పాలైన ఆమెకు, ఇప్పుడు అధికారం లేని స్థితిలో, విపక్ష నేతగా అక్కడికి వెళ్లడం అంటే కత్తి మీద సామే అని భావిస్తున్నారు.నందిగ్రామ్ అనేది కేవలం ఒక



నియోజకవర్గం కాదు, అది బెంగాల్ పోరాట పటిమకు చిహ్నం. సువేందు అధికారి అక్కడ తన పట్టును నిరూపించుకున్నారు. ఇప్పుడు ఆయన ముఖ్యమంత్రిగా ఉండి, తన అభ్యర్థిని అక్కడ నిలబెడితే ప్రభుత్వం ఉన్న అడ్వాంటేజ్ బీజేపీకి అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. ఈ తరుణంలో మమత అక్కడ పోటీ చేసి మళ్లీ ఓడిపోతే, ఆమె రాజకీయ భవిష్యత్తు , టీఎంసీ మనుగడ మరింత క్లిష్టంగా మారుతుంది. అందుకే ఆమె సేఫ్ సీటు కోసం చూస్తారా లేక నందిగ్రామ్ సవాల్‌ను స్వీకరిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. మమతా బెనర్జీ సహజంగానే పోరాట యోధురాలు. ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదల ఆమెలో ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. బీజేపీ 207 సీట్ల భారీ మెజారిటీతో అధికారంలో ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా టీఎంసీ క్యాడర్ నైరాశ్యంలో ఉండటం ఆమెకు ప్రతికూలాంశాలు. ఒకవేళ ఆమె నందిగ్రామ్‌లో రిస్క్ చేయకూడదని భావిస్తే ఆమె పోటీ చేసే అవకాశం ఉండదు.సువేందు అధికారి తన వ్యూహాన్ని చాలా స్పష్టంగా అమలు చేస్తున్నారు. తాను నందిగ్రామ్‌ను వదులుకున్నప్పటికీ, అక్కడి ప్రజలకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని, తన వారసుడిని గెలిపించుకోవడం ద్వారా మమతకు మళ్లీ చుక్కలు చూపిస్తానని ఆయన బహిరంగంగానే సవాల్ విసురుతున్నారు. ఆరు నెలల్లో జరగబోయే ఈ ఉపఎన్నిక బెంగాల్ రాజకీయాల్లో కీలక పోరాటంగా మారబోతోంది. మమతా బెనర్జీ అసెంబ్లీలో అడుగుపెట్టకపోతే, బెంగాల్‌లో టీఎంసీ ప్రాభవం క్రమంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. నందిగ్రామ్ మరోసారి యుద్ధభూమిగా మారబోతోంది. మమతా బెనర్జీ తీసుకునే నిర్ణయం ఆమె పార్టీ భవిష్యత్తును నిర్ణయించనుంది. ఆ బెంగాల్ అసెంబ్లీలో దీదీ గళం వినబడాలంటే ఆమె ఈ గండం గట్టెక్కక తప్పదు

# అమెరికాలో 'శాండ్‌విచ్ జనరేషన్ నిరసనలు

**న్యూఢిల్లీ,మే 14:**అమెరికాలో లక్షలాది మంది తీవ్రమైన ఆర్థిక, మానసిక, వృత్తిపరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఒకే సమయంలో వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు చూసుకుంటూ, మరోవైపు పిల్లల ఆలనాపాలనలో మునిగిపోవడంతో వారి జీవితాలు సంక్లిష్టంగా మారుతున్నాయి. 'శాండ్‌విచ్ జనరేషన్'గా పిలుస్తున్న ఈ వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవల అమెరికా సెనేట్ కమిటీ ఆన్ ఏజింగ్ ప్రత్యేక విచారణ చేపట్టింది. వీరికి ఫెడరల్ ప్రభుత్వం నుంచి మరింత మద్దతు అవసరమని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.సెనేట్ కమిటీ చైర్మన్ రిక్ స్కాట్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సుమారు 11 మిలియన్ల మంది అమెరికన్లు వృద్ధ తల్లిదండ్రులు, పిల్లల బాధ్యతలతో సతమతమవుతున్నారని తెలిపారు. వీరిలో ప్రతి ఐదుగురిలో ఒకరు తమ ఉద్యోగ వేళలు తగ్గించుకోవడం లేదా పూర్తిగా మానేయడం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలో వేతనం లేని ఈ సంరక్షణ విలువ ఏటా 600 బిలియన్ డాలర్లకు పైగా ఉంటుందని ఆయన అంచనా వేశారు.ఈ విచారణలో సెనేటర్ ఆండీ కిమ్ తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. తన తండ్రికి అల్జీమర్స్ వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత తాను కూడా 'శాండ్‌విచ్ జనరేషన్'లో చేరానని, ప్రస్తుతం ఆయన బాగోగులు చూసుకోవడానికి ఒక కేర్‌గివర్‌ను నియమించాల్సి వస్తోందని వివరించారు.ఫ్లోరిడాకు చెందిన మేగన్ మహేర్ అనే మహిళ మాట్లాడుతూ.. తన మొదటి బిడ్డ పుట్టిన కొన్ని వారాలకే తల్లికి క్యాన్సర్ అని తేలడంతో ఒకేసారి మాతృత్వం, కేర్‌గివర్ బాధ్యతలు మోయాల్సి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ బాధ్యతల కారణంగా తాను సంప్రదాయ ఉద్యోగాలు చేయలేక స్వయం ఉపాధిపై ఆధారపడాల్సి వచ్చిందని తెలిపారు.కేర్‌గివర్స్‌కు పన్ను మినహాయింపులు, వేతనంతో కూడిన సెలవులు, వారి సేవలకు సోషల్ సెక్యూరిటీ క్రెడిట్లు వంటివి అందించే విధానాలపై దృష్టి పెట్టాలని నిపుణులు, బాధితులు కాంగ్రెస్‌ను కోరారు.

## హైకోర్టు నిర్మాణంలో

# అవినీతి మరకలు...

**హైదరాబాద్, మే 14:**హైకోర్టు భవనాల నిర్మాణంలో అవినీతి చెద లు కనిపిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రాష్ట్ర నూతన హైకోర్టు భవ న సముదాయం, న్యాయమూర్తుల నివాసాల సముదాయాల నిర్మాణాన్ని చేపట్టింది. అయి తే హైకోర్టు భవన నిర్మాణం పనుల్లో నాణ్యతాలోపం, అంచనాలను భారీగా పెంచేలా.. పలు సాంకేతిక అంశాలను తెరపైకి తీసుకొచ్చారు.ఇందులో భాగంగా హైకోర్టు నిర్మా ణం చేపడుతున్న ప్రాంతంలోని మట్టి భారా న్ని మోసే సామర్థ్యం తక్కువగా ఉందని (మెత్తగా ఉందని) రికార్డులను తారుమారు చేసి.. అదనంగా లోతుగా తవ్వాలని, అలాగే అదనంగా కాంక్రీట్ పనులు, పిల్లర్లను వేయాల్సి ఉంటుందనేలా కొత్త పథకాన్ని తెరపైకి తీసుకువచ్చారు. దీంతో సెల్లార్లకు సంబంధించిన వ్యయం సుమారు 280 శాతం పెరిగిందని, మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయంలో సుమా రు 200 కోట్ల వరకు పెరిగిందని తెలుస్తోంది.రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇందుకు రాజేంద్రనగర్‌లో ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఆనుకుని సుమారు 100 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. నూతన హైకోర్టు నిర్మాణ భవన సముదాయాల నిర్మాణాన్ని చేపట్టేందుకు రూ. 2,583 కోట్ల వ్యయం అంచనాలతో పరిపాలనా అనుమతులను 2024 డిసెంబర్‌లో ఇచ్చారు.ఇందులో ప్రధానమైన కోర్టు భవనం, న్యాయమూర్తుల నివాస సముదాయం, న్యాయవాదులు, కక్షిదారుల కోసం.. ఇలా అన్ని రకాల వసతులతో నిర్మించే భవనానికి రూ. 1,443.73 కోట్లతో (ఈసీవీ-ఎస్టిమేటెడ్ కాంట్రాక్ట్ వాల్యూ) టెండర్లు పిలిచారు. అయితే సు మారు 4.95 శాతం ఎక్కువకు కోట్‌చేసిన డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రై.లి. అనే సంస్థ ఈ టెండర్‌ను రూ. 1,515 కోట్లకు దక్కించుకుందిమరో రూ. 603 కోట్లను హైకోర్టులో కావాల్సిన ఫర్నిచర్, ఇంటీరియర్, ఇతర వస్తుసామాగ్రిని ఏర్పాటు చేయడానికి కేటాయించారు. మొత్తం 36.52 లక్షల చదరపు అడుగుల మేర నిర్మాణ పనులను చేపట్టారు. జోన్-1లో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లు 3, అడ్వొ కేట్స్ బ్లాక్‌లు 3, పబ్లిక్ వసతులు, సౌకర్యాల బ్లాక్, పబ్లిక పార్కింగ్, అడ్వొకేట్ పార్కింగ్, బార్ కౌన్సిల్‌ను నిర్మించనున్నారు.అలాగే ప్రధాన కోర్టు భవనంలో మొత్తం 51 కోర్ట్ హాళ్లు ఉంటాయి. వీటి మొత్తం విస్తీర్ణం 6.52 లక్షల చదరపు అడుగులు. ఇక జోన్-2లో హైకోర్టు చీఫ్ జస్టిస్ నివాసం, సచివాలయం, అలాగే మరో 41 న్యాయమూర్తుల బంగాళాలు, క్లబ్‌హౌజ్, ఆడిటోరియం, సెంట్రల్ రికార్డ్ రూం తది తర నిర్మాణాలు ఉండనున్నాయి. వీటికి అదనంగా జడ్జీల పార్కింగ్‌లను కూడా ఏర్పాటుచేస్తారు.వాస్తవానికి మట్టి బరువుమోసే సామర్థ్యాన్ని తగ్గించి చూపడంతో.. అదనపు పనులు చేపట్టే అవకాశం చిక్కింది. దీనివల్ల అదనంగా లాభం కలుగుతుంది. అలాగే.. చేసే పనుల్లోనూ నాణ్యత లేకుండా, సాంకేతిక అంశాలకు, డ్రాయింగ్ లకు విరుద్ధంగా పనులు చేస్తుండటంతో.. భవిష్యత్తులో ప్రమాదాలను ఎదుర్కొవాలి ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాంట్రాక్టరు కేవలం తమకు లాభం కలగాలనే ఉద్దేశంతో పునాది, బేస్ నిర్మాణంలో వాడాల్సినంత స్టీల్‌ను వాడటంలేదని తెలుస్తుంది.స్టీల్ సపోర్ట్ లేకుండానే.. రీఎన్‌ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్(ఆర్‌సీసీ) పనులు చేస్తున్నట్టుగా తెలుస్తుంది. అలాగే పద్ధతి లేకుండా బేస్ కాంక్రీట్ పనులు చేస్తున్నట్టుగా నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కన్సల్టెంట్ సంస్థకూడా గుర్తించింది. డ్రాయింగ్‌ల ప్రకారం కాకుండా.. ఇష్టారాజ్యంగా స్టీల్‌ను వాడుతున్నారు. షట్లర్ ప్లేట్లు సరైనవి వాడకపోవడం వల్ల కాంక్రీట్ వేసిన తరువాత ఉబ్బిపోయి పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఇలా కాంట్రాక్టరు తన ఇష్టారాజ్యంగా నిర్మాణం పనులు చేపడుతున్నట్టుగా అధికారులు కూడా గుర్తించినట్టు సమాచారం.రాష్ట్ర హైకోర్టు నూతన భవన సముదాయం నిర్మాణానికి సంబంధించి టీం వన్ ఇండియా ప్రై.లి. అనే ఇంజనీరింగు సంస్థను కన్సల్టెంట్‌గా నియమించుకున్నారు. ఈ కన్సల్టెంట్ సంస్థ.. హైకోర్టు నిర్మాణాలకు సంబంధించి సాంకేతిక అంశాలను పరిశీలిస్తుంది. అలాగే ?రడ్రాయింగ్‌లు, డిజైన్లను రూపొం దించి, వాటికి అనుమతి తీసుకుని వాటి ప్రకారం నిర్మాణ పనులను చేపట్టేలా చూస్తుంది.అయితే ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి సదరు టీం వన్ ఇండి యా ప్రై.లి. సంస్థ ప్రతినిధులతో.. కాంట్రాక్టు సంస్థ సరిగా వ్యవహరించడం లేదని, సహకరించడం లేదని పేర్కొంటూ.. దీనితోపాటు.. పలు సాంకేతిక అంశాలను పేర్కొంటూ.. 2025 డిసెంబర్ 17న సదరు కన్సల్టెంట్ సంస్థ హైకోర్టు బిల్డింగ్ కమిటీకి ఏకంగా లేఖ రాసింది. ఇందులోనే.. మట్టి బరువుమోసే సామర్థ్యం (సాయిల్ బియరింగ్ కెపాసిటీ) విషయంలో.. చుట్టుపక్కల 115 టన్నులు/స్కేర్‌మీటర్ ఉండగా.. హైకోర్టు నిర్మాణ స్థలంలో కేవలం 40 నుంచి 70 టన్నులు/స్కేర్ మీటర్‌గా పేర్కొనడాన్ని ఎత్తి చూపింది.దీనివల్ల అదనంగా రాష్ట్ర ప్రభుత్వంపై వ్యయ భారం పెరుగుతుందని, ఇది సరైందికాదంటూ తేల్చిచెప్పింది. సాయిల్ బియరింగ్ కెపాసిటీని సరిగ్గా నిర్ధారించడానికి ప్లేట్ లోడ్ టెస్ట్ నిర్వహించాలనికూడా కన్సల్టెంట్ సంస్థ రాసిన లేఖలో స్పష్టంగా సూచించింది.నిర్మాణ ప్రాంతంలో 160 మంది సాంకేతిక సిబ్బందిని వినియోగిస్తున్నామని కాంట్రాక్ట్ సంస్థ చెబుతున్నప్పటికీ.. కేవలం 20 నుంచి 30 మంది మాత్రమే ఉన్నారని, అలాగే నిర్మాణంలో 700 మంది కార్మికులు పనులు చేస్తున్నట్టుగా చెబుతున్నప్పటికీ.. కేవలం 150 నుంచి 200 మంది మాత్రమే పనులు చేస్తున్నారని.. దీని ప్రభావం పనుల నాణ్యతపై తప్పకుండా ఉంటుందని కన్సల్టెంట్ సంస్థ పేర్కొంది.హైకోర్టు నిర్మాణ పనులకు నియమించిన కన్సల్టెంట్ సంస్థ టీం వన్ ఇండియా ప్రై.లి. సంస్థ 2025 డిసెంబర్ 17న హైకోర్టు బిల్డింగ్ కమిటీకి రాసిన లేఖలో సుమారు 10 అంశాలను చర్చించారు. ఇందులో ప్రధాన మైనది మట్టి బరువు మోసే సామర్థ్యం (సాయిల్ బియరింగ్ కెపాసిటీ కాగా.. స్ట్రక్చరల్ డిజైన్‌లో తేడాలున్నాయని, అలాగే భవిష్యత్తులో హైకోర్టు భవనం ఎత్తు పెంచాల్సిన అవసరం లేదని స్పష్టంగా ఉన్నప్పటికీ.. ఈ నిబంధనను పక్కనపెట్టి.. భవిష్యత్తు అవసరాలమేరకు అంటూ అదనంగా మరోరెండు ఫ్లోర్ల నిర్మా ణం అనే అంశాన్ని పక్కనపెట్టినట్టుగా లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. అలాగే సరైన సమయంలోనే అన్ని రకాల డ్రాయింగ్‌లను సమర్పించినట్టు, ఇందు లో గరష్టంగా ఐఐటీ స్థాయిలో పరిశీలిం చి అంగీకరించారని తెలిపారు. హైకోర్టు భవన సముదా యం చుట్టూ సుమారు 3.4 కి.మీ పొడవునా.. చూట్టూ ప్రహారీగోడ ని ర్మించాల్సి ఉందని పేర్కొన్నా రు. అలాగే.. సుమారు 100 ఎకరాల స్థలాన్ని చదునుచేసే విష యంలో మినిమం కట్ అండ్ ఫిల్ అనే పద్ధతిలో చేస్తే ఎర్త్ వర్క్ శ్రమ తగ్గుతుందని, తద్వారా వ్యయాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారుదీనితోపాటు.. బిల్డింగ్ ఎంట్రన్స్‌లు, ఎగ్జిట్‌దారులు వర దనీరు, డ్రెయిన్ల నిర్వహణ, ఫైర్‌సేఫ్టీ, పార్కింగ్ స్థలాలు (2,800 వాహనాలు పార్కింగ్ చేసే అవకాశం), స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణంపై వారి డ్రాయింగ్‌లను, డిజైన్లను స్పష్టంగా పేర్కొంటూ.. తమ డ్రాయింగ్‌లు, డిజైన్లు, చేసిన సవరణలకు సంబంధించినవాటిని పరిశీలించి బిల్డింగ్ కమిటీ అనుమతి ఇవ్వాలని కన్సల్టెంట్ రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. అదనంగా వ్యయం కాకుండా చూడాలని కూడా అందులో తెలపడం గమనార్హం.హైకోర్టు నిర్మాణంలో మొదటిదైన.. పునాదిలోనే అవినీతికి రాయిపడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి రూ. 1,515 కోట్లకు కాంట్రాక్టు కుదిరినప్పటికీ.. దీనిని వివిధ సాంకేతిక కారణాలను చూపెట్టి.. అదనంగా సుమారు రూ. 200 కోట్ల వరకు అంచనాలను పెంచినట్టుగా వినపడుతోంది. ఇందుకు ప్రధాన కారణంగా.. బరువుమోసే మట్టి సామర్థ్యాన్ని తక్కువగా చూపించినట్టు తెలుస్తుంది.వాస్తవానికి హైకోర్టు నిర్మాణం జరుగుతున్న ప్రదేశాలకు చుట్టుపక్కల మట్టికి బరువుమోసే సామర్థ్యం (సాయిల్ బియరింగ్ కెపాసిటీ 115 టన్నులు/ స్కేర్ మీటర్ ఉండగా.. హైకోర్టు నిర్మాణ ప్రాంతంలోని మట్టి బరువు మోసే సామర్థ్యం 40 టన్నులు/స్కేర్ మీటర్ నుంచి 70 టన్నులు/స్కేర్‌మీటర్‌గా చూపించి.. అందుకు అనుగుణంగానే నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకోసం ప్రైవేటు ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టును సైతం మార్చివేశారనే ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి.మట్టి బరువుమోసే సామర్థ్యాన్ని తగ్గించి చూపడంతో.. అదనంగా కాంక్రీట్, పిల్లర్లు, బేస్ కాంక్రీట్ పనులు పునాదులను వెడల్పుగా చేపట్టాల్సి వచ్చింది. జి౦6 అంతస్తులతోపాటు.. పార్కింగ్ కోసం సెల్లార్ల తవ్వకాలు చేయడంతో.. మరింత దృఢంగా తయారుచేయాల్సిన అవసరం ఉందనేలా సాంకేతిక అంశా లను చూపెట్టి.. అదనపు పనులను చేపట్టినట్టు అరోపణలు గుప్పుమన్నారు.ఫౌండేషన్ తవ్వకాలు, పు టింగ్ వెడల్పు, వాటర్‌ప్రూఫింగ్, స్టీల్ పైల్స్ లాంటివి భూమి లోపలే చేపట్టాల్సి ఉంటుంది. వీటిని తూతూ మంత్రంగా చేసి.. పూర్తిచేస్తే.. భూమిలోపల ఉంటాయి కనుక ఎవరూ కనుక్కోలేరన్నమాట. అదనంగా సెల్లార్‌ను నిర్మించాల్సి వచ్చింది. దీనితో సుమారు రూ. 200 కోట్ల వరకు అంచనాలు పెరిగినట్టుగా అధికారవర్గాల్లోనే చర్చ జరుగుతోంది.వాస్తవానికి కన్సల్టెంట్ గుర్తించిన తీవ్రమైన అంశాలపై రోడ్లు భవనాల శాఖ అధికారుల్లోనూ చర్చ జరిగినట్టుగా తెలుస్తుంది. అయితే తెరవెనుక రాష్ట్ర ప్రభుత్వంలోని కీలకమైన నేతల అజమాయిషీలో ఉండే ఉన్నతస్థాయి అధికారుల నుంచి వచ్చిన హుకూంతో.. ఆర్ అండ్ బీ అధికారులు మౌనం పాటించాల్సి వచ్చిందనే చర్చ జరుగుతోంది. నాణ్యతలోపంగా, భారీగా వ్యయం పెంచేలా పనులు చేపట్టడాన్ని వ్యతిరేకించడంతో.. కన్సల్టెంట్‌ను తప్పించే ప్రయత్నంకూడా జరిగినట్టుగా తెలుస్తుంది.అధిక వ్యయం జరగనున్న అంశాలను ప్రస్తావించకుండా.. ఇతర సాంకేతిక అంశాలను సాకుగా చూపెట్టి.. అవసరమైతే.. కన్సల్టెంట్‌ను తప్పించి.. కొత్త కన్సల్టెంట్‌ను నియమించుకుంటామనేలా హెచ్చరించినట్టుగా చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే.. బిల్డింగ్ కమిటీకి కన్సల్టెంట్ లేఖ రాస్తూ.. అందులో సుమారు 10 అంశాలను లోతుగా విశ్లేషించి.తెరవెనుక జరుగుతున్న అంశాలను బిల్డింగ్ కమిటీ దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేసినట్టుగా సమాచారం. అయితే దీనిపై ఎలాంటి చర్యలు ఇప్పటివరకు లేవు. ఇక ఏం జరుగుతుందోనని అందరూ ఎదురుచూస్తున్నారు. మొత్తానికి అందరికీ న్యాయం అందించే హైకోర్టు భవన సముదాయం నిర్మాణంలో అవినీతి పునాదులు ఉండటంపై సర్వత్రా చర్చనీయాంశమయ్యింది.

## కరీంనగర్ పీఎంజే జ్యువెలరీ కేసు

# ముగ్గురు నిందితుల అరెస్ట్

**కరీంనగర్:**కరీంనగర్ లో సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలరీ దోపిడి కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసారు. నిందితుల నుంచి పిస్టల్స్, వెహికల్స్, భారీగా ఆభరణాలు సీజ్ చేసారు. దొంగలు నగలు దోచుకొని బైకులపై మహారాష్ట్ర నుంచి బెంగాల్కు పరారైయినట్లు గుర్తించారు. ఈ దోపిడీలో 161.4 తులాల బంగారు ఆభరణాలు, 112 క్యారెట్ల వజ్రాభరణాలు కలిపి మొత్తం రూ.82,02,000/- విలువైన ఆభరణాలు దోచుకున్నారు. ఈ ఘటనలో నలుగురు స్టాఫ్ గాయపడ్డారు. రఘునాథ్ కర్మాకర్ ఏ జగీరా సింగ్ను బుధవారం సాయంత్రం 4:00 గంటల సమయంలో వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు రవీష్ కుమార్ ఏ ప్రద్యుమన్ మరియు మెహతాబ్ ఖాన్లను బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్పై తీసుకువచ్చారు. బీహార్కు చెందిన ది గోల్డెన్ థీఫ్ సుబోద్ సింగ్ ఈ చోరీకి మాస్టర్ మైండ్గా గుర్తించారు పోలీసులు. చోరీలో ఐదుగురు దొంగలు పాల్గొన్నారు. ఇప్పటివరకు ముగ్గురు అరెస్ట్ అయ్యారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా చోరీలో 13 మంది పాల్గొన్నట్లు గుర్తించారు. గ్యాంగ్ లీడర్ సుబోద్ సింగ్, 10 మంది నిందితులు ఇంకా దొరకలేదు. ఈ ముఠా బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో జ్యువెలరీ షాపులు మరియు బ్యాంకులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.సుభోద్ సింగ్ అనుచరుల సమాచారంతో రఘునాథ్ కర్మాకర్ మంచిర్యాలకు వెళ్లి రైలులో చంద్రపూర్ సమీపానికి చేరుకున్నాడు. అక్కడ ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు 02-05-2026 న గడ్‌చందూర్ పరిసరాల్లో ఆరు పిస్టల్స్ మరియు మ్యాగజైన్లు అందజేశారు. అనంతరం రఘునాథ్ కర్మాకర్ ఆయుధాలతో ధర్మపురికి తిరిగి వచ్చాడు.03-05-2026న ఉదయం ఐదుగురు నిందితులు ధర్మపురిలో వారు ఉన్న లాడ్జ ఖాళీ చేసి




రెండు బైక్‌ల పై బయలుదేరారు. బ్యాగులను కొండ ప్రాంతంలో దాచిపెట్టి, అక్కడే వారి బైక్ నంబర్ ప్లేట్లు మార్చి, వెలిచాల ఎక్స్ రోడ్ వద్దకి చేరుకొని అక్కడ టిఫిన్ చేసి, దోపిడీ ప్రణాళికను మరోసారి చర్చించారు.తరువాత ఉదయం 10:50 గంటలకు ౹పీజీ జ్యువెలరీ షాప్‌కు చేరుకున్నారు. ప్రణాళిక ప్రకారం రాధే ఏ అభయ్ కస్టమర్‌లా షాప్‌లోకి వెళ్లి పరిస్థితిని గమనించాడు. రాధే మెస్సేజ్ ఇచ్చిన తర్వాత మిగతా నిందితులు లోపలికి ప్రవేశించి సిబ్బందిని ఆయుధాలతో బెదిరించారు. నగలు దోచుకొనే సమయంలో స్టాఫ్ ప్రతిఘటించారు. దాంతో నిందితులు వారి వద్ద ఉన్న ఆయుదాలతో స్టాఫ్ పై కాల్పులు జరిపారు.నిందితులు షాప్ నుండి పారిపోతూ వారు షాపులో దోచుకున్న ఒక ఆభరణాల బ్యాగ్‌ను తీసుకుని పారిపోయారు. ఆందోళనలో మరో బ్యాగ్‌ను షాప్‌లోనే వదిలివేశారు. ముందుగా నిర్ణయించిన మార్గంలో ధర్మపురికి చేరుకున్నారు.సనోజ్, రాధే ఏ అభయ్, ప్రద్యుమన్ గోదావరి నది ఒడ్డున పల్సర్ బైక్‌ను వదిలి నడుచుకుంటూ నది దాటి మంచిర్యాల నుంచి రైలులో పరారయ్యారు.మరోవైపు రఘునాథ్ కర్మాకర్ ఏ జగీరా సింగ్ మరియు మిశ్రా ఆభరణాల బ్యాగ్‌తో అపాచీ బైక్‌పై గుండాల అడవి ప్రాంతానికి వెళ్లారు. అక్కడ తెలుపు రంగు క్రెటా కారులో వచ్చిన వ్యక్తులకు బ్యాగ్ మరియు బైక్ అప్పగించి సమీప రైల్వే స్టేషన్ ద్వారా బీహార్‌కు పారిపోయారు. సాంకేతిక నిఘా ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఇప్పటివరకు 13 మంది నిందితులను గుర్తించాయి.

## బెంగాల్ సీన్ రిపీట్ అవుతుందా...

- మొదటి పేజీ తరువాయి

చాలు అద్భుతమైన ఫలితాలను అందిస్తామని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పెడతామని కూడా అంటున్నారు. అయితే ప్రజలు సిద్ధంగా ఉన్నారా అన్నది పక్కన పెడితే తెలంగాణా బీజేపీ రెడీగా ఉందా అన్న చర్చ ముందుకు వస్తోంది. బాధ్యతగల పౌరుడిగా గుర్తించండి.మిగిలిన రాష్ట్రాలలో బీజేపీ గెలుపు కోసం పార్టీ క్యాడర్ అంతా రోడ్డున ఉంటారు. నాయకులు సైతం వీధుల్లోకి వస్తారు. బెంగాల్ లో గత పదేళ్ళుగా బీజేపీ పడిన కష్టమే ఈ రోజు విజయం. ఒక్కో నాయకుడిదీ ఒక్కో వీరోచిత పోరాటం. బెంగాల్ లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ని ఎదిరించి నిలబడడం అంటే మాటలు కాదు, కానీ తెగించి వచ్చారు. అలా చేయడం వల్లనే పార్టీ బతికింది. ప్రజా సమస్యల మీద పోరాటం చేయడం వల్లనే బీజేపీ వైపు జనాలు చూశారు. ఆ విధంగా ప్రభుత్వ వ్యతిరేకత కాస్తా బీజేపీ వైపు మళ్ళింది. తెలంగాణాలో బీజేపీ చూస్తే మూడు గ్రూపులూ ఆరు వర్గాలుగా ఉంది. అందరూ నాయకులే అన్నట్లుగా ఉంది గతంలో కాంగ్రెస్ ఏ విధంగా ఉందో ఆ పరిస్థితి ఉందని అంటున్నారు. ఇపుడు తెలంగాణా కాంగ్రెస్ ఏకీకృతం అవుతోంది. రేవంత్ రెడ్డి అందరినీ కలుపుకుని పోతున్నారు. కానీ బీజేపీలో మాత్రం ఆ పరిస్థితి లేదని అంతా అంటున్నారు నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగి బీజేపీని కదిలించాల్సి వస్తోంది. కానీ ఈ తరహా ఉత్సాహాన్ని సభలు పెట్టి పార్టీ నేతలు చేయాల్సి ఉంది కదా అని అంటున్నారు. మొత్తానికి చూస్తే సౌత్ కి గేట్ వేగా తెలంగాణాను బీజేపీ పెద్దలు భావిస్తున్నారు కానీ తెలంగాణా బీజేపీ నేతలు సమాయత్తం అయితేనే అది సాధ్యపడుతుంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## తెలంగాణ అభివృద్ధికి మెగా గ్రోత్ కారిడార్లు కీలకం

- మొదటి పేజీ తరువాయి



రింగ్ రోడ్లు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఎస్టీపీలు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలు వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. రాష్ట్రంలో రాబోయే విమానాశ్రయాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుతో ఆ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని పేర్కొన్న సీఎం, విమానాశ్రయానికి అవసరమైన నీటి వనరుల ప్రణాళికలను కూడా ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు కానుందని వెల్లడించారు.నగరాల్లో ఖర్చును తగ్గించేందుకు ఈవీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని, ప్రభుత్వ అవసరాల కోసం లీజుకు తీసుకునే వాహనాలు కూడా ఈవీలే ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

## ఆగని మిల్లర్ల మాయజాలం

- మొదటి పేజీ తరువాయి



సెంటర్ నిర్వాహకులు సైతం కుమ్మక్కై రైతులను దోపిడీకి గురి చేస్తున్నారు. దీంతో రైతులు నిలువునా నష్టపోతున్నారు. అధికారులకు చెప్పినా కూడా పట్టించుకోకపోవడంతో దాన్యం కాంట కావడమే తమ కష్టాలు తీరుతున్నాయని రైతులు సర్దుకుంటున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చిన నుంచి రైతన్నలకు తంటాలు తప్పడం లేదు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రం నిర్వాకులు, అధికారులు చూడాలని ఒకవైపు కలెక్టర్ కొనుగోలు కేంద్రాల సందర్శనాల్లో చెబుతున్న ఆచరణలో మాత్రం అధికారులు అమలు చేయడం లేదు. వర్షాకాలం, వేసవికాలంలో వరి ధాన్యం చేతికి రాగానే ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని భావిస్తున్న రైతులకు అధికారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై తరుగూ పేరిట దోపిడి చేస్తున్నారని రైతు లు ఆరోపిస్తున్నారు.కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చిన తర్వాత తేమా శాతం వచ్చిన తర్వాతే ధాన్యాన్ని కాంటా పెడుతున్నారు. దీంతోపాటు మరికొంత తరుగు తీయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. మిల్లర్ వద్దకు వెళ్తే ధాన్యం తరు గు ఏర్పడుతుందని సాకుతో రైతుల నుంచి బస్తాకు నాలుగు కిలోల చొప్పున తరుగు తీస్తున్నారు. దీంతో ఒక రైతు 50 కింటల ధాన్యం పండిస్తే కొనుగోలు కేంద్రంలో తరుగు పేరిట క్వింటాల్ వరకు స్వాహా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.ధాన్యం కొనుగోలులో కొనుగోలు సెంటర్ నిర్వాహకులతో పాటు పర్యవేక్షణ చేస్తున్న అధికారులు, రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతుల నుంచి తరుగు పేరిట నిలువు దోపిడికి గురి చేస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం నామమాత్రంగా సూచనలిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. సీజన్లో వేల క్వింటాళ్ల ధాన్యాన్ని తరుగు పేరిట దోపిడి చేసి ఆ డబ్బులను రైస్ మిల్లర్లు, అధికారులు పంచుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు అమ్మితే ధర తక్కువ వస్తుండొచ్చు కానీ తరువు తీయరని రైతులంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తరుగు పేరుట దోపిడీ చేస్తున్న తీరును ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దోపిడీకి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రతి సీజన్లో లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని తరుగు పేరిట దోపిడీ చేసి డబ్బులు దండుకుంటున్నారు. తరువు పేరిట జరుగుతున్న దోపిడి తతంగాన్ని జిల్లా ఉన్నతాధికారులు అరికట్టాలని రైతులు కోరుతున్నారు. కామారెడ్డి జిల్లాలో దాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట దోపిడీ జరుగుతుందని జిల్లా సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు విజయ క్రాంతి ప్రతినిధి దృష్టికి తీసుకెళ్లగా సాక్షాదారాలతో ఫిర్యాదు చేస్తే దోపిడీకి పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మిల్లర్లు కొనుగోలు సెంటర్ల నిర్వాకులు దోపిడీకి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి రాలేదన్నారు. రైతులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. క్వింటాల్కు రెండు కిలోలు మాత్రమే తరు గు తీస్తున్నారని, ఎక్కువ మొత్తంలో తరుగు తీస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు నష్టపోకుండా చూస్తామన్నారు.

## నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పూర్తిగా కేంద్రం ప్రభుత్వం వైపల్యం

**-ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలు**

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పూర్తిగా కేంద్రం ప్రభుత్వం వైపల్యం అని, నీట్ పేపర్ లికేజీ సంఘటన బాధ్యత వహిస్తూ కేంద్రం విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ నీట్ పేపర్ లికేజీ సంఘటన బాధ్యత వహిస్తూ కేంద్రం విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకై ఏకంగా పరీక్షనే రద్దు చేయాల్సిన దుస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు.పగలూ రాత్రి కష్టపడి చదివిన ఎంతోమంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 లోనూ నీట్ ప్రశ్నాపత్రం లీకైన ఉదంతం నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడం వల్లే మళ్లీ ఈ ఘటన పునరావృతమైందన్నారు. లీకేజీ వెనక ఎంత పెద్దవాళ్ల హస్తం ఉన్నా, వాళ్లందరినీ పట్టుకుని కఠినంగా శికించాలన్నారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని విజ్ఞప్తి చేశారు.

## రామగుండం-మణుగూరు రైల్వే లైన్



**కరీంనగర్, మే 14:**ఉత్తర తెలంగాణ ప్రజల పాతికేళ్ల నిరీక్షణకు తెరపడింది. రామగుండం-మణుగూరు నూతన రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడమే కాకుండా.. 2026-27 బడ్జెట్‌లో ఏకంగా రూ.2911.84 కోట్ల నిధులు కేటాయించింది. సుమారు 208 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వే మార్గం సింగరేణి బొగ్గు రవాణాకు కీలకమైన 'కోల్ కారిడార్'గా మారనుంది. మేడారం వంటి మారుమూల ప్రాంతాలకు అనుసంధానం కల్పిస్తూనే, భద్రాచలం-రామగుండం మధ్య ప్రయాణ దూరాన్ని 90 కిలోమీటర్ల మేర తగ్గించనుంది. ప్రస్తుతం ఈ లైన్ నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి.ఉత్తర తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే సరికొత్త రైల్వే ప్రాజెక్టు పట్టాలెక్కడానికి సర్వం సిద్ధమైంది. రామగుండం-మణుగూరు మధ్య రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న పాతికేళ్ల నాటి కల ఇప్పుడు సాకారమవుతోంది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడమే కాకుండా.. పనుల వేగవంతానికి 2026-27 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో రూ.2911.84 కోట్ల భారీ నిధులను కేటాయించింది. దీంతో దశాబ్దాల కాలంగా సాగుతున్న ప్రజల నిరీక్షణకు తెరపడటమే కాకుండా.. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సరికొత్త బాటలు పడనున్నాయి.ఈ రైల్వే మార్గం కేవలం ప్రయాణికుల కోసమే కాకుండా.. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతాలను కలుపుతూ ఒక వ్యూహాత్మక కోల్ కారిడార్‌గా రూపుదిద్దుకోనుంది. దీనివల్ల బొగ్గు రవాణా వ్యయం గణనీయంగా తగ్గడమే కాకుండా, రవాణా ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. ప్రస్తుతం భద్రాచలం నుంచి రామగుండం చేరుకోవడానికి సుమారు 286 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉండగా.. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే ఆ దూరం 90 కిలోమీటర్ల మేర తగ్గిపోనుంది. ఇది ఇటు సింగరేణి సంస్థకు, అటు ప్రయాణికులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.మొత్తం 207.80 కిలోమీటర్ల పొడవైన ఈ నూతన బ్రాడ్ గేజ్ మార్గం పెద్దపల్లి జిల్లాలోని రాఘవాపురం వద్ద ప్రారంభమై మంథని, భూపాలపల్లి, మేడారం, తాడ్వాయి, కాటాపురం మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వరకు సాగనుంది. ముఖ్యంగా ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం వంటి మారుమూల ప్రాంతాలకు రైలు సౌకర్యం కలగడం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఘట్టం. గతేడాది మే నెలలోనే భూసేకరణ ప్రకటన వెలువడగా.. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో సర్వేలు, భూపరీక్షలు పూర్తి కావడంతో పనులు వేగంగా మొదలుకానున్నాయి.ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే న్యూఢిల్లీ-చెన్నై గ్రాండ్ ట్రంక్, నాగ్‌పూర్-విజయవాడ సెక్షన్లకు ఇది ఒక బలమైన ప్రత్యామ్నాయ మార్గంగా నిలుస్తుంది. భవిష్యత్తులో దీనిని భద్రాచలం-కొవ్వూరు మార్గంతో అనుసంధానించడం ద్వారా విశాఖపట్నం పోర్టు వరకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచవచ్చని అధికారులు భావిస్తున్నారు. రూ.4 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ భారీ ప్రాజెక్టును వచ్చే 10-15 ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.కాగా, రామగుండం-మణుగూరు రైల్వే మార్గం ఆమోదం శుభపరిణామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడారం వంటి మారుమూల ప్రాంతాలకు దీనివల్ల ప్రయాణ సౌకర్యాలు మెరుగవుతాయని చెప్పారు. అనేక పర్యాయాలు కేంద్ర రైల్వే శాఖకు విన్నవించానని.. పార్లమెంట్‌లోనూ మాట్లాడినట్లు ఎంపీ ఈటల రాజేందర్ చెప్పుకొచ్చారు.

## బీసీ సంక్షేమ శాఖ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన వి.హనుమంతరావు



**హైదరాబాద్:**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి హనుమంతరావు గురువారం బీసీ సంక్షేమ శాఖ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ సలహాదారు గా బాధ్యతలు స్వీకరించిన వి.హనుమంతరావు కు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు గా నియమితులైన సీనియర్ నాయకులు హనుమంతరావు శుభాకాంక్షలు. బలహీన వర్గాలకు న్యాయం చేయలని ముందుకు వెళ్తున్న సందర్భంలో వారి బలహీన వర్గాల సంక్షేమం కోసం వారి సలహాలు సూచనలు స్వీకరిస్తాం. బలహీన వర్గాల హక్కుల కోసం అందరం కలిసి పని చేస్తామని అన్నారు.

## ప్రధాని సందేశం.. కాన్వాయ్ తగ్గించుకోవాలని తెలంగాణ గవర్నర్ నిర్ణయం



**హైదరాబాద్, మే :** పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు చర్యలు పాటించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపును తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆచరిస్తున్నారు. తన కాన్వాయ్‌ను తగ్గించుకోవాలని గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. దేశ ప్రధాని సందేశానికి తాము మద్దతు ఇస్తున్నామని గవర్నర్ వెల్లడించారు. వాహనాలను తగ్గించే ప్రధాని కార్యక్రమాన్ని తాము అమలు చేస్తున్నట్లు చెప్పారు. లోక్ భవన్‌లో ఇప్పటికే సగం వాహనాలను తగ్గించామని అన్నారు. వాహనాలను తగ్గించడం వల్ల ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులు.. ప్రధాని సందేశాన్ని అమలు చేయాలని గవర్నర్ కోరారు. తెలంగాణ ప్రజలు కూడా ప్రధాని విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, కాలేజీలలో ప్రధాని మోదీ సందేశాన్ని లైన్ ఇంప్లిమెంట్ చేయాలని కోరుతున్నట్లు గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పేర్కొన్నారు.

## బడా బాబుల పిల్లలే టార్గెట్‌గా డ్రగ్స్ విక్రయం.. ఇద్దరి అరెస్ట్

**హైదరాబాద్, మే 14:** నగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడింది. సూరారం-కొంపల్లి హైటెన్షన్ రోడ్‌లో డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్టీఎఫ్‌బీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇన్నోవా కారులో డ్రగ్స్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో కారు ఆపిన అధికారులు.. తనిఖీలు చేపట్టగా డ్రగ్స్ బయటపడింది. నిందితులు నుంచి మూడు గ్రాములు ఎండీఎంఏ, 36 గ్రాముల ఓజీ కుష్, 7 గ్రాముల చరస్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.2.58 లక్షలు ఉంటుందని అంచనా. బడా బాబుల పిల్లలే టార్గెట్‌గా డ్రగ్స్ అమ్మకాలు జరిపి.. నిందితులు భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు ఎస్టీఎఫ్‌బీ అధికారులు తెలిపారు. డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్స్‌తో పాటు కారును సీజ్ చేశారు. డ్రగ్స్‌ను ఎవరి వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు, ఎప్పటి నుంచి ఈ దందా నడిపిస్తున్నారనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుల వెనక పెద్ద ముఠా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# వాటర్ ట్యాంకర్స్ కు ఫుల్ డిమాండ్



**హైదరాబాద్, మే 14:**హైదరాబాద్‌పై సమ్మర్ ప్రభావంతో నీళ్ల ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. కొద్దిరోజులుగా నీళ్ల ట్యాంకర్ల కోసం బుకింగ్స్ పెరిగాయి. నీళ్ల ట్యాంకర్లకు డిమాండ్ పెరగడంతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పగటి వేళలో గృహ అవసరాల కోసం ట్యాంకర్లు పంపిస్తున్నారు. రాత్రి వేళల్లో కమర్షియల్ అవసరాల కోసం ట్యాంకర్లు సరఫరా చేస్తున్నారు. నగరంలోని పలుప్రాంతాల్లో కొద్ది రోజులుగా ట్యాంకర్ల బుకింగ్స్ భారీగా పెరిగాయని చెబుతున్నారు.హైదరాబాద్‌పై వేసవికాలం ఎఫెక్ట్ కనిపిస్తోంది.. బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో నీళ్లకు డిమాండ్ పెరిగింది. నగరంలో ట్యాంకర్లకు గిరాకీ పెరిగింది.. కొద్దిరోజులుగా బుకింగ్‌లు చాలా పెరిగాయి. ఈ క్రమంలో వాటర్ బోర్డు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పగటిపూట గృహ అవసరాల కోసం ట్యాంకర్ల ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారు. రాత్రి వేళల్లో కమర్షియల్ అవసరాల కోసం నీళ్లను సరఫరా చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో నీళ్ల ట్యాంకర్లను పర్యవేక్షిస్తూ ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం నగరంలో రోజుకు ఏకంగా 11వేలకు పైగా ట్రిప్పుల నీళ్లు డెలివరీ చేస్తున్నారు. ట్యాంకర్ బుక్ చేసుకున్న 24 గంటల్లోనే ట్యాంకర్ అందిస్తున్నారు. అంతేకాదు హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు ట్యాంకర్లు ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారు.గ్రేటర్ నగరం పరిధిలో 30 ప్రాంతాల్లో నీళ్ల ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. నిజాంపేట, కూకట్‌పల్లి, ఎర్రగడ్డ, వెంకటగిరి, ఎల్లారెడ్డిగూడ, అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట, మణికొండ, గచ్చిబౌలి, టీఎన్‌జీఓస్ కాలనీ, షేక్‌పేట వంటి ప్రాంతాలు ఉన్నాయి. నగరంలోని వాటర్ బోర్డు ఆధ్వర్యంలో మొత్తం 11233 ట్యాంకర్ల ద్వారా 11వేల ట్రిప్పులు నీళ్లు సరఫరా చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా మొత్తం 84 ఫిల్లింగ్ స్టేషన్ల వారీగా సరఫరాను పర్యవేక్షిస్తున్నారు. ఐటీ విభాగం ద్వారాడాష్ బోర్డును సిద్ధం చేయించారు. ఒకవేళ బుకింగ్‌లు ఏవైనా పెండింగ్ ఉంటే తెలిసేలా ప్లాన్ చేశారు.వంద లోపు బుకింగ్స్ పెండింగ్ ఉంటే ఓ కలర్, అదే 200 వరకు పెండింగ్ ఉంటే మరో కలర్, 200లకు పైగా ట్యాంకర్ల పెండింగ్‌లో ఉంటే మరో కలర్ ఉండేలా రూపొందించారు. ఇలా ట్యాంకర్లకు సంబంధించిన వివరాలు డిస్‌ప్లే అవుతున్నాయి. ఒకవేళ పెండింగ్ ఉంటే.. ఆయా వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ల వారీగా అధికారులను అలర్ట్ చేస్తారు. రోజువారీ బుకింగ్‌లతో పాటుగా డెలివరీ, పెండింగ్ ఉన్నవి ఈజీగా తెలుసుకోవచ్చు. ఒకవేళ ఎక్కువగా బుకింగ్స్ పెండిగ్ ఉంటే కారణాలు తెలుసుకుని వారికి 24 గంటల్లోగా ట్యాంకర్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. డిమాండ్‌కు సరిపడా ట్యాంకర్లు పంపేందుకు అర్ధరాత్రి వరకు ఫిల్లింగ్ స్టేషన్లు పనిచేస్తున్నాయి. అవసరమైన చోట్ల ఫిల్లింగ్ స్టేషన్లను పెంచారు.

# బండి చుట్టూ రాజకీయం...



**హైదరాబాద్,మే 14:**తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వ్యక్తిగత స్థాయికి చేరుకున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు కేవలం ఒక నేరపూరిత దర్యాప్తుగా మిగలకుండా, రాష్ట్రంలో రాజకీయ సెగలు పుట్టిస్తోంది. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లి వంటి ప్రధాన ప్రాంతాల్లో బండి భగీరథ్ పరారీ అంటూ వెలిసిన పోస్టర్లు ఈ వివాదాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాయి. అసలు ఈ పోస్టర్లు ఎవరు వేశారు? దీని వెనుక ఉన్న రాజకీయ శక్తులు ఏవి? అన్నది పక్కన పెడితే, ప్రత్యర్థిని దెబ్బతీయడానికి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.ఈ వ్యవహారం రెండు భిన్నమైన కథనాల మధ్య నలుగుతోంది. ఒక వైపు, ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిందని, ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని ప్రాసిక్యూషన్ చెబుతోంది. మరోవైపు, ఇది పక్కాగా ప్లాన్ చేసిన హనీ ట్రాప్ అని, రూ. 5 కోట్ల వరకు డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేశారని భగీరథ్ తరపున కౌంటర్ ఫిర్యాదు నమోదైంది. చట్టం తన పని తాను చేసుకుపోవాల్సి ఉండగా, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ట్రోలింగ్ ఈ కేసులో అసలు బాధితులు ఎవరో తేల్చలేనంత గందరగోళాన్ని సృష్టిస్తోంది.సాధారణంగా ఏదైనా కేసు నమోదైనప్పుడు దర్యాప్తుకు సహకరించాల్సిన బాధ్యత నిందితులపై ఉంటుంది. అయితే, బుధవారం సిట్ విచారణకు భగీరథ్ హాజరుకాలేదు. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ పూర్తయిన తర్వాత వచ్చేలా రెండు రోజుల తరవాత వస్తానని సమాచారం పంపారు. బండి సంజయ్ రాజకీయంగా తనను ఎదుర్కోలేకనే తన కుమారుడిని బలి చేస్తున్నారని, ఇది తనపై జరుగుతున్న పొలిటికల్ హిట్ జాబ్ అని ఆరోపిస్తున్నారు. అధికార పక్షం మాత్రం.. నేరం చేసింది ఎవరైనా చట్టం ముందు సమానమేనని, బాధితురాలికి న్యాయం జరగాల్సిందేనని పట్టుబడుతోంది. మరో వైపు బీఆర్ఎస్ నేతలు బండి సంజయ్‌ను టార్గెట్ చేస్తున్నారు. ఆయన రాజీనామా చేయాలంటున్నారు. ఈ రాజకీయ యుద్ధంలో బాధితురాలి కుటుంబానికే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి. రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు బురద చల్లుకునే క్రమంలో, బాధితురాలి గుర్తింపును గానీ, ఆమె మానసిక స్థితిని గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు ఈ సమస్యను పరిష్కరించడానికి వివాహం వంటి వింత సలహాలు ఇవ్వడం, దానికి టీపీసీసీ ఖండన తెలపడం వంటివి చూస్తుంటే.. ఈ అంశం ఎంతటి అయోమయానికి గురైందో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో నేతలను వ్యక్తిగతంగా దెబ్బతీయడానికి వారి పిల్లలను, కుటుంబ సభ్యులను వాడుకునే సంస్కృతి పెరిగిపోవడం ఆందోళనకరమన్న అభిప్రాయం వినిపిస్తోంది. అది భగీరథ్ అయినా, మరెవరైనా.. నేరం నిరూపితమైతే చట్టపరమైన శిక్ష అనుభవించాలి. కానీ, దర్యాప్తు పూర్తికాకముందే పోస్టర్లతో వేధించడం , రాజకీయ కుట్రలంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడంపై విమర్శలు వస్తున్నాయి. చివరకు కోర్టులో తేలాల్సిన అంశాన్ని వీధి పోరాటంగా మార్చడం వల్ల వ్యవస్థల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళనవ వ్యక్తమవుతోంది.

# వర్క్ ఫ్రమ్ హోమ్ తో రోజుకు 4 కోట్ల ఆదా



**హైదరాబాద్, మే 14:**మనదేశంలో పేరుపొందిన ఐటి నగరాలలో హైదరాబాద్ ముందు వరుసలో ఉంటుంది. ఫార్మా లో కూడా హైదరాబాద్ నగరానికి తిరుగులేని స్థాయి ఉంది. అతిపెద్ద కంపెనీలు.. అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఫలితంగా హైదరాబాద్ స్థాయి గ్లోబల్ రేంజ్ ను మించిపోయింది. మన దేశ ఆర్థిక రాజధాని ముంబైతో హైదరాబాద్ పోటీ పడుతుంది. హైదరాబాద్ నగరంలో పెద్ద పెద్ద కంపెనీలు ఏర్పాటైన నేపథ్యంలో.. ఉద్యోగులు కూడా అదే స్థాయిలో ఉన్నారు. హైదరాబాదులోనే వారు స్థిర నివాసం ఏర్పరచుకోవడంతో.. హైదరాబాద్ నగరం అంతకంతకు విస్తరిస్తోంది.హైదరాబాదు నగరంలోని ఐటీ కారిడార్ ప్రాంతంలో దాదాపు తొమ్మిది లక్షల మందికి పైగా పనిచేస్తున్నారు. వీరిలో చాలామంది సొంత వాహనాలలో ఆఫీస్ కు వస్తుంటారు. కొన్ని కంపెనీలు గతంలో ప్రయాణ సౌకర్యాన్ని అందించేవి. ఖర్చులను తగ్గించుకోవడానికి చాలావరకు కంపెనీలు ప్రయాణ సౌకర్యాన్ని తగ్గించేశాయి. దీంతో ఉద్యోగులు మొత్తం సొంత వాహనాలలో కార్యాలయాలకు వస్తున్నారు. దీంతో హైదరాబాద్ నగరంలో పెట్రోల్ వినియోగం పెరిగిపోయింది.. పెట్రోల్ వినియోగం పెరిగిపోవడం వల్ల సహజంగానే కాలుష్యం కూడా పెరిగిపోతూ ఉంటుంది.ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్క్ ఫ్రం హోం చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయంగా యుద్ధ ప్రభావాలు ఇంకా తగ్గలేదని.. దీనివల్ల మన దేశం మీద తీవ్రమైన ఒత్తిడి ఉందని.. అందువల్ల ఉద్యోగులు ఇంటి నుంచి పని చేయడానికి ఆసక్తిని చూపించాలని సూచించారు. ప్రధానమంత్రి కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోం విధానానికి మరోసారి శ్రీకారం చుడుతున్నట్టు తెలుస్తోంది.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఒకసారి హైదరాబాద్ లో ఉన్న పరిస్థితిని అంచనా వేస్తే..హైదరాబాదు నగరంలో ఐటి కారిడార్ ప్రాంతంలో 9 లక్షల మందికిపైగా పనిచేస్తూ ఉంటారు. వీరిలో చాలామంది సొంత వాహనాలలో ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఇందులో సగం మంది(4.5 లీటర్లు) కి వర్క్ ఫ్రం హోం ఇచ్చినా.. రోజుకు 3.6 లక్షల లీటర్ల పెట్రోల్ ఆదా అవుతుంది. ఒక్కో వ్యక్తి సగటున 20 కిలోమీటర్లు ప్రయాణిస్తారు అనుకుంటే మొత్తం 90 లక్షల కిలోమీటర్లు అవుతుంది. లీటర్ కు సగటున 25 కిలోమీటర్ల మైలేజీ వస్తుంది అనుకుంటే 3.87 కోట్లు ఆదా అయినట్టే. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర 107.50 గా ఉంది. హైదరాబాద్ నగరంలోనే ఇలా ఉంటే, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్ కతా, వంటి నగరాలలో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తే మరింత పెట్రోల్ ఆదా అవుతుందని.. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఒత్తిడి తగ్గుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

## కేరళం సీఎంగా వీడీ సతీశన్

**కేరళం సీఎంగా సతీశన్ పేరును ప్రకటించిన హైకమాండ్**



**తిరునంతపురం:**కేరళం ముఖ్యమంత్రిగా వీడీ సతీషన్ పేరును కాంగ్రెప్ హై కమాండ్ గురువారం ప్రకటించింది. ఎర్నాకుళం జిల్లా నెట్టూరు జన్మించిన సతీష్ ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. సోషల్ వర్క్సో మాస్టర్స్, ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం చదివారు. కేరళం హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసారు. కాంగ్రెస్ విద్యార్థి విభాగం నుంచి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2001లో తొలిసారి పరవూరు నుంచి ఎమ్మెల్యే అయ్యారు. పరవూరు నియోజకవర్గం నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2026లో పరవూరులో కేఎం దినకరన్, 2011లో సీపీఎం నేత పన్నయన్ రవీంద్రన్పై విజయం సాధించారు. 2016లో శారదా మోహన్పై 20,634 ఓట్ల తేడాతో గెలుపోందారు. 12వ అసెంబ్లీలో భారత జాతీయ కాంగ్రెస్ చీఫ్ విప్గా బాధ్యతలు నిర్వహించారు. 2021లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మెంబర్గా నియామకం అయ్యారు. 2026 కేరళం ఎన్నికల్లో గెలుపులో అయన కీలక పాత్ర పోషించారు.

## బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు..

**పలువురు కార్మికులు మృతి..!!**

**భోపాల్, మే 14:**మధ్యప్రదేశ్ దేవాస్ జిల్లాలో ఘోర విషాదం జరిగింది. జిల్లాలో టోంక్ కాలాన్ ప్రాంతంలో బాణాసంచా తయారీ కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై సమాచారం అందగానే జిల్లా ఉన్నతాధికారులతోపాటు పోలీసులు బాణాంసంచా తయారీ కర్మాగారం వద్దకు చేరుకున్నారు. స్థానికుల సహాయంలో క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఘటన స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భారీ శబ్ధంతో ఈ పేలుడు సంభవించిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ పేలుడు దాటికి పరిసర ప్రాంతాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

వార్తాతరంగాలు
శుక్రవారం 15 మే 2026

# పేదలకు అత్యాధునిక వైద్య సేవలు





**వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి**

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ మే 14( స్కై న్యూస్)** గత ప్రభుత్వం విద్యా వైద్య రంగాలను నిర్లక్ష్యం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా పాలన అందిస్తూ నియోజకవర్గంలో విద్యా వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి వివరించారు గురువారం ప్రభుత్వం మెడికల్ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించే ఆసుపత్రి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు కూడా కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులను కల్పించడంతోపాటు అత్యవసర పరిస్థితులలో కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం పొందిన వారికి ఎల్ఓసిలు అందించడం జరుగుతుందని వివరించారు. ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలలో అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు నూతన ఆసుపత్రి నిర్మాణానికి నిధులను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు నియోజకవర్గంలో వైద్య రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు సేవలు అందించడంతోపాటు మెడికోలకు మెరుగైన శిక్షణ అందుతుందని తెలిపారు సందర్భంగా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించేందుకు నిరంతరం పనిచేస్తుందని అన్నారు. గ్రామాల ప్రజలకు కూడా వైద్యం అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి జిల్లా సాధారణ ఆసుపత్రి సూపర్డెంట్ ఉషారాణి మునిసిపల్ చైర్మన్ తీగల సునింద్ర కుమార్ వైస్ చైర్మన్ బాదం రమేష్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కా రాజ్ కుమార్ రెడ్డి మాజీ ఎంపీపీ కోటయ్య కౌన్సిలర్ అలివేలమ్మ నిజాముద్దీన్ ఆసిఫా బేగం ఖాదర్ ఆవంచ మాధవి రాజు పడిగా శంకర్ నజిమా ఇసాక్ తోపాటు నాయకులు కార్యకర్తలు మెడికల్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు

# నిరుపేద ప్రజల సొంతింటి కల ప్రజాపాలనలో సాధ్యమైంది

**ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**



**దేవరకద్ర భూత్పూర్ మే 14 (స్కై న్యూస్);** భూత్పూర్ మండల పరిధిలోని పెద్ద తండా, కొత్తూరు, షేర్ పల్లి, హస్నాపూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించి లబ్ధిదారులకు నూతన వస్త్రాలను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి,లబ్ధిదారులకు ఆర్థిక శు భాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయించి వారికి విడుదల వారీగా వారి ఖాతాలో డబ్బులు 5 లక్షల రూపాయలు నమోదు చేయడం జరిగిందని వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులతో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి, గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి దేవరకద్ర నియోజకవర్గం ప్రజలందరి తరపున ప్రత్యేకంగా ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య

**డీఈవో రమేష్ కుమార్**




**నాగర్ కర్నూల్ బిజినేపల్లి మే 14 (స్కైన్యూస్)** ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు మెరుగైన వైద్య అందుతుందని అందుకోసం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే బోధన జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ అన్నారు గురువారం బిజినేపల్లి మండల కేంద్రంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యా వారోత్సవాలలో భాగంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో రమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయుల బోధనతో పాటు తల్లిదండ్రుల సహకారం అత్యంత అవసరమని అన్నారు. విద్య కేవలం పాఠ్యపుస్తకాలకై పరిమితం కాకుండా నైతిక విలువలు క్రమశిక్షణ తో పాటు సామాజిక బాధ్యత పెంపొందించే విధంగా ప్రభుత్వ పాఠశాలలో బోధన ఉందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ పనిచేస్తుందని పదవ తరగతి ఫలితాల్లో కూడా రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం సాధించడం జరిగిందని ఆయన వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్య స్మార్ట్ క్లాస్ రూములు ఆంగ్ల మాధ్యమ బోధనతో పాటు మధ్యాహ్న భోజన పథకం ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ నోటు పుస్తకాలు వంటి వాటిని విద్యార్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా చేస్తున్న ప్రయత్నాలకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. విద్యార్థులలో మొబైల్ ఫోన్ వినియోగం సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించి చదువుపై దృష్టి కేంద్రీకరించిన తల్లిదండ్రులు మార్గం నిర్దేశకం చేయాలని కోరారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలలో రాణించాలని వివరించారు శ్రీనివాస్ రెడ్డి విద్యా అధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి....



**కొల్లాపూర్ మే 14 (స్కైన్యూస్)** నేటి ప్రశ్నపత్రాలు లీకేజీకి బాధ్యత వయస్సు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలుమూల ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు పరీక్షల నిర్వహణలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే వారి జీవితాలతో చెలగాటమాడే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రశ్నాపత్రాలను లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెంది పరీక్షలను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో విద్యా వ్యవస్థను ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ పేద మరియు మధ్య తరగతి విద్యార్థుల ఆశయాలను నాశనం చేస్తుందని మండిపడ్డాడు ప్రతి సంవత్సరం నేటి పరీక్షలు అవినీతి పేపర్ లీకేజీలు అక్రమాలతో నిర్వహిస్తున్నారని అనేక సందర్భాలలో పలు ఆరోపణలు వచ్చినా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మాఫియా కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ ప్రశ్నాపత్రాలను లీకేజీ చేస్తూ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా ఎన్టిఏను రద్దుచేసి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అనూష ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఇందిరమ్మ విద్యార్థి నాయకులు శ్రీకాంత్ ఆదిత్య గణేష్ శివ గాయత్రి శ్రీనిధి అక్షర భవ్య శ్రీ కావ్య శ్రీ తదితరులు పాల్గొన్నారు

# ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

**మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత**



**నారాయణపేట మే 14: ( స్కైన్యూస్)** నారాయణపేట గాంధీనగర్ లోని హనుమాన్ మందిరం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్ అన్నారు.గురువారం గాంధీనగర్ హనుమాన్ మందిరంలో కల్యాణ మండపం నిర్మాణానికి ఆమె భూమి పూజ నిర్వహించా రు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్,మాజీ కౌన్సిలర్ జయశ్రీ విజయ్,బీజేపీ నాయకులు విజయ్ కుమార్ నవలే,గాంధీనగర్ వాసులు సంగనర్సింలు,సత్యనారాయణ చిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ టి ఏ సంస్థను రద్దుచేసి కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి




**అచ్చంపేట మే 14 (స్కై న్యూస్)** లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ నీటి పరీక్షలు రద్దు చేయడం జరిగిందని పరీక్షలలో అవకతవకలు జరగడం వల్ల విద్యార్థులకు ఎంతో నష్టం జరిగిందని వెంటనే ఎన్ టి ఏ ను రద్దుచేసి కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని జిల్లా అధ్యక్షులు రమావత్ సంతోష్ డిమాండ్ చేశారు గురువారం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015 మరియు 2024 మరియు 2026 లో నీట్ పరీక్ష పత్రం లీకు కావడం కేంద్ర విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇటీవల జరిగిన నీట్ పరీక్షలలో 22 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని పరీక్షలు రద్దు చేయడం వల్ల తీవ్ర మానసిక శోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వ వైఫల్యం కప్పిపుచ్చుకునేందుకు చేస్తున్న కుట్రను వ్యతిరేకిస్తూ తమ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిబిఐ దర్యాప్తు జరిపించాలని ప్రభావిత విద్యార్థులకు ఉచిత మానసిక ఆరోగ్య సహాయం అందించాలని ఉచిత న్యాయ సాయం కల్పించాలని కోరారు. అనేక మంది పేద విద్యార్థులు పరీక్షలకు హాజరై ఇబ్బందులు ఎదుర్కొండడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నల్లవెల్లి యశ్వంత్ తాలూకా అధ్యక్షులు లడ్డు యాదవ్ ప్రధాన కార్యదర్శి కార్తీక్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రహీం మున్ననూర్ సర్పంచ్ మంజుల రాజారామ్ వెంకటరమణ వెంకటేశ్వర్లు కృష్ణయ్య బాలస్వామి రమేష్ శంకర్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు

# రైతు సంక్షేమమే మోడీ సర్కారు లక్ష్యం

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్**



**నారాయణపేట మే 14( స్కై న్యూస్):**రైతు సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ సర్కార్ పనిచేస్తున్నారని నారాయణపేట జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.నిన్నటి కేంద్ర కేబినెట్ లో మరోసారి పంటలకు మద్దతు ధర పెంచి నిర్భయం తీసుకోవడం హర్షదాయకమని అన్నారు.మద్దతు ధర పెంపుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.రైతు పండించిన పంట కు లాభదాయకమైన గిట్టుబాటు ధరను అందించడమే కాకుండా రైతు ఆదాయ భద్రతను పటిష్టం చేస్తుందని అన్నారు.దేశ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు.రైతు సంక్షేమానికి కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు.కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్రమోడీ కి కృతజ్ఞతలు తెలిపారు.

# చెరువు మట్టి తరలింపు అరికట్టాలి

**టిప్పర్ లపై కేసులు నమోదు చేయాలి:బిజెపి**




**నారాయణపేట మే 14:( స్కై న్యూస్)**ధన్వాడ గ్రామ చెరువు నుండి అక్రమంగా ఒండ్రు మట్టి తరలిస్తున్నరాణి వెంటనే అరికట్టాలని టిప్పర్లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు గురువారం ఎస్సై కి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు వేణు,రాజేష్ యాదవ్ మాట్లాడుతూ ధన్వాడ గ్రామ చెరువు నుండి మరికల్ మండల కేంద్రంలోని ఇటుక బట్టీలకు కొంతమంది వ్యక్తులు టిప్పర్ల ద్వారా అక్రమంగా ఒండ్రు మట్టిని తరలిస్తున్నరని అన్నారు. ఈ అక్రమ మట్టి తవ్వకాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగ డంతో పాటు చెరువు పరిర క్షణకు కూడా భంగం కలుగు తోందన్నారు.అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను వెంటనే గుర్తించి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.లేకపోతే ప్రజా సమస్య పరిష్కారం కోసం టిప్పర్లను అడ్డుకొని బిజెపి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కార్యక్ర మాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి...




**నాగర్ కర్నూల్ మే 14 (స్కైన్యూస్)** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు భగీరథను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ నాయకులు పొదిల రామయ్య డిమాండ్ చేశారు కేసును పక్కదోవ పట్టించేందుకే అరెస్టులో జాప్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండి భగీరథకు పోలీస్ లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి విదేశాలకు పారిపోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి ఫోక్సో కేసు నిందితుడు భగీరథున వెంటనే అరెస్టు చేయాలని కోరారు. మైనర్ బాలిక కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి వారం రోజులు అవుతున్న ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం నిందితుడిని కాపాడేందుకు ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడు విచారణకు హాజరుకావాలని పోలీసు ప్రత్యేక అధికారులు నోటీసులు ఇచ్చిన నిర్లక్ష్యం చేస్తూ సాక్షాలతో హాజరవుతానని చెప్పడం అతని అహంకారానికి నిదర్శనం అని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల హైదరాబాద్ పర్యటనలో సంవత్సరం వరకు బంగారం కొనకూడదని దిగుమతి సుంకం పై విధిస్తున్న పన్నును 15 శాతానికి పెంచడం వల్ల బంగారం ధరలు విపరీతంగా పెరిగాయని సామాన్యుడు కొనలేని పరిస్థితిలో ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటేష్ సత్యనారాయణ మల్లికార్జున్ కురుమూర్తి లక్ష్మీ ప్రియ లక్ష్మయ్య ఆంజనేయులు నిరంజన్ నరసింహ చరణ్ శిరీష తదితరులు పాల్గొన్నారు

# డీజిల్ పెట్రోల్ వద్దు బ్యాటరీసోలార్ ముద్దు

**గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీ హరి**



**వరంగల్ మే 14 ;** వరంగల్ చౌరస్తాలో గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీ హరి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు ముఖ్య ఉద్దేశం పెట్రోల్ డీజిల్ గ్యాస్ వాటి మీద భారతీయులు ఎప్పుడుఆధారపడవద్దని ఇతర దేశాల మీద ఆధారపడవద్దని ఏ దేశంలో యుద్ధం జరిగిన ఆ యొక్క ఎఫెక్ట్ భారతదేశ మీద కూడా పడుతుందని దాని ద్వారా సమర్లు విజిల్ పెట్రోల్ గ్యాస్ లాంటి ప్రజలకు టైముకుఅందకపోవడం వాటిపై అతిగా అధికమైన రేట్లు పెట్టడం ఇది వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు కనుక ప్రతి ఒక్కరు సైకిల్ వినియోగం పెంచాలి పెట్రోల్ డీజిల్ ని ఆదా చేయాలి పాత వ్యవస్థలో సైకిల్ విధానం అనేది చాలా గొప్పది దానివల్ల ఆరోగ్యమే కాకుండా ఆర్థిక భారం తగ్గుతుంది ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ బ్యాటరీ సోలార్ బండ్లను వినియోగించుకోవాలని అలాగాకముఖ్యమంత్రులు మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మిగతా రాజకీయ నాయకులు వారి యొక్క సెక్యూరిటీ వాహనాలను తగ్గించుకోవాలని కోరారు వీరిని చూసి దేశ ప్రజలు స్ఫూర్తిగా తీసుకొని వారి బాటలు నడవాలని రాజనాల స్వీరి కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూలపాక ప్రసాద్ మాగంటి శివ గంద్రకోట రామచందర్ తదితరులు పాల్గొన్నారు...

వార్తాతరంగాలు



# యువతకు ఉపాధి కల్పించేందుకే జాబ్ మేళాలు.

**ప్రభుత్వ ఆర్ట్స్ మరియు కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాంజలి**






**నాగర్ కర్నూల్ మే 14 (స్కై న్యూస్)** జిల్లాలోని యువతకు వివిధ ప్రైవేటు కంపెనీలలో ఉపాధి కల్పించేందుకు ఆర్ట్స్ మరియు కామర్స్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే గీతాంజలి తెలిపారు బుధవారం నిర్మాణ్ సంస్థ మరియు జిల్లా ఉద్యోగ ఉపాధి కల్పన సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబు మేళ విజయవంతమైనట్లు ఆమె వివరించారు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన జాబు మేలకు సుమారు 200 మంది జిల్లాలోని పలు ప్రాంతాల నుండి హాజరైనట్లు తెలిపారు. ఎన్నికైన అభ్యర్థులకు కంపెనీల నుండి వెంటనే ఆఫర్ లెటర్ అందజేసినట్లు తెలిపారు త్వరలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ దీపిక ఆధ్యాపక బృందం కృష్ణయ్య హాజీరా ధర్మ రవీందర్ అశోక్ చంద్రశేఖర్ తో పాటు వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు

# 15 నుండి బాలసంస్కార్-2026 ప్రారంభం

**సేవా సమితి అధ్యక్షులుకటంగూరి సత్యనారాయణ రెడ్డి**



**హన్మకొండ మే 14 :** శ్రీరామకృష్ణ సేవా మందిరం, కె ఎల్ ఎన్ రెడ్డి కాలనీ, హనుమకొండ యందు "బాలసంస్కార్-2026 వేసవి శిక్షణా శిబిరం" ఈ నెల 15 నుండి పది రోజులు ప్రతి రోజు ఉదయం 6 నుండి 11 గంటలవరకు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షులుకటంగూరి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం నుండి జరుగనున్న "బాల సంస్కార్ 2026" కార్యక్రమంలో ఈ 10 రోజులపాటు ఉదయం గం. 5:40 ల నుండి గం 11:30ల వరకు తమ సమయాన్ని కెటాయించి, స్వచ్ఛంద వాలంటీర్ గా తమ సేవలు అందించాలన్న తపన, అభిలాష కలవారి కొరకు నిన్న (తేది:14.05.2026 శనివారం) సాయంత్రం 5 గంటలకు "వాలంటీర్ల శిక్షణ సమావేశము" మన సేవా మందిరంలో ఏర్పాటు చేయనైనది. అందులో వాలంటీర్లకు వారి బాధ్యతల పంపిణీ మరియు పాటించాల్సిన నియమనిబంధనల గురించి చర్చించి సరైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించు కోవడం జరిగింది. శిక్షణ సమావేశంలో పాల్గొన్న వాలంటీర్లు వేసవి శిబిరంలో పాల్గొనే అర్హత పొందడంతో పాటుగా తమ అమూల్య సేవలతో మూర్తిత్రయ ఆశీస్సులు పొంది 10 రోజుల బాలసంస్కార్-2026 వేసవి శిబిరాన్ని విజయవంతం చేయాలని కటంగూరి సత్యనారాయణ రెడ్డి కోరారు.

# తెలంగాణ రాష్ట్ర షిప్స్ అండ్ గోట్స్ అభివృద్ధి సహకార సమైక్య కార్పొరేష న్ చైర్మన్ గా.. ప్రమాణ.స్వీకారం చేసిన సరితా తిరుపతయ్య..



**జోగులాంబ గద్వాల, మే 14(స్కై న్యూస్):** తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ అభివృద్ధి సహకార సమాఖ్య కార్పొ రేషన్ చైర్మన్ గా..బాధ్యతలు స్వీకరిం చిన బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి - నడిగడ్డ ముద్దుబిడ్డ సరిత తిరుపతయ్య నినేడు హైదరాబాద్ లో ప్రమాణ.స్వీకారం చేయడం జరిగింది. కార్యక్రమంలో పెద్దపల్లి అల్వల రాజశేఖర్ రెడ్డి సద్దలోని, గోన్పాడు శ్రీనివాసులు, మంగంపేట గ్రామ సర్పంచ్ వెంకటేష్, మంగంపేట గోవర్ధన్, గోపాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు పాల్గొని పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# 9వ వార్డు బోరు లో కరెంటు మోటర్ బిగించి మంచినీటి వసతులను కల్పించారు.



దేవరక ద్ర **ఆత్మకూర్ మే 14 (స్కై న్యూస్);**మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారం గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ జి నాగమణి వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, వార్డ్ కౌన్సిలర్ సద్దల తులసి వెంకట్ రాములు మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలో బోరులో కరెంటు మోటార్ బిగించి మంచినీటి వసతులు కల్పించారు. 9వ వార్డు ప్రజలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆపిల్ ఫార్మసీ మెడికల్ షాప్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**జోగులాంబ గద్వాల,మే14(స్కై న్యూస్):**గద్వాల జిల్లా కేంద్రంలో ఐసిఐసిఐ బ్యాంక్ ఎదురుగా నూతన ఆపిల్ ఫార్మసీ మెడికల్ షాప్ ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది. ఎమ్మెల్యే కి షాప్ యజమాని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్, వైస్ చైర్మెన్ శంకర్, కౌన్సిలర్ సత్యం, మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు మైలగడ్డ చంద్రశేఖర్ గంటరమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రుణాలను సద్వినియోగం చేసుకొని తిరిగి చెల్లించాలి....

**ఆర్థిక అభివృద్ధికే రుణాల మంజూరు**

**రుణాలతో పాటు సేవాలకు ప్రాధాన్యం**





**నాగర్ కర్నూల్ మే 14 (స్కై న్యూస్)** గ్రామీణ ప్రాంతాలలో మహిళా సంఘాలను ఏర్పాటు చేసుకొని చైతన్యంతో చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలను ప్రోత్సహించేందుకు గ్రామీణ పూట ఆధ్వర్యంలో రుణాలను మంజూరు చేస్తున్నట్లు డివిజన్ మేనేజర్ వారణాసి చంద్రశేఖర్ తెలిపారు గురువారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు సమీపంలో నూతన బ్రాంచ్ ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ప్రారంభించారు సందర్భంగా డివిజన్ మేనేజర్ వారణాసి చంద్రశేఖర్ సంస్థ అందించే రుణాలను చేపట్టే సేవా కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు అనంతరం పలువురు మహిళలకు రుణాల చెక్కులను ఎమ్మెల్యే అందించారు సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలు ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పాటు ప్రైవేటు సంస్థలు ఇచ్చే రుణాలను కూడా సద్వినియోగం చేసుకొని మరింత ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరారు. రుణాలు తీసుకున్న మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని తిరిగి చెల్లించాలని కోరారు. గ్రామాలలో కూడా చిరు వ్యాపారులను ప్రోత్సహించేందుకు తమ బ్యాంకు ఆర్బిఐ నిబంధనల ప్రకారం రుణాలను మంజూరు చేస్తుందని సంస్థ ఆధ్వర్యంలో గ్రామాలలో త్వరలో సేవా కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంస్థలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ దేశంలోని అతిపెద్ద మైక్రో ఫైనాన్స్ సంస్థలో పనిచేసే అవకాశం తమ బ్యాంకు కనిపిస్తుందని 12వ తరగతి ఉత్తీర్ణత లేదా పరీక్ష రాసిన వారు కూడా ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. వ్యక్తిగత ద్విచక్ర వాహనం కలిగి ఉండాలని ఎంపికైన వారికి ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి ఇన్సూరెన్స్ పిఎఫ్ సదుపాయంతో పాటు వేతనం ప్రయాణభత్యం కల్పిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునింద్ర కుమార్ వైస్ చైర్మన్ బాదం రమేష్ కౌన్సిలర్లు శ్రీనివాసులు పడిగా శంకర్ నిజామొద్దీన్ సింధు రాజేష్ చంద్రకళ బ్యాంకు ఏరియా మేనేజర్ వెంకటేష్ బ్రాంచ్ మేనేజర్ నరేష్ సపోర్టింగ్ మేనేజర్ మాణిక్యం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కా రాజ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి జిల్లా కార్యదర్శి కొత్త శ్రీనివాసులు నాయకులు ఖాజా ఖాన్ ఖాదర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉజ్వల్ తోపాటు పలువురు పాల్గొన్నారు

# ప్రతిభతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలి...

**నాణ్యమైన విద్య అందించేందుకే కృషి**






**నాగర్ కర్నూల్ తిమ్మాజీపేట మే 14 (స్కైన్యూస్)** గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థినిలు అత్యంత ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయిలో నియోజకవర్గానికి గుర్తింపు తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి కోరారు గురువారం నియోజకవర్గంలోని తిమ్మాజీపేట మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను మరియు ఆధునిక సైన్స్ లాభను ఆయన ప్రారంభించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించిన పదవ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనే జిల్లాలు రెండవ స్థానంలో నిలపడం హర్షనీయమన్నారు. విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్య వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడంతోపాటు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందన్నారు విద్యార్థులు చిన్ననాటి నుండే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు విద్యను కష్టంతో కాకుండా ఇష్టంతో అభ్యసించాలని సూచించారు. విద్యార్థులకు ట్రై మరియు షూస్ పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని తెలిపారు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని కార్పొరేట్ విద్యా సంస్థలను ఢీకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు అనంతరం కళాశాల ఆవరణను పరిశీలించారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ ప్రిన్సిపాల్ సుజాత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వివేక్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య గౌడ్ శ్రీనివాస్ బహదూర్ లక్ష్మీనారాయణ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవ్ తో పాటు పలువురు పాల్గొన్నారు

# ప్రధాని మోదీ సూత్రాలు సప్త పరివర్తన"ను ప్రజలు ఆచరించాలి

**మాజీ ఎంపీ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్**



**హైద్రాబాద్ మే 14** ;దేశ ఆర్థిక భద్రత కోసం ప్రధాని మోదీ సూచించిన "సప్త సూత్రాలు -- సప్త పరివర్తన"ను ప్రజలు ఆచరించాలని మాజీ ఎంపీ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ పిలుపునిచ్చారు.గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ దేశ ఆర్థిక భద్రత కోసం ప్రధానమంత్రి ఛ్రీతీవఅఉతీు వీశీఎఱ సూచించిన "సప్త సూత్రాలు -- సప్త పరివర్తన" గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, ముఖ్యంగా రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, గల్ఫ్ ప్రాంత పరిణామాలు వంటి అంతర్జాతీయ పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భారతదేశం **»»Developing Nationµµ** నుంచి **»»Developed Nation** గా ఎదగాలంటే దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమన్నారు.దేశ అభివృద్ధి రేటు దెబ్బతినకుండా, భవిష్యత్ ఆర్థిక సవాళ్లను ముందుగానే ఎదుర్కొనేందుకు ప్రధాని మోదీ గారు ప్రజల ముందుకు తీసుకువచ్చిన ఈ సప్త సూత్రాలు రాజకీయాల కోసం కాకుండా దేశ ఆర్థిక భద్రత కోసం చేసినబాధ్యతాయుతమైన విజ్ఞప్తి అని అన్నారు.భారతదేశం ప్రస్తుతం భారీ ట్రేడ్ డెఫిసిట్‌ను ఎదుర్కొంటోందని పేర్కొంటూ, ప్రతి సంవత్సరం సుమారు 700 బిలియన్ డాలర్ల దిగుమతులు జరుగుతుండగా, ఎగుమతులు దాదాపు 400 బిలియన్ డాలర్ల వరకు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సుమారు 300 బిలియన్ డాలర్ల ట్రేడ్ డెఫిసిట్ దేశ కరెన్సీ విలువపై ప్రభావం చూపుతోందన్నారు.దేశ కుటుంబ పెద్దగా ప్రధాని మోదీ గారు 140 కోట్ల భారతీయుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొన్ని బాధ్యతాయుతమైన సూచనలు చేశారని పేర్కొన్నారు. **»»Prevention is Better Than Cureµµ** అన్న సూత్రంతో భవిష్యత్ సంక్షోభాలను ముందుగానే అరికట్టేందుకు ఈ చర్యలు అవసరమని తెలిపారు.ప్రధాని మోదీ గారు సూచించిన సప్త సూత్రాల్లో ముఖ్యంగా ఒక సంవత్సరం పాటు బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలని కోరారని, శాశ్వతంగా కొనొద్దని కాదు, కేవలం తాత్కాలిక నియంత్రణ మాత్రమేనని స్పష్టం చేశారు.భారతదేశం ప్రపంచంలో చైనా తర్వాత అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకునే దేశమని, ప్రతి సంవత్సరం దాదాపు 800 టన్నుల బంగారం దిగుమతి అవుతోందని తెలిపారు. దీని విలువ సుమారు రూ.5.5 లక్షల కోట్ల నుంచి రూ.6 లక్షల కోట్ల వరకు ఉంటుందని, ఇందులో 95 శాతం వ్యక్తిగత వినియోగానికే ఉపయోగపడుతోందన్నారు.భారతీయుల వద్ద ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక ప్రైవేట్ గోల్డ్ నిల్వలు ఉన్నాయని, కేవలం 25 శాతం బంగారం కొనుగోళ్లు తగ్గించినా భారీగా విదేశీ మారక ద్రవ్యం ఆదాచేయవచ్చన్నారు. అదే మొత్తాన్ని భూమి, తయారీ రంగం లేదా మార్కెట్లలో పెట్టుబడులుగా మళ్లిస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని తెలిపారు.పెట్రోల్, డీజిల్ దిగుమతులపై భారత్ భారీగా ఖర్చు చేస్తోందని పేర్కొంటూ, ప్రజలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, కార్ పూలింగ్, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచి, అనవసర ప్రయాణాలను తగ్గిస్తే విదేశీ మారక ద్రవ్యం ఆదాఅవుతుందన్నారు.కరోనా సమయంలో విజయవంతంగా అమలైన **»»Work From Home** విధానాన్ని సాధ్యమైనంత వరకు కొనసాగిస్తే ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు."నేను ఒక డాక్టర్‌గా చెబుతున్నాను... భారతదేశంలో అధికంగా వంటనూనె వినియోగం జరుగుతోంది. ఫ్రైడ్ ఫుడ్స్ అధికంగా తినడం వల్ల బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, ఊబకాయం వంటి అనేక వ్యాధులు పెరుగుతున్నాయి. ప్రతి కుటుంబం నెలకు కనీసం ఒక లీటర్ ఆయిల్ వినియోగం తగ్గించినా దేశానికి వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. ప్రజల ఆరోగ్య ఖర్చులు కూడా తగ్గుతాయి" అని డా. బూర నర్సయ్య గౌడ్ గారు పేర్కొన్నారు.సహజ వ్యవసాయం, ఆర్గానిక్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా ఎరువుల దిగుమతులను తగ్గించవచ్చని, భూమి సారాన్ని కాపాడటంతో పాటు రైతులకు దీర్ఘకాల ప్రయోజనం కలుగుతుందని తెలిపారు."స్వదేశీ" ఉత్పత్తులను వినియోగించాలన్న ప్రధాని పిలుపు వెనుక స్పష్టమైన ఆర్థిక దృష్టి ఉందని పేర్కొంటూ, విదేశీ బ్రాండ్లపై ఆధారపడకుండా భారతీయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తే దేశ సంపద దేశంలోనే ఉంటుందన్నారు. చిన్న ఉత్పత్తుల నుంచి లగ్జరీ వాహనాల వరకు స్వదేశీకి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.విదేశీ పర్యటనలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్‌పై భారతీయులు భారీగా ఖర్చు చేస్తున్నారని, మన దేశంలోనే అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నప్పుడు విదేశీ ఖర్చులను కొంతవరకు తగ్గించడం ద్వారా కూడా విదేశీ మారక ద్రవ్యం సేవ్ చేయవచ్చన్నారు.ఈ సప్త సూత్రాలను ప్రజలు కనీసం 25 శాతం స్థాయిలో అయినా అమలు చేస్తే దేశ ట్రేడ్ డెఫిసిట్‌ను గణనీయంగా తగ్గించవచ్చని, రూపాయి విలువ బలపడుతుందని, భారతదేశం మరింత ఆర్థికంగా శక్తివంతమైన దేశంగా ఎదుగుతుందని తెలిపారు.బంగారం పెట్టుబడుల కంటే భూమి, ఉత్పత్తి రంగాలు, మార్కెట్లలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే **Gold ETF\T, Sovereign Gold Bonds** వంటి ప్రత్యామ్నాయాల ద్వారా కూడా పెట్టుబడులు పెట్టవచ్చన్నారు.ప్రధాని మోదీ **Practice What You Preach** అనే విధానాన్ని స్వయంగా ఆచరిస్తున్నారని పేర్కొంటూ, దేశ నాయకులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు ముందుగా ఈ సూత్రాలను పాటిస్తే ప్రజలు కూడా అనుసరిస్తారని తెలిపారు.భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన "యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః" అనే శ్లోకాన్ని ఉదహరిస్తూ, నాయకులు ఏది ఆచరిస్తారో ప్రజలు అదే అనుసరిస్తారని పేర్కొన్నారు. దేశ ప్రయోజనం కోసం అందరూ కలిసి ఈ మార్పులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ అంశాలను రాజకీయ కోణంలో కాకుండా జాతీయ ప్రయోజన దృష్టితో చూడాలని ప్రజలను కోరుతూ, భారతదేశం ఆర్థికంగా మరింత బలోపేతం కావాలంటే ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని డా. బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు.

# బండి భగీరథను అరెస్టు చేయాలి

**సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఎన్ రాజు**



**రంగారెడ్డి జిల్లా మే 14: ( స్కై న్యూస్ )** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ కేంద్రమంత్రి బిజెపి నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ షాద్ నగర్ కమిటీ డిమాండ్ చేసింది ఈ సందర్భంగా వారు ఫరూక్నగర్ తాసిల్దార్ కు వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఎన్ రాజు పట్టణ కార్యదర్శి శ్రీను నాయక్ మాట్లాడుతూ గతంలో అనేక ఘటనలు జరిగిన సందర్భంగా పేదవాళ్లు బడుగు బలహీన వర్గాలకు చెందినటువంటి ప్రజలను ఎన్కౌంటర్లు చేసిన దాఖలాలు ఉన్నాయి అరెస్టు చేసి జై లలోపెట్టిన పరిస్థితుల్లో ఉన్నాయి ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం మంత్రి అయినటువంటి కుమారుడు కాబట్టే తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు పైకి మాత్రం కాంగ్రెస్ బిజెపి ఒకరినొకరు వ్యతిరేకిస్తున్నట్టుగా గొడవలు పడుతున్నట్టుగా సోషల్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా సాక్షిగా మాట్లాడుతారు కానీ ఆచరణకు వచ్చే వరకు మాత్రం దొందు దొందే అన్నట్టుగా వివరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసి క్రిమినల్ కేసు నమోదు చేసి జైల్లో పెట్టాలనివారు డిమాండ్ చేయడం జరిగింది ఈ కేసులో ఉన్న ఆరోపణలు అత్యంత సున్నితమైనవి ముఖ్యంగా మైనర్ బాలికలపై లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, మత్తు పదార్థాలు ఇచ్చి దుర్వినియోగం చేశారనే ఆరోపణలు సమాజాన్ని తీవ్రంగా కలవరపెడుతున్నాయ ఇలాంటి కేసుల్లో చట్టం స్వతంత్రంగా నిష్పక్షపాతంగా వేగవంతంగా పనిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది భారతీయ న్యాయ సంహిత ( బి ఎన్ ఎస్), పోక్సో చట్టం--2012, మహిళలపై నేరాలకు సంబంధించిన చట్టాల ప్రకారం మైనర్ బాలికలపై లైంగిక నేరాలు అత్యంత తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయి అందువల్ల వెంటనే ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం, బాధితుల గోప్యతను కాపాడడం, వైద్య పరీక్షలు నిర్వహించడం, నిందితులను విచారణకు హాజరు పరచడం, అవసరమైతే అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరచడం, వేగవంతమైన దర్యాప్తు జరపడం వంటి చర్యలు చట్టబద్ధమైన విధులు ఈ క్రమంలో అధికారులు ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా విధులు నిర్వర్తించాలి ఒక సాధారణ వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు పోలీసులు వేగంగా స్పందించే పరిస్థితులు మనం చూస్తున్నాం అదే విధంగా ఈ కేసులో కూడా చట్టం అందరికీ సమానంగా అమలవుతుందనే నమ్మకం ప్రజల్లో కలిగేలా ప్రభుత్వం వ్యవహరించాలని వారు పేర్కొన్నారు నిందితుడు అధికార పార్టీకి చెందిన ప్రముఖ నేత కుటుంబ సభ్యుడని కారణంగా విచారణలో ఆలస్యం, నిర్లక్ష్యం లేదా రాజకీయ ప్రభావం ఉండకూడదన్నారు అదేవిధంగా ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీలు మహిళల భద్రత, మైనర్ల రక్షణ న్యాయం వంటి అంశాలపై స్పష్టమైన వైఖరిని ప్రకటించి, న్యాయ ప్రక్రియకు పూర్తి సహకారం అందించాల నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిని రాజకీయంగా కాపాడే ప్రయత్నాలు ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయి ఈ కేసులో పూర్తి స్థాయి, నిష్పక్షపాత, పారదర్శక వేగవంతమైన విచారణ జరిపి నిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలని, జరిగేలా ప్రభుత్వం, పోలీసు అధికారులు చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేసారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కావలి రాజు బేరి శ్రీనివాస్ లక్ష్మి అంజమ్మ సి. రాజు తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీ కేంద్రం ను సందర్శించిన... వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేశ్...



**జోగులాంబ గద్వాల:** కేంద్రంలో ఈరోజు గర్భిణులకు. బాలంతులకు. చిన్నారులకు. పాలు గుడ్లు బాలామృతం అందజేసిన 21వార్డ్ కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ గద్వాల జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నల్లకుంట శివాలయం గుడి నందు. 20. 21. వార్డులకు సంబం ధించిన అంగన్వాడి కేంద్రం నందు. బాలింతలకు గర్భవతులకు చిన్నా రులకు గుడ్లు, బాలామృతం. పా లు. పప్పులు. బియ్యం అందించి నారుకార్యక్రమంలో. అంగన్వాడి టీచర్ శోభ గారు. అంగన్వాడి ఆయా మరియు వార్డు ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు వార్డ్ కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ మాట్లాడుతూ ఇక్కడికి వచ్చిన బాలింతలు గర్భిణులకు పిల్లలకు పౌష్టికాహారము సక్రమముగా ప్రతినెలా అందిస్తూ ప్రతిరోజు బాలింతలకు గర్భిణీలకు పౌష్టికారము ఇవ్వాలి సక్రమంగా తీసుకుంటున్నారా లేదా పర్యవే క్షించాలి గర్భిణులకు ముఖ్యంగా ఇచ్చే పౌష్టికాహారము వాళ్ళు సక్రమంగా తీసుకునేటట్లుగా అంగన్వాడి టీచర్ పర్యవేక్షణలో జరగాలని సూచన ఇస్తూ.. అంగన్వాడి కేంద్రంలో పిల్లలను కూడా సక్రమంగా కేంద్రానికి తీసుకొచ్చి పిల్లలను క్రమశిక్షణలో ఉండేటట్లుగా చూడాలని టీచ ర్కు ఆయకు సూచన ఇవ్వడ

## 15 నుండి బాలసంస్కార్-2026 ప్రారంభం

**సేవా సమితి అధ్యక్షులుకటంగూరి సత్యనారాయణ రెడ్డి**



**హన్మకొండ మే 14 :** శ్రీరామకృష్ణ సేవా మందిరం, కె ఎల్ ఎన్ రెడ్డి కాలనీ, హనుమకొండ యందు "బాలసంస్కార్-2026 వేసవి శిక్షణా శిబిరం" ఈ నెల 15 నుండి పది రోజులు ప్రతి రోజు ఉదయం 6 నుండి 11 గంటలవరకు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షులుకటంగూరి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం నుండి జరుగనున్న "బాల సంస్కార్ 2026" కార్యక్రమంలో ఈ 10 రోజులపాటు ఉదయం గం. 5:40 ల నుండి గం 11:30ల వరకు తమ సమయాన్ని కెటాయించి, స్వచ్ఛంద వాలంటీర్ గా తమ సేవలు అందించాలన్న తపన, అభిలాష కలవారి కొరకు నిన్న (తేది:14.05.2026 శనివారం) సాయంత్రం 5 గంటలకు "వాలంటీర్ల శిక్షణ సమావేశము" మన సేవా మందిరంలో ఏర్పాటు చేయనైనది. అందులో వాలంటీర్లకు వారి బాధ్యతల పంపిణీ మరియు పాటించాల్సిన నియమనిబంధనల గురించి చర్చించి సరైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించు కోవడం జరిగింది. శిక్షణ సమావేశంలో పాల్గొన్న వాలంటీర్లు వేసవి శిబిరంలో పాల్గొనే అర్హత పొందడంతో పాటుగా తమ అమూల్య సేవలతో మూర్తిత్రయ ఆశీస్సులు పొంది 10 రోజుల బాలసంస్కార్-2026 వేసవి శిబిరాన్ని విజయవంతం చేయాలని కటంగూరి సత్యనారాయణ రెడ్డి కోరారు.

# చట్టం అధికారం ఉన్నోడి చుట్టమా? పాలక వర్గాలకో న్యాయం సామాన్య ప్రజలకో న్యాయమా?

**షాద్ నగర్ బీఎస్పీ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ నీరటి రాజు**



**రంగారెడ్డి జిల్లా మే 14: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ షాద్ నగర్ నియోజకవర్గం అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ నీరటి రాజు మీడియాకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ గడ్డ మీద ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది ఈ రాష్ట్రంలో చట్టం తన పని తాను చేయడం లేదు కేవలం అధికారంలో ఉన్నవారికి వారి అండదండలు ఉన్నవారికి మాత్రమే ఊడిగం చేస్తోందన్నారు ఒకే రాష్ట్రం భిన్న న్యాయాలు నడుస్తున్నాయని అనడానికి ఇటీవల జరిగిన సంఘటనలే నిదర్శనం అధికార గర్వంతో చట్టాన్ని నిర్వీర్యం చేసతున్నారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై వంటి కఠినమైన కేసులో ఎఫ్ ఐ ఆర్ నమోదైంది అది సామాన్యమైన కేసు కాదు పిల్లల రక్షణకు సంబంధించిన అత్యంత తీవ్రమైన కేసు కానీ ఏం జరిగింది? రాజ్యాంగం ప్రకారం అందరూ సమానమే అన్న మాట కేవలం పుస్తకాలకే పరిమితమైందా? ఆ మంత్రి కుమారుడికి రాజకీయ పలుకుబడి ఉంది కాబట్టి పోలీసుల లాఠీలు వంగిపోయాయా? ఆయనకు జైలు లేదు అరెస్టు లేదు కనీసం విచారణ చేసే సాహసం కూడా ఈ ప్రభుత్వం(పోలీస్ యంత్రాంగం) చేయడం లేదు అదే ఒక సామాన్యుడి మరీ ముఖ్యంగా ఒక దళితుడి విషయంలో అయితే చిన్న అనుమానం వస్తే చాలు అర్ధరాత్రి ఇళ్ల మీద పడి ఈడ్చుకుపోతారు నేరం రుజువు కాకముందే చిత్రహింసలు పెట్టి జైలు పాలు చేస్తారు దళితులకు వెనుకబడిన వర్గాలకు ఈ రాష్ట్రంలో రక్షణ ఎక్కడ ఉంది? ధనవంతుడికి ఒక న్యాయం పేదవాడికి మరో న్యాయమా ఆధిపత్య కులాలకు ఒక రక్షణ బహుజనులకు లాఠీ దెబ్బలా? అని ఆయన ప్రశ్నించారు బహుజన్ సమాజ్ పార్టీ తరపున మేము సూటిగా ప్రశ్నిస్తున్నాం ఈ రాష్ట్రంలో గద్దెనెక్కిన పాలకులు ఎవరి పక్షాన ఉన్నారు? మీరు రాచరికపు పోకడలను ప్రదర్శిస్తున్నారా? చట్టం ముందు అందరూ సమానమే అన్న బాబాసాహెబ్ అంబేద్కర్ గీసిన గీతను దాటాలని చూస్తే ఈ బహుజన సమాజం చూస్తూ ఊరుకోదు తక్షణమే ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్స్ యాక్ట్ 2012 కేసులో నిందితుడిని అరెస్ట్ చేయాలి అధికార బలంతో కేసులను నీరుగార్చాలని చూస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు సామాన్యుడికి న్యాయం దక్కే వరకు అణగారిన వర్గాల ఆత్మగౌరవం కాపాడడానికి బి.ఎస్.పి. దశల వారి పోరాటం ఆగకుండా చేస్తుందని ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యే సహకారంతో కళాశాల నూతన భవనానికి నిధులు సమకూరుస్తాం

**కళాశాల భూములను పకడ్బందీగా పరిరక్షిస్తాం**

**యూజీసీ భవనాన్ని బాలికల హాస్టల్‌గా మార్చేందుకు కృషి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**



**కొత్తగూడెం మే 14( స్కై న్యూస్):** ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో కళాశాల నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూరుస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. పూర్ణచంద్ర రావు అధ్యక్షతన జరిగిన పూర్వ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ కళాశాల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడటంతో పాటు, ప్రస్తుత భవనాలను విద్యార్థుల అవసరాలకు తగ్గట్టుగా తరగతి గదులుగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. యూజీసీ నిధులతో నిర్మించిన భవనాన్ని బాలికల హాస్టల్‌గా వినియోగించుకునేలా తక్షణమే అనుమతులు పొందాల్సిన అవసరం ఉందని, భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు సందీప్, కార్యదర్శి కాసుల వెంకట్, సి పి ఓ సంజీవరావు, ప్రముఖ న్యాయవాది రబ్, రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ ప్రసన్న కుమార్, డాక్టర్ ఉమామహేశ్వరరావు, రామస్వామి, పాత్రికేయులు నాగాచారి, లోగాని శ్రీనివాస్, తారక రామారావు, రాజేష్, రవి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## అమర్నాథ్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకోవాలి...

**ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు ధ్రువీకరణ పత్రాలు.**

**ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ పి ఉషారాణి.**




**నాగర్ కర్నూల్ మే 14 (స్కైన్యూస్)** జిల్లా నుండి అమర్నాథ్ యాత్రకు వెళు న్న భక్తులు యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకోవాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ టి ఉషారాణి కోరారు గురువారం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో యాత్రకు వెళ్లే భక్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూవారికి పలు ఆరోగ్య సూచనలు చేశారు.అమర్నాథ్, కేదార్నాథ్ , చార్ ధాం వెళ్తున్న భక్తులు వారికి ఆరోగ్య దృవీకరణ పత్రాలు అన్ని పరీక్షలు నిర్వహించి ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోనాదేవి, డాక్టర్ నికిత,సహాయ సంచాలకులు సీజే వసంత్ కుమార్,ఆర్.ఏం.ఓ.డాక్టర్ ప్రశాంత్,నర్సింగ్ సూపర్డెంట్ మంజుల,పద్మ,హెల్ప్ డెస్క్ఇంచార్జ్ టి.యాదగిరి,నర్సింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యతో విజయాల వైపు విద్యార్థులు

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

**షాద్‌నగర్‌లో విట్ జీ డాక్టర్స్ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ శ్రేణుల**





షాద్‌నగర్ పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఎస్‌బీఐ బ్యాంక్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన విట్ జీ డాక్టర్స్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా అకాడమీ యాజమాన్యానికిఆయన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రాంత విద్యార్థులకు ఐఐటీ జెఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు నాణ్యమైన కోచింగ్ స్థానికంగానే అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని అన్నారు ఇలాంటి విద్యాసంస్థలు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు స్థానిక విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆకాంక్షించారు కార్యక్రమంలో విద్యాసంస్థ నిర్వాహకులు, విద్యార్థులు, పట్టణ కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, జయలక్ష్మి కిషోర్, అనిత రఘునాథ్ యాదవ్, గౌస్ జానీ, పిన్నమోని గోపాల్, శివ ఎస్పీ, మాజీ కౌన్సిలర్ వెంకట్రాం రెడ్డి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, రవి యాదవ్, రామకృష్ణ, లంకాల రాఘవేందర్ రెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, గుండు అశోక్, నవీన్, వెంకటేష్, శీలం శ్రీకాంత్, నార్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి

**46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి**

**పాత పాల్వంచ పాఠశాలలో బడిబాటలో పాల్గొన్న విమలాదేవి**





**పాల్వంచ మే 14( స్కై న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం కార్పొరేషన్ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా గురువారం పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు కార్పొరేటర్లను శాలువా, పూలదండలతో సన్మానించారు. ఈ సందర్భంగా విమలాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని, ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ ఆకుల పద్మలత, ఉపాధ్యాయులతో పాటు వార్డు ఆఫీసర్ నరేష్, పాఠశాల ఆదర్శ అమ్మదీవెన కమిటీ చైర్మన్ జి. అదిలక్ష్మి, గ్రామస్తులు మసనం శరత్, బూసి శ్రీను, యాటానాని, బండారు తేజ , జి. తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



**నారాయణపేట మే 14( స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద రూ.55 కోట్ల నిధులతో కొనసాగుతున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పరిశీలించారు. ఇప్పటి దాకా జరిగిన నిర్మాణ పనుల గురించి ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీలింగ్, ఎలక్ట్రికల్ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆమె సూచించారు. భవన సముదాయ నిర్మాణ పనులతో పాటు బయట రోడ్లు, ఇతర పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. జూన్ వరకు పనులు పూర్తయ్యేలా చూడాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈ.ఈ. వెంకటరమణ, డీ.ఈ. రాములు, ఏ ఈ లు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం : దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్



దేవరకద్ర మదనపురం మే 14 (స్కై న్యూస్); మదనపురం మండలం తిరుమలయ్య పల్లి గ్రామంలో గురువారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి హాజరై విగ్రహవిష్కరణ చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహవిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా ఇస్తున్నాను అన్నారు.అన్ని వర్గాలకు సమ హక్కులను కల్పిస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని, అంబేద్కర్ స్ఫూర్తి తో కాంగ్రెస్ పార్టీ ముందుకు పోతుందని అన్నారు.అంబేద్కర్ ఆశయ సాధన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అందరం అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ తో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**రంగారెడ్డి జిల్లా మే 14: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించిన వివాహాది శుభకార్యాలలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు, పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## స్వయం కృషితో ఎదగాలి

**ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి**

**చేగుర్ లో ఆర్ఎస్ రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా మే 14: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని చేగూర్ లో ప్రోపరేటర్ భగవాన్ దాస్ ఏర్పాటు చేసిన ఆర్ఎస్ రెస్టారెంట్ ను ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి హాజరై ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితమంటేనే ఎన్నో ఆటుపోట్లు అన్నిటినీ తట్టుకొని ముందుకు వెళితేనే జీవనం సాగించగలుగుతామని ఎమ్మెల్సీ నాగరి కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు కస్టమర్లకు మంచి ఆహారాన్ని అందిస్తే వ్యాపారంలో రాణించవచ్చని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో చేగుర్ మాజీ పిఏసిఎస్ చైర్మన్ మామిళ్ళ విట్టల్, స్థానిక నాయకులు, గుండాల శ్రీను, బండ శ్రీనివాస్,శేఖర్ గౌడ్, గోషి రవి, పబ్బే శేఖర్, జంగయ్య, గోషి రవి, వడ్ల శేఖర్, జగన్, రాజు, మల్లేష్, శ్రీకాంత్, సిద్దు, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

**నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**

**పాల్వంచలో రేపు మెగా జాబ్ మేళా 120 ఉద్యోగ ఖాళీల భర్తీకి కసరత్తు**



**భద్రాద్రి కొత్తగూడెం మే 14 ( స్కై న్యూస్):** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన (శనివారం) పాల్వంచలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పాల్వంచ పట్టణంలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో శనివారం ఉదయం 10 గంటల నుండి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది.ప్రముఖ కంపెనీల్లో కొలువులు:ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయి.?అపోలో ఫార్మసీ: హైదరాబాద్‌లోని సంస్థలో 100 ఫార్మసిస్ట్, అసిస్టెంట్ అప్రెంటిస్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అర్హతను బట్టి నెలకు రూ. 12,500 నుండి రూ. 25,000 వరకు జీతం ఉంటుంది. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగూడెం బ్రాంచ్ కోసం 20 బిజినెస్ డెవలప్‌మెంట్ యూనిట్ మేనేజర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీరికి రూ. 17,500 నుండి రూ. 30,000 వరకు వేతనంతో పాటు ఇతర అలవెన్సులు ఉంటాయి.అర్హతలు 19 నుండి 34 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, ఎస్ఎస్‌సి నుండి డిగ్రీ, బి.టెక్, ఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు తమ వెంట విద్యార్హతలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలి. జిల్లాలోని అన్ని మండలాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు కోరారు.?మరిన్ని వివరాలకు 7207917714 (అపోలో) లేదా 9866774459 (శ్రీరామ్ ఇన్సూరెన్స్) నంబర్లను సంప్రదించవచ్చునీ జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ అన్నారు

# షాద్ నగర్ లో విట్జీ డాక్టర్స్ అకాడమీ, కళాశాలను ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్ లో తొలిసారిగా ఐఐటి జేఈఈ, నీట్, సీఏలలో శిక్షణ**

**హాజరైన తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ బాలకృష్ణ రెడ్డి**





**రంగారెడ్డి జిల్లా మే 14: ( స్కై న్యూస్ )** విద్యార్థులలో విజ్ఞానాన్ని వెలికి తీసి అద్భుతాలు సృష్టించండి షాద్ నగర్ నియోజకవర్గం నుంచి ర్యాంకుల పంట పండించండి అప్పుడు మిమ్మల్ని ఎవరూ ఆపలేరు విద్యార్థుల భవిష్యత్తు నిర్మించడం పైనే మీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు షాద్ నగర్ పట్టణంలోని పాత జాతీయ రహదారిపై యమ్మీ బేకరి వెనుక భాగంలో విట్జీ డాక్టర్స్ అకాడమీ ఆధ్వర్యంలో బ్రిడ్జి జూనియర్ కళాశాల సీనియర్ జర్నలిస్టు మారం శ్రీనివాస్, ఇతర డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు ఈ కళాశాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు షాద్ నగర పరిధిలో మొదటిసారిగా ఐఐటీ జేఈఈ, నీట్, సి ఎ లలో శిక్షణ ఇస్తూ ముందుకు తీసుకు వస్తున్న ఈ కళాశాల ప్రారంభోత్సవానికి మంత్రి శ్రీధర్ బాబు రావాల్సి ఉండగా అనివార్య కారణాలవల్ల ఆయన కార్యక్రమం రద్దయింది ఈ క్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కళాశాలను ప్రారంభించారు అదేవిధంగా కళాశాలలో జేఈఈ, నీట్, సీఏలకు సంబంధించిన గదులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వహకులు ఆయనతోపాటు మున్సిపాలిటీ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందెమోహన్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కౌన్సిలర్ పెంటయ్య, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్ తదితరులను సత్కరించారు

**అక్షరంతోనే అభ్యుదయం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

ఆధునిక యుగంలో విద్యను మించింది ఏది లేదని అక్షరంతోనే అభ్యుదయాన్ని సాధించవచ్చు అని, అద్భుతాలు సృష్టించవచ్చు అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వీట్జీ కళాశాల ప్రారంభోత్సవం అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యలో మార్పులకు శ్రీకారం చుడుతూ అత్యాధునిక సదుపాయాలతో రాజధాని తరహాలో వివిధ ఉన్నత కోర్సులలో శిక్షణను ఇచ్చేలా కళాశాలను తీర్చిదిద్దడం సంతోషకరమని అన్నారు విద్యా రంగంలో ఎక్కువ శాతం నారాయణ, చైతన్య లాంటి పేర్లు వినిపిస్తాయని, అలాంటిది స్థానికంగా కూడా విజ్ఞానవంతులైన అధ్యాపకులు ఎలాంటి కళాశాలలు ఏర్పాటు చేసి వాటికి దీటుగా ముందుకు నడిపించడం అభినందనీయమని అన్నారు ఈ ప్రాంతంలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది వారి భవిష్యత్తును నిర్మించే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు ప్రపంచంలో విద్యను సాధిస్తే ఏమైనా సాధించవచ్చని నిరూపించిన అబ్దుల్ కలాం లాంటి వ్యక్తులను విద్యార్థులకు ఆదర్శంగా చూపాలని అన్నారు. కళాశాల నిర్మాణం, సదుపాయాలు బాగున్నాయని, ఫీజులు కూడా అందుబాటులో ఉన్నాయని ప్రశంసించారు అధ్యాపకులు కష్టపడి ఒక్కసారి మంచి ఫలితాలను సాధించగలిగితే ఆ పేరు ఎప్పటికీ చిరస్థాయిగా ఉండిపోతుందని అన్నారు మంచి ఆలోచనతో ఒక సంకల్పంతో ముందుకు వచ్చిన అధ్యాపకులు మంచి ఫలితాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు విద్యారంగానికి సహకారం అందించేటందుకు తాను ఎప్పుడు ముందుంటానని, ఇక్కడ కూడా నిర్వాహకులకు ఇలాంటి సహకారం అవసరమైన తన నుంచి లభిస్తుందని స్పష్టం చేశారు పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు బంగారాలు అమ్మడానికి కూడా వెనకాడరని, అలాంటి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాల్సిన బాధ్యత అధ్యాపకుల పై ఉందని స్పష్టం చేశారు. అద్భుతమైన ఫలితాలతో షాద్ నగర్ కు గుర్తింపు తీసుకురావాలని కోరారు ఐఐటి, నీట్ వంటి వాటిలో శిక్షణ పొందేందుకు షాద్ నగర్ వాసులు, ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులు ఎంతో దూరంలో ఉన్న హైదరాబాదుకు వెళ్లాల్సి వస్తుందని, అక్కడ హాస్టల్లో భోజనాలు పడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కళాశాల డైరెక్టర్, సీనియర్ జర్నలిస్టు మారం శ్రీనివాస్ అన్నారు అలాంటి విద్యార్థుల అవస్థలు గుర్తించి వారి కోసమే ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు బయట మూడు నుంచి నాలుగు లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఇక్కడ మాత్రం కేవలం 1,30 వేలకే మెటీరియల్ తో సహా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు మంచి ఫలితాలను అందించి షాద్ నగర్ వాసులలో కళాశాల పట్ల నమ్మకం కలిగిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే 150 అడ్మిషన్లు పూర్తి చేశామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, రాయికల్ శ్రీనివాస్, చంద్రశేఖర్, నల్లమోని శ్రీధర్, చిట్టెం దామోదర్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, ఎర్రోళ్ల అశోక్, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, ర్యాకల శ్రీను, కళాశాల డైరెక్టర్లు అధ్యాపకులు మారం చందు, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు కళాశాల యజమాన్య సభ్యులు మారం శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్, దేవేందర్ రెడ్డి , మారం చందు, శ్రీశైలం , యోగేందర్ , ఆంజనేయులు, అహ్మద్ పాషా, నవనీత తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి కృపతో ప్రజలందరు ఆయురారోగ్యాలతో జీవించాలి

**ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి**

**లింగందాన గ్రామంలో పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ**

**పూజా కార్యక్రమంలో పాల్గొన నవీన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా మే 14: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం లింగందాన గ్రామం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని, భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్,లింగం దాన సర్పంచ్ నాగిలా వెంకటేష్ ఉపసర్పంచ్ లావణ్య తిరుపతి రెడ్డ, పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, పోల్గంగుట్ట సర్పంచ్ భాస్కర్ నాయక్, లేమామిడి సర్పంచ్ సులోచన శ్రీనివాస్,సుందరపూర్ సర్పంచ్ భారతి రవి నాయక్, మహాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి,మాజీ సర్పంచులు శేఖర్ పంతులు,యారం శేఖర్ రెడ్డి, కృష్ణయ్య, సీనియర్ నాయకులు గోగు వెంకట్ నారాయణ్ రెడ్డి,మాజీ ఎంపిటిసి రాంచందర్, ఉపసర్పంచులు యారం రామ్ రెడ్డి,ప్రమోద్ రెడ్డి, మాజీ ఉపసర్పంచులు మన్మథ రెడ్డి, రామ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భైర్కాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్, నాగ రాజు, పల్లాటి క్రిష్ణ, శేరి శ్రీనివాస్ రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మనిషిగా ఎండి ముస్తఫాకు పెరుగుతున్న ఆదరణ

**ఆనాడు కేసీఆర్ అడుగుజాడల్లో ఉద్యమ రాజకీయాలకు అంకితమైన నాయకుడు**

**నేడు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమ నాయకుడు**



**రంగారెడ్డి జిల్లా మే 14: ( స్కై న్యూస్ )** ప్రజల కష్టాల్లో ముందుండే నాయకుడే నిజమైన నాయకుడు అనే నానుడికి నిదర్శనంగా తెలంగాణ రక్షణ సేన తెలంగాణ రాష్ట్ర ముస్లిం మైనార్టీ నాయకుడు, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి ముస్తఫా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు గతంలో తెలంగాణ రాష్ట్ర సమితిలో కేసీఆర్ అడుగుజాడల్లో కీలకంగా పనిచేసిన ఆయన, నేడు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వివిధ ఉద్యమాల్లో పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందిన ఎండి ముస్తఫా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, రంగారెడ్డి జిల్లా, షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో గ్రామ గ్రామాన ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు బడుగు బలహీన వర్గాలు, ముస్లిం మైనార్టీ ప్రజల అభ్యున్నతికి కట్టుబడి అందరితో కలిసిమెలిసి ప్రజాసేవలో ముందుకు సాగుతున్నారని స్థానిక నాయకులు కొనియాడుతున్నారు సామాన్య ప్రజలకు అండగా నిలుస్తూ యువతకు మార్గదర్శకంగా వ్యవహరిస్తున్న ఎండి ముస్తఫాకు రాబోయే రోజుల్లో మరింత మంచి గుర్తింపు, ఉన్నత పదవులు రావాలని షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## ప్రైవేటు పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలు ముద్దు

**ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే గ్రామ భవిష్యత్తుకు బలమైన పునాది.**

**ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించిన సర్పంచ్ తెలుగు శివకుమార్.**



**చిన్న చింతకుంట మే 14 (స్కై న్యూస్);** చిన్నచింతకుంట మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, యుపిఎస్, ప్రాథమిక పాఠశాలలు ఆయా గ్రామాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఫరీద్‌పూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ తెలుగు శివకుమార్ ఎం పి,యు.పి.ఎస్ ఫరీద్‌పూర్ పాఠశాలలో నిర్వహించిన ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉప సర్పంచ్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూఅడ్మిషన్లు ప్రారంభమయ్యాయి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్య, పుస్తకాలు 2 జతల యూనిఫామ్స్‌సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, వారానికి 3 గుడ్లు, రాగి జావ, ఉచిత ఆరోగ్య పరీక్షలు ఏ ఐ ఆధారిత బోధనతో ఆధునిక విద్యా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన బోధన 1 నుండి 3 తరగతులు ఇంగ్లీష్ మీడియం, 4 నుండి 8 తరగతులు తెలుగు మీడియం బోధిస్తారు అన్నారు.

ప్రైవేట్ పాఠశాలలు వద్దు -- ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరటి నరసింహ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేపాల్, వెంకట్ రెడ్డి , గ్రామ పెద్దలు, మహిళలు గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యార్థుల సామర్థ్యాన్ని, నైపుణ్యాలను పెంచుకోవడానికి విట్ జీ అకాడమీ సరైన వేదిక

**ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

**విట్ జీ అకాడమీ, జూనియర్ కాలేజ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రజా ప్రతినిధులు**




**రంగారెడ్డి జిల్లా మే 14: ( స్కై న్యూస్ )** విద్యార్థుల పూర్తి సామర్థ్యాన్ని గుర్తించి వారిలోని ప్రతిభను వెలికితీసి నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకునేందుకు విస్తృత అవకాశాలు కల్పించడానికి షాద్ నగర్ పట్టణంలోని మహబూబ్ నగర్ రోడ్ లో ఏర్పాటుచేసిన విట్ జీ అకాడమీ జూనియర్ కాలేజ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరాలంటే సరైన శిక్షణ అవసరమని అలాంటి శిక్షణ ఇవ్వడానికి ఏర్పాటు చేసిన యాజమాన్యానికి మరొకసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అకాడమీ యాజమాన్యం, షాద్ నగర్ పట్టణ కౌన్సిలర్లు బిఎస్ సుధీర్,గౌస్ జానీ,అనిత రఘునాథ్ యాదవ్, రిపోర్టర్ చందు, మాజీ జెడ్పీటిసి తనయుడు రామక్రిష్ణ, మహాదేవపూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి,మాజీ సర్పంచులు బీఆర్ఎస్ నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, గోపాల్ నాయక్, శేరి శ్రీనివాస్ రెడ్డి,దినేష్ సాగర్,అల్లాడ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ సూపర్ ఫుడ్స్ కోసం వెదకాల్సిన పనిలేదు.. వంటింట్లోనే ఉన్నాయి..



విదేశీ సూపర్‌ఫుడ్స్ కోసం వెతకాల్సిన అవసరం లేకుండానే భారతీయ వంటగదిలోనే ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పదార్థాలు దాగి ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. రోజూ వాడే కొన్ని సాధారణ మసాలా దినుసులు కూడా బెర్రీల వంటి సూపర్‌ఫుడ్స్‌కు సమానమైన యాంటీఆక్సిడెంట్ శక్తిని అందించగలవని తాజా సూచనలు వెల్లడిస్తున్నాయి. బెర్రీలు, నట్స్, ఆలివ్ ఆయిల్, ఆకుకూరలు వంటి సూపర్‌ఫుడ్స్ ఆరోగ్యానికి మంచి వని ఫిట్‌నెస్ నిపుణులు తరచూ సూచిస్తుంటారు. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉండి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం వంటి ప్రయోజనాలు కలిగిస్తాయి.

**అర టీస్పూన్ మోతాదులో చాలు..**

అయితే ఇంట్లోనే ఉండే జీలకర్ర, దాల్చిన చెక్క, లవంగం వంటి మసాలాలు కూడా శరీరానికి సమానంగా మేలు చేస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. సరైన మసాలాలను కేవలం అర టీస్పూన్ మోతాదులో తీసుకున్నా ఒక బౌల్ బెర్రీలకు సమానమైన యాంటీఆక్సిడెంట్ శక్తిని పొందవచ్చని చెబుతున్నారు. ఈ ప్రత్యేక మిశ్రమంలో అర టీస్పూన్ జీలకర్ర, అర టీస్పూన్ దాల్చిన చెక్క పొడి, ఒక చిటికెడు లవంగం పొడి ఉంటాయి. ఈ కలయిక జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా శరీర మెటబాలిజాన్ని కూడా బలోపేతం చేస్తుందని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు.

**దాల్చిన చెక్క, జీలకర్ర..**

దాల్చిన చెక్క రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని పలు పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచి మధుమేహం ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. జీలకర్ర జీర్ణ ఎంజైమ్‌ల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అలాగే పొట్ట ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలను తగ్గించడంలోనూ ఇది ఉపయోగకరంగా ఉంటుంది. లవంగంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. దీనికి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీమైక్రోబియల్ గుణాలు ఉండటంతో శరీరాన్ని ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. ఇక ఈ మసాలా మిశ్రమాన్ని గోరువెచ్చని నీటిలో కలిపి తాగవచ్చు. అలాగే భోజనం మీద చల్లి తీసుకోవచ్చు లేదా రోజువారీ ఆహారంలో భాగంగా చేర్చుకోవచ్చు. ఈ మిశ్రమం పరిమాణంలో చిన్నదైనా శరీర కణాల స్థాయిలో పనిచేసి మెటబాలిక్ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఒకేసారి ఎక్కువగా తీసుకోవడం కంటే ప్రతిరోజూ క్రమం తప్పకుండా తీసుకోవడమే ముఖ్యమని సూచిస్తున్నారు. సరైన ఆహార ఎంపికలు ఆరోగ్యంపై గొప్ప ప్రభావాన్ని చూపుతాయని, ఆరోగ్య సంరక్షణ ఎప్పుడూ క్లిష్టంగా ఉండాల్సిన అవసరం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.



# వైవిధ్యం ఉండాల్సిందే!

బరువు తగ్గాలనో, ఆరోగ్యం కోసమో.. కొందరు స్ట్రిక్ట్ డైట్ పాటిస్తుంటారు. రోజూ ఒకే రకమైన ఆహారం తీసుకుంటారు. అయితే, ఈ అలవాటు పేగుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆహారంలో వైవిధ్యం ఉన్నప్పుడే.. గట్ హెల్త్ బాగుంటుందని చెబుతున్నారు. పేగుల్లో కొన్ని వందల రకాల మంచి బ్యాక్టీరియాలు ఉంటాయి. మనం తినే రకరకాల ఆహార పదార్థాలతోనే అవి శక్తిని పొందుతాయి. అయితే, ఒకే రకమైన ఆహారం తిన్నప్పుడు.. కేవలం కొన్ని రకాల బ్యాక్టీరియాకు మాత్రమే పోషణ అందుతుంది. మిగిలిన మంచి బ్యాక్టీరియాలు క్రమంగా అంతరించిపోతాయి. అలా, పేగుల్లో బ్యాక్టీరియా వైవిధ్యం తగ్గితే.. జీర్ణక్రియ మందగించడం, రోగనిరోధక శక్తి బలహీనపడటం లాంటి సమస్యలు వస్తాయి. ఇక ఎంత ఆరోగ్యకరమైన ఆహారమైనా సరే.. అందులో అన్నిరకాల విటమిన్లు, ఖనిజాలు ఉండవు. దాంతో, పోషకాహార లోపం ఏర్పడుతుంది. అంతేకాకుండా, శరీరం ఒకే రకమైన ఆహారానికి అలవాటు పడిపోతే.. కొన్నిరోజులకు కొత్తరకం ఆహారాన్ని జీర్ణం చేసుకునే సామర్థ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. దీనివల్ల ఎప్పుడైనా బయట, ఏదైనా కొత్తగా తిన్నప్పుడు కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు వస్తాయి. ఇలా కాకుండా ఉండాలంటే.. 'రెయిన్‌బో ప్లేట్'ను ఫాలో అవ్వాలి. భోజనంలో వివిధ రంగుల కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. వారానికి కనీసం 30 రకాల మొక్కల ఆధారిత ఆహార పదార్థాలను తీసుకోవాలట. అప్పుడే గట్ హెల్త్ బాగుంటుందని చెబుతున్నారు. ఇక ఆహారంలో పెరుగు, మజ్జిగ లాంటి ప్రో బయోటిక్ పదార్థాలను చేర్చుకుంటే.. మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. పేగుల ఆరోగ్యానికి భరోసా లభిస్తుంది.

# నిద్రపుచ్చే గసగసాలు



నేటి కుర్రకారు హెల్తీఫుడ్ అంటూ.. మన వంటింట్లో ఉండే అద్భుతమైన సహజ పదార్థాలను పట్టించుకోకుండా ఖరీదైన సప్లిమెంట్ల వైపు పరుగులు తీస్తున్నారు. వంటింట్లో ఉన్న ఒక్కో దినుసు.. నాలుగైదుకు తక్కువ కాకుండా ప్రయోజనాలను అందిస్తుంది. గసగసాలు ఆ కోవకే చెందుతాయి. శరీరానికి తక్షణ శక్తిని అందించి, నీరసాన్ని తరిమికొట్టడంలో ఇవి దోహదపడతాయి. గసగసాలు రుచి కోసం ఉపయోగించే దినుసులు మాత్రమే కావు.. అవి ఒక అద్భుతమైన ఔషధాల గనులు. వీటిలో క్యాల్షియం అధిక మోతాదులో ఉంటుంది. నేటి ఆధునిక జీవన శైలిలో సరిగా నిద్రపట్టని వారికి, నీరసం, కీళ్ల నొప్పులతో బాధపడే వారికి గసగసాలు సంజీవనిలా పనిచేస్తాయని రీసెర్చ్ గేట్ అధ్యయనం పేర్కొంది. గసగసాల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఒత్తిడిని తగ్గించి నిద్రకు కారణమయ్యే హార్మోన్ల స్థాయిని క్రమబద్ధీకరించడంలో సాయపడుతుంది. రాత్రి పడుకునే గంట ముందు వేడి పాలల్లో కొద్దిగా గసగసాల పొడి లేదా నానబెట్టిన గసగసాల పేస్ట్ కలుపుకొని తాగితే గాఢ నిద్ర పడుతుంది.

గసగసాల్లో ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి. అలాగే ప్రొటీన్, ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరిచి రోజంతా ఉత్సాహంగా ఉండటానికి తోడ్పడతాయి.

మన శరీరానికి అందాల్సిన క్యాల్షియం, ఫాస్పరస్‌లో సింహభాగం ఒక్క టేబుల్ స్పూన్ గసగసాల ద్వారా పొందొచ్చు. ఇవి ఎముకలను దృఢంగా మారుస్తాయి. వయసు పెరిగే కొద్దీ వచ్చే ఆస్టియో పొరోసిస్ సమస్యలను నివారించడంలో గసగసాలు కీలక పాత్ర పోషిస్తాయి.

నోటిపూతను తగ్గించడంలోనూ గసగసాలు కీలకంగా పనిచేస్తాయి. వీటిలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ పెయిన్ గుణాలు అల్సర్లను తగ్గించడంలో దోహదపడతాయి. గసగసాలను బాగా నానబెట్టి ఆ నీటిని తాగడం లేదా పేస్ట్‌లా చేసి పాలలో కలుపుకొని తాగడం వల్ల శరీరంలో వేడి తగ్గి నోటి పూత త్వరగా తగ్గుతుంది.



# తేనెలో అసలు ఎన్ని రకాలు ఉన్నాయో.. ఏది ఎలాంటి రుచిని అందిస్తుందో తెలుసా..?

తేనె బంగారు రంగు, మధురమైన వాసన, సహజ గుణాలతో ప్రసిద్ధి చెందిన ఆహార పదార్థం. శతాబ్దాలుగా ఇది ఆహారంగానే కాకుండా సంప్రదాయ వైద్యంలో కూడా ఉపయోగంలో ఉంది. పూల నుంచి తేనెటీగలు సేకరించే మకరందం ఆధారంగా తేనె రుచి, రంగు, గాఢత్వం మారుతూ ఉంటాయి. అందుకే అన్ని తేనెలు ఒకేలా ఉండవు. కొన్ని తేనెలు తేలికపాటి రుచితో ఉంటే, మరికొన్ని బలమైన గాఢమైన రుచిని కలిగి ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన కొన్ని ముఖ్యమైన తేనె రకాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు. తేనెటీగలు ఏ పూల నుంచి మకరందాన్ని సేకరిస్తాయో దానిపైనే తేనె ప్రత్యేకత ఆధారపడి ఉంటుంది. ఒకే రకం పూల నుంచి సేకరించిన మకరందంతో తయారైనది మోనోఫ్లోరల్ హనీగా పిలుస్తారు. వివిధ పూల నుంచి సేకరించిన మకరందంతో తయారయ్యేది వైల్డ్ ఫ్లవర్ లేదా మల్టీఫ్లోరల్ హనీగా ఉంటుంది.

**ప్రభావితం చేసే పలు అంశాలు..**

వాతావరణం, నేల స్వభావం, ప్రాసెసింగ్ విధానం కూడా తేనె రుచిని ప్రభావితం చేస్తాయి. అకేసియా తేనె చాలా లేత రంగులో ఉండి స్వల్ప పూల వాసనతో మృదువైన తీపి రుచిని కలిగి ఉంటుంది. అధిక ఫ్రక్టోజ్ ఉండటం వల్ల ఇది చాలా కాలం ద్రవరూపంలోనే ఉంటుంది. టీ, పెరుగు, పండ్లపై చల్లుకోవడానికి లేదా సలాడ్ డ్రెస్సింగ్‌లలో ఉపయోగించడానికి ఇది అనుకూలంగా ఉంటుంది. అలాగే న్యూజిలాండ్‌లో పెరిగే మనూకా మొక్క మకరందం నుంచి మనూకా తేనె తయారవుతుంది. దీనికి గాఢమైన, కొంచెం చేదు కలిగిన ప్రత్యేక రుచి ఉంటుంది. యాంటీ బ్యాక్టీరియల్ గుణాల కారణంగా ఆరోగ్యపరంగా కూడా దీనికి మంచి పేరు ఉంది. వేడి పానీయాలు, మారినేడ్స్ లేదా నేరుగా తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

**క్లోవర్ తేనె వినియోగం ఎక్కువ..**

వైల్డ్ ఫ్లవర్ తేనె వివిధ రకాల పూల నుంచి సేకరించిన మకరందంతో తయారవుతుంది. ఈ తేనె రుచి, రంగు కాలానుసారం మారుతూ ఉంటుంది. కొన్ని తేనెలు తేలికపాటి రుచిని కలిగి ఉండగా, మరికొన్ని గాఢమైన రుచిని ఇస్తాయి. వంటలు, బేకింగ్, బ్రెడ్‌పై రాయడానికి దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు. అదే విధంగా ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఎక్కువగా వినియోగించే తేనెల్లో క్లోవర్ తేనె ఒకటి. లేత బంగారు రంగు, మృదువైన తీపి రుచి దీనికి ప్రత్యేకత. టీ, టోస్ట్, సీరియల్స్, బేకరీ పదార్థాల్లో దీన్ని సాధారణంగా ఉపయోగిస్తారు. బక్‌వీట్ తేనె గాఢమైన రంగు, మందమైన గాఢత్వంతో ఉంటుంది. మొలాసిస్ తరహా రుచి, స్వల్ప పొగ వాసన కలిగి ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఈ తేనెను బలమైన రుచులను ఇష్టపడేవారు ఎక్కువగా తీసుకుంటారు. జింజర్ బ్రెడ్, స్పైసీ కేక్స్ వంటి బేకింగ్ వంటల్లో ఇది బాగా సరిపోతుంది.

**పేస్ట్రీలు, కేకులకు అయితే..**

యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రసిద్ధి చెందిన హీతర్ తేనె గాఢ అంబర్ రంగులో ఉండి జెల్లీ తరహా టెక్స్చర్ కలిగి ఉంటుంది. పూల వాసనతోపాటు చెక్క వాసన కలిసిన ప్రత్యేక రుచి ఉంటుంది. చీజ్, రోస్ట్ చేసిన మాంసాహార వంటకాలు, క్రంపెట్స్‌తో ఇది బాగా సరిపోతుంది. సిట్రస్ పూల మకరందం నుంచి తయారయ్యే ఆరెంజ్ బ్లాసమ్ తేనెకు సున్నితమైన నారింజ వాసన ఉంటుంది. డెజర్ట్స్, హెర్బల్ టీలు, సలాడ్ డ్రెస్సింగ్‌లలో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. పేస్ట్రీలు, కేకులకు కూడా ఇది మంచి కాంబినేషన్‌గా ఉంటుంది. ఇక ముడి తేనెని ఎక్కువగా వేడి చేయకుండా సహజ రూపంలోనే ఉంచుతారు. అందువల్ల ఇందులో సహజ ఎంజైమ్స్, పుప్పొడి గుణాలు ఎక్కువగా ఉంటాయి. సెట్ హనీ లేదా క్రీమ్డ్ హనీ మాత్రం మృదువుగా, సులభంగా రాయడానికి అనుకూలంగా ఉండేలా క్రిస్టలైజ్ చేస్తారు. టోస్ట్, బేకింగ్ వంటకాల్లో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. తేనె కొనుగోలు చేసే సమయంలో దాని మూలం, స్వచ్ఛత, ప్రాసెసింగ్ విధానం తెలుసుకోవడం మంచిది. సహజ తేనె రుచి మాత్రమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. తదుపరి తేనె జార్ తీసుకునేటప్పుడు దాని ప్రత్యేకతను గమనిస్తే మీకు కొత్త రుచులు కూడా పరిచయం అవుతాయి.

## బిజినెస్

### వారానికి ఐదు రోజుల పని!.. పొదుపు చర్యల్లో భాగంగా మాకు కల్పించండి: బ్యాంకింగ్ సంఘాలు




**న్యూఢిల్లీ :** బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు మరోసారి ఐదు రోజుల పనిని మళ్లీ తెరపైకి తీసుకొచ్చారు. గత కొన్నేండ్లుగా డిమాండ్ చేస్తున్న వారానికి ఐదు రోజుల పనిని కల్పించాలని ఉద్యోగ సంఘాలు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పొదుపు చర్యల్లో భాగంగా ఇంధన పరిరక్షణ చర్యలకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని పేర్కొంటూ.. ఐదు రోజుల పనిదినాలను ప్రవేశపెట్టాలని ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్ల కాన్ఫెడరేషన్(ఏఐబీవోసీ) ప్రభుత్వానికి రాసిన లేఖలో పేర్కొంది. బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజుల పని విధానాన్ని తక్షణమే అమలు చేయడం అత్యవసరం... ఈ డిమాండ్ కేవలం ఒక సేవా నిబంధనలకు సంబంధించిన అంశం మాత్రమే కాదు..ఇది ఇంధన పరిరక్షణ, శక్తి ఆదా, పర్యావరణ పరిరక్షణ, కార్యాచరణ సామర్థ్యం, ప్రజా సౌకర్యం వంటి లక్ష్యాలను నేరుగా ముందుకు తీసుకువెళ్లే ఒక ఆచరణాత్మక అమలు చేయదగిన అంశమని పేర్కొంది. శాఖ కార్యకలాపాలు, నగదు నిర్వహణ, కస్టమర్ సేవలు, నిబంధనల పాటింపు, వసూళ్లు, క్షేత్రస్థాయి ఆర్థిక సమ్మిళితం, ప్రభుత్వ పథకాల అమలుకు అధికారులు, ఉద్యోగుల అవసరమని తెలిపారు. ఐదు రోజుల పనిభారంతో లక్షలాది మంది బ్యాంకింగ్ ఉద్యోగుల ప్రయాణ భారాన్ని తగ్గించనున్నదని వెల్లడించింది. దీంతో పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గిపోనుండటంతోపాటు ట్రాఫిక్, విద్యుత్ వినిమయం మరింత తగ్గనున్నదని, వీటితోపాటు మౌలిక నిర్వహణ సదుపాయాల కోసం పెట్టే ఖర్చు తగ్గనున్నదని తెలిపింది.

### కోలుకున్న మార్కెట్లు

**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా నాలుగు రోజులుగా నష్టాల్లో కదలాడిన సూచీలకు మెటల్, ఎనర్జీ, వినిమయ స్టాక్స్‌లకు కొనుగోళ్ల మద్దతుతో సూచీలు తిరిగి కోలుకున్నాయి.



రూపాయి రికార్డు స్థాయిలో పతనం చెందడం, విదేశీ పెట్టుబడులు తరలిపోయినప్పటికీ తీవ్ర హెచ్చుతగ్గుదల మధ్య కొనసాగిన సూచీలు చివకు లాభాల్లోకి వచ్చాయి. వెయ్యి పాయింట్లకు పైగా కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 49.74 పాయింట్లు అందుకొని 74,608.98 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 33.05 పాయింట్లు ఎగబాకి 23,412.60 వద్ద నిలిచింది.

# బంగారం, వెండిపై 15% సుంకం..

**దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని భారీగా పెంచిన కేంద్రం**

**దేశీయ రిటైల్ మార్కెట్‌లో భగ్గుమన్న ధరలు**

**వ్యాపారుల్లో ఆందోళన.. పెరుగనున్న స్మగ్లింగ్ ముప్పు**




**న్యూఢిల్లీ :** బంగారం, వెండి దిగుమతులపై బుధవారం కేంద్ర ప్రభుత్వం భారీగా సుంకం, సెస్సులను పెంచింది. ఏకంగా 6 శాతం నుంచి 15 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని కూడా ప్రకటించింది. పొదుపు మంత్రంలో భాగంగా కనీసం ఏడాదిపాటు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలంటూ దేశ ప్రజలకు హైదరాబాద్‌లో జరిగిన సభ నుంచి పిలుపునిచ్చిన ప్రధాని మోదీ.. ఢిల్లీకి వెళ్లగానే అందుకు ప్రభుత్వం తరఫున ఏం చేయాలో అది చేసేశారు. ఇప్పటిదాకా విదేశాల నుంచి దేశంలోకి దిగుమతైన బంగారం, వెండిపై 6 శాతం (కనీస కస్టమ్స్ సుంకం 5 శాతం, వ్యవసాయ మౌలికాభివృద్ధి సెస్సు 1 శాతం) సుంకం పడింది. ఇకపై 15 శాతం (కనీస కస్టమ్స్ సుంకం 10 శాతం, వ్యవసాయ మౌలికాభివృద్ధి సెస్సు 5 శాతం) పడుతుంది. దీనికి అదనంగా దిగుమతిదారులు 3 శాతం ఐజీఎస్టీని చెల్లించాల్సి ఉంటుంది. ఇలా మొత్తంగా సుంకం, సెస్సు, పన్నుల భారం 18.45 శాతానికి చేరిందిప్పుడు. మునుపు ఇది 9.18 శాతంగానే ఉండటం గమనార్హం. ఇదిలావుంటే ప్లాటినంపైనా దిగుమతి సుంకం పెరిగింది. 6.4 శాతం నుంచి 15.4 శాతానికి చేరింది.

**ఇదీ సంగతి..**

దేశీయ దిగుమతుల్లో ముడి చమురు తర్వాత ఎక్కువగా ఉంటున్నవి బంగారం దిగుమతులే. అయితే అమెరికా-ఇరాన్ యుద్ధంతో తగ్గిన క్రూడాయిల్ సరఫరా, అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ధరలు భారత్‌కు ఇబ్బందికరంగా మారుతున్నాయి. యుద్ధానికి ముందు బ్యారెల్ ముడి చమురు ధర 73 డాలర్లుగా ఉన్నది. ఇప్పుడది 110 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది. ఏప్రిల్ 30న 4 ఏండ్ల గరిష్ఠాన్ని తాకుతూ 126 డాలర్లు పలికింది. దేశీయ ఇంధన అవసరాల్లో 87 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి మరి. ఇందులో 46 శాతం యుద్ధం కారణంగా మూతబడిన హోర్ముజ్ జలసంధి ద్వారానే చేరుతున్నాయి. అలాగే 60 శాతం ఎల్‌పీజీ అవసరాలు దిగుమతులే తీర్చుతున్నాయి. వీటిలో 90 శాతానికిపైగా గల్ఫ్ దేశాల నుంచే వస్తున్నాయి.

కాగా, ఖరీదెక్కిన క్రూడ్‌తో ఎరువుల కొనుగోళ్లు సైతం భారంగా మారాయి. ఈ తరుణంలో దేశంలోని ఫారెక్స్ రిజర్వులు వేగంగా కరిగిపోతున్నాయి. పెరుగుతున్న ధరలతో ఎక్కువగా చెల్లింపులు చేయాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలోనే బంగారం దిగుమతుల్ని తగ్గించుకుంటే అలా మిగిలిన ఫారెక్స్ రిజర్వులను ఇతర చమురు, చమురేతర దిగుమతులకు వినియోగించుకోవచ్చన్నదే కేంద్ర ప్రభుత్వం భావన. అందుకే ఈ సుంకాల పెంపు అని ప్రభుత్వ పెద్దల మాట. అంతేగాక డాలర్‌తో పోల్చితే ఆల్‌టైమ్ గరిష్ఠాలకు దిగజారుతున్న రూపాయి మారకం విలువకు కూడా దన్ను లభిస్తుందని అంటున్నారు. దిగుమతిదారుల నుంచి డాలర్లకు తగ్గే డిమాండ్ రూపీకి లాభిస్తుందన్నది వారి వాదన.

**దుబాయ్ నుంచి వెల్లువలా..**

దేశంలోకి దిగుమతయ్యే బంగారం, వెండిపై సుంకాలు భారీగా పెరిగిన నేపథ్యంలో దుబాయ్ నుంచి పెద్ద ఎత్తున గోల్డ్, సిల్వర్ రావచ్చని జీటీఆర్ఐ అంచనా వేస్తున్నది. ఆ దేశంతో భారత్‌కున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమే ఇందుకు కారణం అంటున్నది. ఇతర దేశాలతో పోల్చితే దుబాయ్ నుంచి వచ్చే పసిడి, వెండి దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం 1 శాతం సుంకాన్ని తక్కువగా వసూలు చేస్తున్నది. దీంతో ఇప్పుడు 14 శాతమే వర్తించనున్నది. ఈ క్రమంలో అక్కడి నుంచి నగల వ్యాపారులు ఎక్కువగా కొనుగోలు చేయవచ్చని జీటీఆర్ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాత్సవ అంచనా వేస్తున్నారు. ఇక వెండిపై 7-8 శాతం సుంకాలే పడవచ్చన్నారు.

ఇదిలావుంటే కరెంట్ ఖాతా లోటు (క్యాడ్)ను అదుపు చేయడానికి బంగారం, వెండి దిగుమతులపై సుంకాలనే పెంచనక్కర్లేదని రిటైల్ జ్యుయెల్లర్స్ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ నిర్ణయంతో దేశీయ మార్కెట్.. ముఖ్యంగా చిన్న, మధ్యతరహా సంస్థలు, పరిశ్రమలు కుదేలవుతాయన్న ఆందోళనను వెలిబుచ్చుతున్నారు. దిగుమతి కోటాలను లేదా బంగారం, వెండిపై లైసెన్సింగ్ పరిమితులతో కూడా క్యాడ్‌ను అదుపు చేయవచ్చని చెప్తున్నారు. మరోవైపు స్మగ్లింగ్ పెరిగే వీలుండటంతో ఆ దిశగా రెవెన్యూ ఇంటెలిజెన్స్, కస్టమ్స్ అధికారులు నిఘా పెంచుతున్నారు. నౌకాశ్రయాలు, విమానాశ్రయాల్లో మరింత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్తున్నారు.

**ఇండ్లలోని బంగారం బయటకు రావాలి**

దేశంలోని ప్రజల వద్ద పెద్ద ఎత్తున బంగారం ఉండటంతో దాన్ని బయటకు తెస్తే దిగుమతులపై భారాన్ని తగ్గించవచ్చని నగల వ్యాపారులు అంటున్నారు. నిజానికి 2015లో ఈ ఉద్దేశంతోనే మోదీ సర్కార్ పసిడి నగదీకరణ పథకాన్ని తెచ్చింది. అయితే దీనికి తగినంత స్పందన లేకపోవడంతో 2025లో ఆపేసింది. అయినప్పటికీ స్వల్ప కాలపరిమితితో బ్యాంకుల ఇష్టప్రకారం కొనసాగించుకొనే వెసులుబాటును కల్పించింది. ఇక ఈ పథకంలో దాదాపు 39,044 కిలోల బంగారాన్ని ప్రజలు, సంస్థలు, మదుపర్లు ఇతరత్రా మార్గాల ద్వారా సమీకరించినట్టు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. డిజిటల్ గోల్డ్‌ను ప్రోత్సహించేలా గతంలోనే సావరిన్ గోల్డ్ బాండ్ పథకాన్ని కూడా కేంద్రం అమలు చేసిన సంగతి విదితమే. అయితే అధిక ధరల నేపథ్యంలో భారంగా మారడంతో ప్రభుత్వం నిరుడు దీన్ని ఆపేసింది.

**రూ.8,550 పెరిగిన తులం బంగారం**

దిగుమతి సుంకాల పెంపు సెగ.. దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలను గట్టిగానే తాకింది. బుధవారం ఒక్కరోజే ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పసిడి రేటు రూ.8,550 ఎగబాకి రూ.1,65,350 (అన్ని పన్నులు సహా)కి చేరింది. కిలో వెండి విలువ రూ.20,500 పుంజుకొని రూ.2,97, 500 (అన్ని పన్నులు సహా)గా నమోదైందని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. ఇక గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ రేటు స్వల్పంగా తగ్గి 4,700.86 డాలర్లుగా ఉన్నది. వెండి ధర మాత్రం కొద్దిగా పెరిగి 87.45 డాలర్లుగా ట్రేడైంది. కాగా, హైదరాబాద్ విషయానికొస్తే.. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి విలువ ఈ ఒక్కరోజే రూ.7,350 ఎగసి రూ.1,48,500గా ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా చైనా తర్వాత భారత్‌లోకే అధికంగా పసిడి దిగుమతులు.

2025-26లో 721.03 టన్నుల దిగుమతి. 2024-25లో 757.09 టన్నులు.

2025-26లో దిగుమతుల విలువ ఆల్‌టైమ్ హైని తాకుతూ 71.98 బిలియన్ డాలర్లు (రూ.6.89 లక్షల కోట్లు).

దేశంలోని నగల పరిశ్రమ ద్వారానే అత్యధికంగా బంగారం దిగుమతులు.

ఆర్బీఐ వద్ద 880.52 మెట్రిక్ టన్నుల పసిడి నిల్వలు.

దేశ ప్రజల దగ్గర దాదాపు 30వేల టన్నుల బంగారం. దీని విలువ సుమారు 5 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.480 లక్షల కోట్లు)పైనే.

గత ఆర్థిక సంవత్సరం దేశంలోకి 102.5 బిలియన్ డాలర్ల విలువైన బంగారం, వెండి దిగుమతులు. 2024-25తో పోల్చితే 26.7 శాతం ఎక్కువ.

దేశీయ దిగుమతుల్లో 2024-25తో చూస్తే 2025-26లో బంగారం, వెండి దిగుమతుల వాటా 11.8 శాతం నుంచి 14 శాతానికి పెరుగుదల.

అంతర్జాతీయంగా 2024-25లో కిలో బంగారం రేటు 76,617.48 డాలర్లుగా ఉన్నది. 2025-26లో అది 99,825. 38 డాలర్లకు ఎగిసింది.

దేశీయ మార్కెట్‌లో 2024 డిసెంబర్ 31న 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం రేటు రూ.78,950గా ఉన్నది. 2025 డిసెంబర్ 31న రూ.1,37,700.


ఈ ఏడాది జనవరి 29న తులం పుత్తడి తొలిసారి రూ.1,83,000గా నమోదైంది. కిలో వెండి విలువ రూ.4,04,500.

# కోహ్లీ నూరు.. కోల్‌కతా బేజారు

**రాయ్‌పూర్:** డిఫెండింగ్ చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మరోసారి 'టాప్' లేపే ఆటతో దుమ్మురేపింది. బంతితో ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినా ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లీ (60 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లతో 105 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగిన వేళ.. ఈ సీజన్‌లో ఆ జట్టు ఎనిమిదో విజయంతో పాయింట్ల పట్టికలో మళ్లీ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఓడించిన ఆర్‌సీబీ.. ప్లేఆఫ్స్‌కు అడుగుదూరంలో నిలిచింది. కేకేఆర్ నిర్దేశించిన 193 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' కోహ్లీకి అండగా దేవదత్ పడిక్కల్ (27 బంతుల్లో 39, 7 ఫోర్లు) రాణించాడు. తొలుత అంగ్‌క్రిష్ రఘువంశీ (46 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 71 ), రింకూ సింగ్ (29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌తో 49 నాటౌట్) రాణించడంతో కోల్‌కతా నిర్ణీత ఓవర్లలో 192/4 స్కోరు చేసింది. వరుసగా నాలుగు విజయాల తర్వాత కేకేఆర్‌కు ఇది తొలి ఓటమి కాగా ఓవరాల్‌గా ఆరో పరాభవంతో ప్లేఆఫ్స్ అవకాశాలను దాదాపుగా వదులుకుంది.

**కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్**

ఛేదనలో బెథెల్ (15) మరోసారి తేలిగ్గానే వికెట్ సమర్పించుకున్నా గత రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన కోహ్లీ.. ఈసారి రెచ్చిపోయి ఆడాడు. వైభవ్ తొలి ఓవర్లోనే నాలుగు బౌండరీలు బాదిన రన్ మెషీన్.. పడిక్కల్ అండగా చెలరేగి ఆడాడు. 21 పరుగుల వద్ద అతడు ఇచ్చిన క్యాచ్‌ను కవర్స్ వద్ద పావెల్ జారవిడవడంతో ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కోహ్లీ.. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. వరుస బౌండరీలతో పరుగుల వేటకు దిగిన పడిక్కల్ సైతం బ్యాట్ ఝుళిపిస్తూ బౌండరీలతో రెచ్చిపోగా పది ఓవర్లలో బెంగళూరు 101/1తో సాఫీగా లక్ష్యం వైపుగా సాగింది. అదే జోరుతో కోహ్లీ.. 32 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. అయితే రెండో స్పెల్‌లో బంతినందుకున్న కార్తీక్.. పడిక్కల్‌ను ఆఫ్ కట్టర్‌తో బోల్తా కొట్టించి 59 బంతుల్లోనే 92రన్స్ జోడించిన మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. రజత్ పాటీదార్ (11), టిమ్ డేవిడ్ (2) నిరాశపరిచినా కోహ్లీ మాత్రం రెచ్చిపోయి ఆడాడు. అనుకుల్ ఓవర్లో 4, 6తో 90ల్లోకి వచ్చిన అతడు.. అరోరా 19వో ఓవర్లో సింగిల్‌తో మెగా లీగ్‌లోరెండేళ్ల తర్వాత మరో సెంచరీని నమోదుచేశాడు. జితేశ్ (8 నాటౌట్)తో కలిసి లాంఛనాన్ని పూర్తిచేశాడు.



**రఘువంశీ పోరాటం..**

నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్‌లో రఘువంశీ ఆటే హైలైట్. ఓపెనర్లు విఫలమైనా పటిష్టమైన బౌలింగ్ లైనప్ కల్గిన బెంగళూరు బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కున్న అతడు.. మొదట కామెరాన్ గ్రీన్ (24 బంతుల్లో 32), తర్వాత రింకూతో కలిసి కోల్‌కతాను నిలబెట్టాడు. గత మ్యాచ్‌లో సెంచరీతో రెచ్చిపోయిన అలెన్ (18) డఫీ వేసిన రెండో ఓవర్లో 4, 6, 4తో దూకుడు మీదే కనిపించినా ఆ మరుసటి ఓవర్లోనే భువీ బౌలింగ్‌లో కీపర్ జితేశ్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆ జట్టు తొలి వికెట్ కోల్పోయింది. రహానే (19).. మళ్లీ నిరాశపరచడంతో కేకేఆర్ 5 ఓవర్లలో 49/2గా నిలిచింది. ఈ దశలో రఘువంశీ.. గ్రీన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించాడు. కృనాల్ ఓవర్లో 6, 4తో గేర్ మార్చాలని చూసిన గ్రీన్‌ను రసిఖ్ 13వ ఓవర్లో క్లీన్‌బౌల్డ్ చేయడంతో 68 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. డఫ్ఫీ బౌలింగ్‌లో సింగిల్‌తో ఈ సీజన్‌లో నాలుగో అర్ధశతకం సాధించిన రఘువంశీకి రింకూ జతకలవడంతో కేకేఆర్ ఓవర్‌కు పది పరుగులకు తగ్గకుండా రాబట్టి మంచి స్కోరు చేసింది.

14,000 టీ20ల్లో కోహ్లీ 14వేల రన్స్ పూర్తి చేసుకున్నాడు. వేగంగా (409 ఇన్నింగ్స్) ఈ ఘనత సాధించిన తొలి ప్లేయర్‌గా నిలిచాడు.9

9 ఐపీఎల్‌లో కోహ్లీకి ఇది అత్యధికంగా తొమ్మిదో సెంచరీ. బట్లర్ 7 శతకాలతో రెండో స్థానంలో ఉన్నాడు.

సంక్షిప్త స్కోర్లు

కోల్‌కతా: 20 ఓవర్లకు 192/4 (రఘువంశీ 71, రింకూ 49లి, భువనేశ్వర్ 1/34, హేజిల్‌వుడ్ 1/35);


బెంగళూరు: 19.1 ఓవర్లకు 194/4 (కోహ్లీ 105లి, పడిక్కల్ 39, త్యాగి 3/32)

## స్పోర్ట్స్

### విదేశీ కోచ్‌లే కావాలా.. మేం పనికిరామా?

**హాకీ ఇండియాపై శ్రీజేష్ ధ్వజం**

**జూనియర్ జట్టు కోచ్‌గా తనను తప్పించడంపై అసంతృప్తి**



**న్యూఢిల్లీ:** భారత హాకీ దిగ్గజం, మాజీ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్ హాకీ ఇండియా (హెచ్ఐ)తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. భారత జూనియర్ జట్టు కోచ్‌గా అద్భుత ఫలితాలు సాధించిన తనను పక్కన పెట్టిన హెచ్ఐ విదేశీ కోచ్ వైపు మొగ్గు చూపుతోందని ఆరోపించాడు. ఆటగాడిగా దేశానికి రెండు ఒలింపిక్ కాంస్య పతకాలు అందించిన శ్రీజేష్ జూనియర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జట్టును విజయపథంలో నడిపాడు. జూనియర్ వరల్డ్ కప్‌లో కాంస్యం సహా శ్రీజేష్ పర్యవేక్షణలో జట్టు ఆడిన ప్రతి టోర్నీలోనూ పోడియంపైకి రావడం విశేషం. అయితే, గత డిసెంబర్‌తో ముగిసిన శ్రీజేష్ కాంట్రాక్టును రెన్యువల్ చేయని హెచ్ఐ భారత సీనియర్ జట్టు హెడ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ సూచన మేరకు జూనియర్ జట్టుకు కూడా విదేశీ కోచ్ ఉండాలని భావిస్తోంది. ఫ్రాన్స్‌కు చెందిన ఐమెరిక్ బెర్మాంగోను నియమించేందుకు కసరత్తు చేస్తోంది. దీనిపై శ్రీజేష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'జట్టు ప్రదర్శన బాలేనప్పుడు కోచ్‌ను మారుస్తారు. కానీ, వరల్డ్ కప్ పతకం అందించినా విదేశీ కోచ్ కోసం నన్ను తప్పించడం ఎంతవరకు సమంజసం? సీనియర్, జూనియర్ కోచ్‌ల మధ్య సమన్వయం కోసం విదేశీ కోచ్ కావాలని చెబుతున్నారు. ఒక భారత కోచ్‌తో ఫుల్టన్ ఎందుకు సమన్వయం చేసుకోలేడు?' అని శ్రీజేష్ ప్రశ్నల వర్షం కురిపించాడు. హాకీ ఇండియా ప్రెసిడెంట్ దిలీప్ టిర్కీ మినహా ఫెడరేషన్‌లోని అధికారులంతా స్వదేశీ కోచ్‌నే కోరుకుంటున్నారని తెలిపాడు. ఇక, మార్చి 7న కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో జరిగిన సమావేశాన్ని శ్రీజేష్ గుర్తు చేసుకున్నాడు. '2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును నడిపించేందుకు నాలాంటి కోచ్‌లు కావాలని మంత్రి చెప్పారు. కానీ హాకీ ఇండియా మాత్రం విదేశీయులనే నమ్ముకుంటోంది' అని ఆవేదన వ్యక్తం చేశాడు. తన కంటే రాబోయే విదేశీ కోచ్ ఏ విధంగా మెరుగో నిరూపించాలని శ్రీజేష్ డిమాండ్ చేశాడు.

వార్తాతరంగాలు శుక్రవారం 15 మే 2026



## శర్వానంద్--శ్రీను వైట్ల క్రేజీ కాంబో.. హీరోయిన్‌గా మానస!

శర్వానంద్ వరుస విజయాలతో దూసుకుపోతూ ఇప్పుడు కామెడీ కింగ్ శ్రీను వైట్లతో కొత్త ప్రాజెక్ట్‌ను ఖరారు చేశారు. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో కూడిన ఈ సినిమా వినోదానికి సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ జోడించబోతున్నట్లు సమాచారం. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత అనిల్ సుంకర నిర్మాణంలో జులై 2026 నుంచి షూటింగ్ ప్రారంభమై వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో శర్వానంద్ సరసన నటించబోయే హీరోయిన్‌గా మొదట పూజా హెగ్డే, మమితా బైజు వంటి స్టార్ హీరోయిన్ల పేర్లు ప్రచారంలోకి వచ్చినా తాజా సమాచారం ప్రకారం 'మిస్ ఇండియా' రన్నరప్ మానస వారణాసి ఎంపికైనట్లు టాలీవుడ్ టాక్. ఇటీవల 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాలో తన నటనతో మానస మంచి గుర్తింపు తెచ్చుకుంది. దాంతో మానస, శర్వాతో జోడీ కట్టడం ఫ్రెష్ ఫీల్‌ను తెస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ తుది దశలో ఉంది. త్వరలోనే హీరోయిన్‌తో పాటు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రస్తుతం సంపత్ నంది దర్శకత్వంలో 1960ల నాటి పీరియడ్ డ్రామా 'భోగి' షూటింగ్‌లో శర్వానంద్ బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఉత్తర తెలంగాణ – మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ స్టోరీని పాన్ ఇండియా రేంజ్‌లో నిర్మిస్తున్నారు. ఇందులో రోహిత్ పాఠక్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. 'భోగి' చిత్రం ఆగష్టు 28, 2026న థియేటర్లలో విడుదల కానుంది.

## వన్స్‌మోర్.. అల్లు అర్జున్‌తో 'బుట్టబొమ్మ' రొమాన్స్..!




టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ ప్రస్తుతం రాకా సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఇదిలా ఉంటే మరోవైపు తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చేశాడు. ఏఏ23గా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త మూవీ లవర్స్‌ను ఎక్జయిటింగ్ అయ్యేలా చేస్తోంది. పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డే ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించనుందట.

పూజా హెగ్డే ఇప్పటికే బన్నీతో కలిసి దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురంలో సినిమాల్లో నటించింది. సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసిన ఈ బుట్టబొమ్మ మరోసారి అల్లు అర్జున్‌తో నటించబోతుందన్న వార్తను మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు, ఫాలోవర్లు ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఏఏ23 ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. అల్లు అర్జున్ నటిస్తోన్న రాకా షూటింగ్ పూర్తయిన తర్వాత ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లనుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి అనిరుద్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. గతేడాది రజినీకాంత్ టైటిల్ రోల్‌లో నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది. విజయ్‌తో నటించిన జయనాయగన్ విడుదలకు రెడీ అవుతోంది. తెలుగులో దుల్కర్ సల్మాన్ ణు41లో హీరోయిన్‌గా నటిస్తోంది. మరోవైపు తమిళంలో నటిస్తోన్న కాంచన 4 చిత్రీకరణ దశలో ఉంది.



## ఇక 7 రోజులు మాత్రమే'.. బర్త్ డేకు బిగ్ సర్‌ప్రైజ్

జూనియర్ ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తోన్న పీరియాడికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ డ్రాగన్(ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో కాంతార బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈనెల 20న యంగ్ టైగర్ బర్త్ డేకు ఏదైనా సర్‌ప్రైజ్ ఇస్తారా? అని వెయిటింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ నెల 20న జూనియర్ బర్త్ డే సందర్భంగా డ్రాగన్ ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. ఇంకా కేవలం 7 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని చిత్ర బృందం ట్వీట్ చేసింది. దీంతో యంగ్ టైగర్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. కాగా.. ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ యేర్నెని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది థియేటర్లలో సందడి చేయనుంది.



## సమంత 'మా ఇంటి బంగారం' కొత్త రిలీజ్ డేట్.. యాంగ్రీ లుక్‌తో అదిరిపోయిన పోస్టర్!

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మా ఇంటి బంగారం'పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఫీమేల్ సెంట్రిక్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తుండటంతో సినీ అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. మొదట ఈ సినిమాను మే 15న విడుదల చేయాలని మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీ రిలీజ్ వాయిదా పడింది. దీంతో అభిమానులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. తాజాగా చిత్రబృందం అధికారిక ప్రకటనతో క్లారిటీ ఇచ్చింది. 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సంప్రదాయ పట్టుచీరలో కనిపిస్తున్న సమంత చేతిలో తుపాకీ పట్టుకుని సీరియస్, యాంగ్రీ లుక్‌లో కనిపించడం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. పోస్టర్‌ను చూస్తుంటే సినిమాలో ఆమె పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై మంచి బజ్ ఏర్పడగా.. తాజా పోస్టర్ ఆ హైప్‌ను మరింత పెంచింది. ముఖ్యంగా సమంత గత కొంతకాలంగా విభిన్న కథలను ఎంచుకుంటూ నటిగా కొత్త కోణాలను చూపిస్తోంది. ఈ క్రమంలో 'మా ఇంటి బంగారం' కూడా ఆమె కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు సినిమాకు అదనపు బలంగా నిలుస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక సమంతకు గత కొంతకాలంగా సోలో హిట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.



## ఉదయ్ కిరణ్ హీరోయిన్ మూవీ.. రిలీజ్ ఎప్పుడంటే?

నాజర్, అంజలి ప్రధాన పాత్రల్లో వస్తోన్న ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్ ముసలోడికి దసరా పండుగ. ఈ సినిమాకు మనోహర్ దర్శకత్వం వహించారు. రమణా ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మాత రమణ వాళ్లె నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా మే 15న థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే రిలీజైన ట్రైలర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సందర్భంగా నిర్మాత రమణ మాట్లాడుతూ.. "ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే రెండు గంటల పాటు కష్టాలన్నీ మర్చిపోయి హాయిగా నవ్వుకునేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాం. సినిమా అవుట్‌పుట్ పట్ల మేము చాలా ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా ప్రతి ఒక్కరికి నచ్చుతుందని నమ్మకముంది. ఈ సినిమాను మా పితృ సమానులు దివంగత దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు అంకితమిస్తున్నాం" అని తెలిపారు. ఈ సినిమాలో అనిత (నువ్వు నేను ఫేం), కోవై సరళ, శరణ్య, సత్య కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీకి డి. ఇమాన్ సంగీతమందించారు.

# రైతులకు గుడ్ న్యూస్



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరలను పెంపునకు ఆమోదం తెలిపింది. ఖరీఫ్ పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రూ.2.6 లక్షల కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. అగ్రికల్చర్ కాస్ట్ ప్రైసెస్ కమిషన్ సిఫార్సుల మేరకు వివిధ పంటలకు కనీస మద్దతు ధరలను కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. క్వింటా వరికి కనీస మద్దతు ధరను రూ.72 పెంచి రూ.2,441 చెల్లించాలని నిశ్చయించింది. క్వింటా జొన్న కనీస మద్దతు ధరను రూ.4,023కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

"ఏడాదికి 824.41 లక్షల మిలిటన్ టన్నుల పంట సేకరణ చేస్తున్నాం. పంట ఖర్చుకు అదనంగా 50 శాతం కనీస మద్దతు ధరగా నిర్ణయం చేశాం. 2014-26 మధ్య ఖరీఫ్ పంటలకు రూ.19 లక్షల కోట్ల కనీస మద్దతు ధర చెల్లించాం. 2014-26 మధ్య 8,746 లక్షల మిలిటన్ టన్నుల ఖరీఫ్ పంట సేకరించాం. యూపీఏ హయాం కంటే నాలుగు రెట్లు అధికంగా రైతులకు ఖరీఫ్ చెల్లింపులు చేస్తున్నాం" అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

**పంటల వారీగా కనీస మద్దతు ధర**

మోదీ సర్కార్ రైతులకు మేలు చూకూరేలా ఈసారి ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరలను ప్రకటించింది. వాటి వివరాలు ఇప్పుడు చూద్దాం.

క్వింటా వరికి కనీస మద్దతు ధర రూ.2,441
క్వింటా వరి(ఏ-గ్రేడ్)కి కనీస మద్దతు ధర రూ.2,461
క్వింటా జొన్నలు (హైబ్రిడ్) కనీస మద్దతు ధర రూ.4,023
క్వింటా జొన్నలు (మల్దండి) కనీస మద్దతు ధర రూ.4,073
క్వింటా సజ్జల కనీస మద్దతు ధర రూ.2900
క్వింటా రాగుల కనీస మద్దతు ధర రూ.5,205
క్వింటా మొక్కజొన్నల కనీస మద్దతు ధర రూ.2,401
క్వింటా కందుల కనీస మద్దతు ధర రూ.8,415
క్వింటా పెసల కనీస మద్దతు ధర రూ.8,780
క్వింటా మినుముల కనీస మద్దతు ధర రూ.8,200
క్వింటా పత్తి (మధ్యశ్రేణి) కనీస మద్దతు ధర రూ.8,267
క్వింటా పత్తి (దీర్ఘ శ్రేణి) కనీస మద్దతు ధర రూ.8,667
క్వింటా పల్లి కనీస మద్దతు ధర రూ.7,517
క్వింటా ప్రొద్దుతిరుగుడు విత్తనాల కనీస మద్దతు ధర రూ.8,343
క్వింటా సోయాబీన్ (ఎల్లో) కనీస మద్దతు ధర రూ.5,708

**కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి కేటాయింపులు**

స్వచ్ఛమైన ఇంధన (క్లీన్ ఎనర్జీ) ఉత్పత్తిని పెంపొందించడం, విదేశీ మారక ద్రవ్యాన్ని భారీగా హరించే దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం లక్ష్యంగా బొగ్గు గ్యాసిఫికేషన్? ప్రాజెక్టులను ప్రోత్సహించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం రూ.37,500 కోట్ల మేర ప్రోత్సాహకానికి మంత్రిమండలి బుధవారం ఆమోదం తెలిపింది.

"ఈ కోల్ గ్యాసిఫికేషన్ కోసం రూ.37,500 కోట్లను కేటాయించాం. దీని ద్వారా దాదాపు రూ.3000 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాం. అలాగే 75 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫై చేయడానికి ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం జరుగుతుంది" అని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. మన దేశంలో ప్రస్తుతం 401 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఇవి రానున్న 200 ఏళ్లకు సరిపోతాయని వైష్ణవ్ పేర్కొన్నారు. "ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల గురించి మనందరికీ తెలుసు. కాబట్టి మనం ఆత్మనిర్భర్ (స్వయం సమృద్ధి)గా మారడానికి అన్ని రకాల నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే బొగ్గు గ్యాసిఫికేషన్?పై ఈ రోజు ఒక పెద్ద నిర్ణయం తీసుకోవడం జరిగింది" అని వైష్ణవ్? చెప్పారు.

కోల్ గ్యాసిఫికేషన్ అంటే పొడి బొగ్గును సింథటిక్ గ్యాస్? (సింగ్యాస్?)గా మార్చే ప్రక్రియ. దీనిని ప్రత్యామ్నాయ ఇంధనంగా ఉపయోగిస్తారు. ఇది కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ ప్రక్రియ ద్వారా మిథనాల్, ఎరువులు, హైడ్రోజన్?, రసాయనాల ఉత్పత్తి చేయడానికి వీలవుతుంది. దీని వల్ల మనం దిగుమతి చేసుకునే చమురు (83 శాతం), మిథనాల్? (90 శాతానికి పైగా), అమ్మోనియా (13-15 శాతం)పై ఆధారపడడం తగ్గుతుంది. అంతేకాదు ఇది ఎల్?ఎన్?జీ, యూరియా, అమ్మోనియం నైట్రేట్?, అమ్మోనియా, కోకింగ్ కోల్ లాంటి వాటి దిగుమతులపై ఆధారపడడం తగ్గిస్తుంది. అదే సమయంలో దేశీయ వనరుల వినియోగాన్ని పెంచి స్వయంసమృద్ధిని ప్రోత్సహిస్తుంది. అందుకే 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ సామర్థ్యాన్ని సాధించాలని దేశం లక్ష్యంగా పెట్టుకుంది.

# హిందూయిజం ఒక జీవన విధానం

హిందూయిజం అనేది జీవన విధానమని, ఈ విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి గుడికి వెళ్లడం లేదా పూజలు చేయడం తప్పనిసరేం కాదని తొమ్మిది మంది న్యాయమూర్తుల సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. హిందూయిజంపై విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి ఇంట్లో ఒక దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుందని తేల్చి చెప్పింది. కేరళలోని శబరిమల ఆలయం సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లతో పాటు దావూదీ బోహ్రాలతో సహా పలు మతాలు పాటించే మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరిపే క్రమంలో బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి కూడా ఉన్నారు. శబరిమల ఆలయ ప్రవేశ తీర్పును 2018 సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు ఇచ్చింది. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 10 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని



4:1 మెజారిటీతో ఆనాడు సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. 2018 నాటి ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పునస్సమీక్ష పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. దీనిపై తమ వాదనలను కూడా వినాలంటూ పలువురు మధ్యంతర పిటిషన్లు దాఖలు చేశారు. ఈ విచారణలో భాగంగా 15వ రోజున (బుధవారం) మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జి. మోహన్ గోపాల్ వాదనలు వినిపించారు.

**ఇప్పుడందరూ వేదాలను అంగీకరిస్తున్నారా?**

"హిందూ మతంలోని పలు వర్గాల నుంచే సామాజిక న్యాయం కోసం డిమాండ్ వస్తోంది. హిందూయిజాన్ని ఒక మత వర్గంగా నిర్వచించారు. మతం, తత్వశాస్త్రానికి సంబంధించిన అన్ని విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరించేవాడే హిందువు అని 1966లో తీర్పు ఇచ్చారు. హిందువులందరి అభిప్రాయాలను తీసుకోకుండానే గతంలో కోర్టులు ఈవిధంగా ఒక నిర్ణయానికి వచ్చాయి. హిందువుల్లో ఎవ్వరూ ఎప్పుడూ అలా చెప్పలేదు. నాకు వేదాల పట్ల అత్యంత గౌరవం, గొప్ప ఆరాధనా భావం ఉన్నాయి. కానీ, నేడు హిందువులుగా వర్గీకరించిన ప్రతి ఒక్కరూ అన్ని ఆధ్యాత్మిక, తాత్విక విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరిస్తున్నారు అన్నది వాస్తవమేనా?" అని మధ్యంతర పిటిషన్ దాఖలుచేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జి. మోహన్ గోపాల్ సుప్రీంకోర్టులో వాదన వినిపించారు.

**అందుకే హిందూ మతాన్ని జీవన విధానం అంటారు**

ఈ వాదనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ, "అందుకే హిందూ మతాన్ని ఒక జీవన విధానం అంటారు. ఒక హిందువు హిందువుగా ఉండటానికి తప్పనిసరిగా గుడికి వెళ్లడం గానీ, ఏదైనా ఆచారం పాటించడం గానీ అవసరం లేదు" అని ఆమె పేర్కొన్నారు. "ఆచారబద్ధంగా ఉండాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ విశ్వాసాన్ని కలిగి ఉండటానికి ఎవరూ అడ్డు రాలేరు" అని జస్టిస్ నాగరత్న తెలిపారు. "ఒక వ్యక్తి హిందూ మత విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి, గుడిసెలో దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈసందర్భంగా కీలక వ్యాఖ్య చేశారు.

# రోడ్లపైకి వచ్చి జెన్-జీ నిరసనలు చేపట్టాలి

నీట్-యూజీ 2026 పరీక్షలో పేపర్ లీకేజీలు, అక్రమాల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పరీక్ష రద్దు అయిన సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జెన్-జీ (యువత) రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలియజేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్? అరవింద్ కేజ్రీవాల్ బుధవారం పిలుపునిచ్చారు. 2014 నుంచి ఇప్పటి వరకు దేశంలో 93 కంటే ఎక్కువ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయన్నారు. దీని వల్ల 6కోట్లకు పైగా యువత ప్రభావితమయ్యారని ఆరోపించారు. తాజా నీట్?-యూజీ పేపర్ లీకేజీల్లో సీనియర్ నాయకుల ప్రమేయం ఉందనే అర్థం వచ్చేలా కేజ్రీవాల్ మాట్లాడారు. కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ ఏవైనా దిద్దుబాటు చర్యలు తీసుకోగలదా? అని జెన్?-జీని ప్రశ్నించారు.

"2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 93 పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయి. వాటిలో మెజారిటీ పేపర్ లీకేజీలు రాజస్థాన్, యూపీ, ఉత్తరాఖండ్?, గుజరాత్? లాంటి బీజేపీ ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లోనే జరిగాయి. దీనివల్ల 6 కోట్ల మంది యువత నష్టపోయారు. అయితే ఈ రాష్ట్రాల్లో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు ఉండడం కేవలం యాదృచ్ఛికం కాదు. ఇటీవలి నీట్ పేపర్ లీకేజీకి రాజస్థాన్ కేంద్ర బిందువుగా మారిందని పలు నివేదికలు చెబుతున్నాయి. ఇది ఒక అనుమానాన్ని కలిగిస్తోంది. ఈ కేసులో వారి నాయకుల ప్రమేయం ఉందా? అదే నిజమైతే, సీబీఐ మాత్రం ఏం చేయగలదు? నేను జెన్?-జీని ఓ విషయం అడగాలని అనుకుంటున్నాను. ఇది ఇలాగే కొనసాగాలా? నేపాల్?, బంగ్లాదేశ్?లో జెన్?-జీ యువత రోడ్లపైకి వచ్చి వారి ప్రభుత్వాలనే మార్చగలిగినప్పుడు, మన యువత ఈ పేపర్ లీకేజీ ఘటనలో ప్రమేయం ఉన్న మంత్రులను జైలుకు పంపలేరా? మీపై నాకు పూర్తి నమ్మకం ఉంది. పేపర్ లీకేజీ విషయంలో ప్రమేయం ఉన్నవారిని నిలదీయండి. వారిని జైలుకు పంపండి. రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపండి. ఈ నీచమైన ఆటను ముగించండి."




**నీట్-యూజీ పరీక్షా విధానంలో సంస్కరణలు!**

నీట్-యూజీ నిర్వహణలో గల వ్యవస్థాగత వైఫల్యాలను చూపుతూ, పరీక్షా విధానంలో సంస్కరణలు కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అంతేకాదు, ఎన్?టీఏ స్థానంలో మరింత పటిష్టమైన, స్వయంప్రతిపత్తి గల సంస్థను ఏర్పాటు చేయాలని కోరింది. నీట్-యూజీ రీటెస్ట్‌ను పర్యవేక్షించడానికి రిటైర్డ్? సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన, సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్? నిపుణులతో కూడిన ఒక ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని ఫైమా విజ్ఞప్తి చేసింది.

**ఇంతకీ ఏం జరిగింది?**

మే 3న జరిగిన నీట్?-యూజీ పరీక్షను ఎన్?టీఏ రద్దు చేసింది. ఎందుకంటే అంతకు ముందే ఆ పేపర్ వాట్సాప్? ద్వారా లీక్ అయినట్లు వార్తలు వచ్చాయి. ప్రాథమిక దర్యాప్తులో అది వాస్తవమేనని తెలిసిందని, అందుకే పరీక్షను రద్దు చేసినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. మరోవైపు ఈ కేసు దర్యాప్తును కేంద్రం సీబీఐకు అప్పగించింది. మరోవైపు మే 2026 పరీక్ష కోసం అభ్యర్థులు నమోదు చేసుకున్న రిజిస్ట్రేషన్ డేటా, వివరాలు, ఎంచుకున్న పరీక్ష కేంద్రాలు మార్చుకోవాల్సిన అవసరం లేదని, రీటెస్ట్?కు అవి సరిపోతాయని ఎన్?టీఏ స్పష్టం చేసింది. అంతేకాదు పరీక్ష ఫీజు రీఫండ్ చేస్తామని, త్వరలో నిర్వహించనున్న నీట్?-యూజీ పరీక్షను పూర్తి ఉచితంగా నిర్వహిస్తామని, అదనపు రుసుములు వసూలు చేయమని పేర్కొంది. అయితే ఈ పరీక్ష తేదీల వివరాలు విడిగా మరోసారి చెబుతామని వెల్లడించింది. రీక్ష రద్దు వల్ల అభ్యర్థులు, వారి తల్లిదండ్రులకు కలిగే ఇబ్బందిని గుర్తించామన్న ఎన్‌టీఏ, సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని సూచించింది. మన దేశం వైద్యవిద్య కోసం అంటే, ఎంబీబీఎస్, బీడీఎస్ సహా ఇతర అండర్? గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్-యూజీ పరీక్ష నిర్వహిస్తారు. కాగా ఈ పరీక్షను మే 3న పెన్ అండ్ పేపర్ మోడ్‌లో నిర్వహించారు.

## నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో అరెస్టుల పరంపర

నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో అరెస్టుల పరంపర కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన సీబీఐ, ఐదుగురు నిందితులను అరెస్టు చేసింది. అంతకుముందు, మహారాష్ట్రలో ఓ మహిళను అరెస్ట్ చేసిన పోలీసులు ఆమెను సీబీఐకి అప్పగించారు. మరోవైపు చీూా తీరును నిరసిస్తూ దిల్లీలో ఏబీవీపీ కార్యకర్తలు భారీ ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. నాశిక్‌కు చెందిన శుభం ప్రశ్నాపత్రం కోసం 10 లక్షలు వెచ్చించాడని, దాన్ని 15 లక్షలకు అమ్ముకున్నట్లు తెలుస్తోంది.

**మహిళ అరెస్ట్- సీబీఐ అధికారులకు అప్పగింత**

నీట్ ప్రశ్నాపత్రం లీక్ కేసులో మహారాష్ట్రలోని బిబ్వేవాడి ప్రాంతానికి చెందిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఆమెను చాలాసేపు ప్రశ్నించిన తర్వాత సీబీఐ అధికారులకు అప్పగించారు. అయితే పేపర్ లీక్ వ్యవహారంలో ఆమె పాత్ర ఏంటన్న వివరాలను పోలీసులు వెల్లడించలేదు. తమకు వచ్చిన సమాచారం మేరకు ఆ మహిళను అరెస్టు చేశామన్న పోలీసులు, ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తున్నందున వారికే అప్పగించినట్లు తెలిపారు.

**ఏబీవీపీ, కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన**

మరోవైపు పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. దిల్లీలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కార్యాలయం వెలుపల ఏబీవీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. చీూాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకతన ఉండేలా చర్యలు తీసుకోవాలని నినదించారు. ఈ క్రమంలో ూదీవూ సభ్యులు ఎన్టీయే కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించడం ఉద్రిక్తతలకు తావిచ్చింది. బారికేడ్ల పైకి ఎక్కినవారిని పోలీసులు వెనక్కి లాగి పడేశారు. శాస్త్రి భవన్ వెలుపల కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలు నిర్వహించారు. 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని చీూఖ× కార్యకర్తలు మండిపడ్డారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని, చీూాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**రూ. 10 లక్షలు పెట్టి ప్రశ్నాపత్రం కాపీని కొనుగోలు**

నీట్ పేపర్ లీక్ కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. పుణెకు చెందిన ఓ వ్యక్తి నుంచి నాశిక్‌కు చెందిన శుభం ఖైర్నార్ 10 లక్షలు పెట్టి ప్రశ్నాపత్రం కాపీని కొన్నట్లు తెలిపారు. ఆ కాపీని 15 లక్షలకు హరియాణా వాసికి శుభం అమ్ముకున్నాడు. అనంతరం పేపర్ సెట్‌లు హరియాణా, రాజస్థాన్‌లోని పెద్ద కోచింగ్ సెంటర్లతో పాటు జమ్మూకశ్మీర్, బిహార్, కేరళకు కూడా వెళ్లినట్లు తెలుసుకున్నారు. వీటిని ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ల ద్వారా అమ్మినట్లు గుర్తించారు.

**పరీక్షకు 45 గంటల ముందే పేపర్ లీక్**

కాగా పరీక్షకు 45 గంటల ముందే పేపర్ లీక్ అయింది. ఈ లీక్ అయిన పేపర్‌లోని 108 కెమిస్ట్రీ ప్రశ్నలలో 45, 204 బయాలజీ ప్రశ్నలలో 90 అసలైన పరీక్షా పత్రంతో సరిపోలాయి. సికార్‌లోని కొందరు ఉపాధ్యాయుల చొరవతో వ్యవహారం బయటపడింది. సికార్ పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో వారు చీూాకు మెయిల్ పంపారు. ఎన్టీయే ఇచ్చిన సమాచారంతో ఇంటెలిజెన్స్ బ్యూరో రంగంలోకి దిగింది. ఈ విషయంపై దర్యాప్తు చేయాలని రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్- ూా+ను ఐబీ ఆదేశించింది. పేపర్ లీక్ నిజమే అని ఎస్‌వోజీ తెలపడంతో ఎన్టీయే పరీక్ష రద్దు నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ఇప్పటివరకు ప్రధాన నిందితులు మనీష్, రాకేష్ మంద్వారియాతో సహా రాజస్థాన్‌లో 15 మంది అరెస్టు ూా+ అరెస్టు చేసింది.

## బలపరీక్షలో నెగ్గిన విజయ్

తమిళనాడులో నూతనంగా కొలువుదీరిన విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం విశ్వాస పరీక్షలో గట్టెక్కింది. విజయ్‌కు అనుకూలంగా 144 ఓట్లు, వ్యతిరేకంగా 22 ఓట్లు వచ్చాయి. పీఎంకే, బీజేపీకి చెందిన మొత్తం ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా నిలిచారు. విజయ్ ప్రభుత్వం బల పరీక్షలో నెగ్గినట్టు స్పీకర్ జీజణ ప్రభాకర్ ప్రకటించారు. మే 13వ తేదీలోగా మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ ఆదేశించిన నేపథ్యంలో బుధవారం 'ఫ్లోర్ టెస్ట్' నిర్వహించారు. విశ్వాస పరీక్షపై తీర్మానాన్ని సీఎం విజయ్ ప్రవేశపెట్టారు. తమిళనాడు అసెంబ్లీ చర్చ సందర్భంగా తొలుత మాట్లాడిన కాంగ్రెస్ సభ్యులు తాము విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న తొలి మూడు నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత వాపక్షాలు విజయ్‌కు మద్దతు ప్రకటించాయి. సీఎం విజయ్ ప్రమాణస్వీకారానికి ముందు గవర్నర్ ఆర్లేకర్ పలుమార్లు తిరస్కరించిన తీరుపై సీపీఎం అభ్యంతరం వ్యక్తం చేసింది. తమిళనాడులో గవర్నర్ రూల్‌ను అడ్డుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం తమిళనాడు హక్కులను కాలరాస్తోందని సీపీఐ ఆరోపించింది. విజయ్ ఐదేళ్లపాటు కొనసాగాలని వీసీకే అశాభావం వ్యక్తం చేసింది. అయితే ఓఎస్?డీగా వ్యక్తిగత జ్యోతిష్యుడిని విజయ్ నియమించడంపై అభ్యతరం వ్యక్తం చేసింది. విజ్ఞానశాస్త్రానికి సీఎం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఏఎంఎంకే బహిష్కృత ఎమ్మెల్యే కామరాజు సైతం విజయ్‌కు మద్దతు ఇచ్చారు. ఒక్క ఎమ్మెల్యే ఉన్న డీఎండీకే సైతం విజయ్‌కు మద్దతు తెలిపింది.

**డీఎంకే వాకౌట్**

డీఎంకేతో పాటు అన్నాడీఎంకే పళనిస్వామి వర్గం వ్యతిరేకించాయి. బలపరీక్షకు ముందుగానే విజయ్, తమిళనాడు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని డీఎంకే నేత ఉధయనిధి స్టాలిన్ ఆరోపించారు. 65 శాతం తమిళనాడు ఓటర్లు విజయ్‌కి వ్యతిరేకంగా ఓటు వేశారని పేర్కొన్నారు. తమ కూటమి పక్షాలతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారని విజయ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమిళనాడులో రీల్ ప్రభుత్వం కాకుండా రియల్ ప్రభుత్వం ఉండాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఓటింగ్‌కు దూరంగా ఉంటామని చెబుతూ 59 ఎమ్మెల్యేలు ఉన్న డీఎంకే వాకౌట్ చేసింది.

## పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా రంగసామి ప్రమాణం

కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్‌డీఏ ప్రభుత్వం కొలువుతీరింది. ఎన్?డీఏ కూటమిలోని ఆల్ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్‌సీ) అధినేత ఎన్ రంగసామి ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. లోక్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ కే కైలాస్‌నాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతో పాటు ఇద్దరు మంత్రులు కూడా ప్రమాణం స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఎంపీ మన్సుఖ్ మాండవీయా అధిష్ఠాన ఇన్‌ఛార్జి నిర్మల్‌కుమార్ సురానా తదితరులు పాల్గొన్నారు. ఎన్నార్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు, బీజేపీ ఎమ్మెల్యే నమశ్శివాయం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే యానాం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మల్లాడి కృష్ణారావు తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం 30 అసెంబ్లీ స్థానాల్లో ఏఐఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి 18 స్థానాల్లో విజయం సాధించింది. ఏఐఎన్ఆర్ కాంగ్రెస్ 12, బీజేపీ 4, అన్నాడీఎంకే, ఎల్‌జేకే చెరో ఒక స్థానంలో గెలుపొందాయి. ఇక డీఎంకే, కాంగ్రెస్ కూటమి 6 సీట్లు, టీవీకే, స్వతంత్రులు చెరో మూడు స్థానాల్లో విజయం సాధించాయి.

**సింపుల్ లైఫ్‌స్టైల్‌తో రంగసామి**

పుదుచ్చేరిలోని తిలాస్‌పేట్టైలో 1950 ఆగస్టు 4న జన్మించిన రంగసామి, వాణిజ్యం, న్యాయశాస్త్రంలో డిగ్రీ చేశారు. కామరాజర్ అనుచరుడు. నటుడు శివాజీ గణేశన్‌కి వీరాభిమాని. ఇక రంగసామి హంగూ ఆర్భాటాలకు దూరంగా ఉంటూ సాధారణంగా జీవిస్తుంటారు. అవివాహితుడైన రంగసామి ఆయనది సింపుల్ లైఫ్‌స్టైల్. తురచూ బైక్?పై ప్రయణిస్తుంటారు. కాస్త ఖాళీ దొరికితే టెన్నిస్ ఆడుతూ కనిపిస్తారు. అందరి మధ్యా ఉంటూ క్రికెట్ చూడటం ఆయనకు బాగా ఇష్టం.

**1990లో రాజకీయాల్లోకి ఎంట్రీ**

పుదుచ్చేరి మాజీ మంత్రి పెట్టా పెరుమాళ్‌కు సహాయకుడిగా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. అలా 1990 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున తట్టంచావడి నంచి పోటీ చేయడంతో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. కానీ ఆ ఎన్నికల్లో 989 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత 1991, 1996, 2001, 2006 ఎన్నికల్లో అదే స్థానం నుంచి గెలుపొందారు. 1991లో మంత్రిగా, 2001, 2006లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్‌లో అంతర్గత సమస్యల కారణంగా 2008లో పదవికి రాజీనామా చేశారు. ఇక రంగసామి 2011 ఫిబ్రవరిలో ఆలిండియా ఎన్నార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించి, అదే ఏడాది శాసనసభ ఎన్నికల్లో మూడోసారి ముఖ్యమంత్రి అయ్యారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137